
డా॥ దేవులపల్లి రామానుజరావు



గ్రంథకర్త

డా॥ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి

తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్

డా॥ దేవులపల్లి రామానుజరావు

ప్రధాన సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా.జె.చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

గ్రంథకర్త

డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి

ప్రచురణ

తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, అబిడ్స్

హైదరాబాద్ - 500001

ఫోన్ : 040-24753724

2

SRI DEVULAPALLI RAMANUJARAO

Monograph

By

Dr. Gummannagari Bala Srinivasa Murthy

First Edition : August 2017

Copies : 1000

Price : Rs. 100/-

For Copies

Telangana Saraswatha Parishat

Tilak Road, Abids,

Hyderabad - 500001

Ph : 040-24753724

తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ
వారి ఆర్థిక సహాయంతో ప్రచురితం

DTP : Lakshmi Srinivas
9885021639

Printed at

Sai Likhita Printers

Khairatabad, Hyderabad

Ph : 040- 65545979

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : (ఆ) 24753724

అవతారిక

సేవానిరతి ప్రాశస్త్యాన్ని యౌవన ప్రాయంలోనే జీర్ణించుకుని అట్టి ఉత్తమాశయంతో యావజ్జీవితం శ్రమించిన వైతాళికమూర్తి డా. దేవులపల్లి రామానుజరావు గారు 1917. ఆగస్టు 25 న వరంగల్ జిల్లా బొల్లికుంట గ్రామంలో జన్మించిన డా. దేవులపల్లి రామానుజరావు గారు విద్యాధికులై న్యాయశాస్త్రంలో పట్టభద్రులైనారు. అయినప్పటికీ న్యాయవాద వృత్తి అవలంబించలేదు. అంతేకాదు ఆనాడు సులభతరంగా లభించే ఉన్నత ప్రభుత్వ పదవి ఏదీ చేపట్టలేదు. తెలుగు భాష, సాహిత్యం, పత్రికా రచన, విద్య. సహకారం, గ్రంథాలయాలు, రాజకీయాల వంటి ప్రజాహిత రంగాల వికాసం కోసం కృషి చేయాలనే సమున్నత సంకల్పంతో ప్రస్థానించారు. "పరోపకార శూన్యస్య కిం మనుష్య జీవితం" అనే ఆర్యోక్తి భాష్యంగా సేవాంకిత ఆదర్శ జీవితం సాగించిన ధన్యచరితుడాయన.

ఆయన వివిధ రంగాల అభివృద్ధికి బహుముఖీన సేవలందిస్తూనే తెలుగు భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణలో తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణకు, పరివ్యాప్తికి అవిరళ కృషి చేసే అగ్రేసర సంస్థ తెలంగాణ సారస్వత పరిషత్తు పురోభివృద్ధికి తొలినాళ్ళ నుంచి కీలక పాత్ర వహించిన డా. దేవులపల్లి రామానుజరావు గారు చిరస్మరణీయులు. 1944లో కార్యనిర్వాహక వర్గ సభ్యులుగా, 1947లో ఉపాధ్యక్షులుగా, 1983 లో అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించి విశిష్ట కార్యక్రమాలతో పరిషత్తును సర్వాంగీణంగా అభివృద్ధి పరిచారు. తెలుగు పరీక్షలు, పండిత శిక్షణ కళాశాల, ప్రాచ్య కళాశాల నిర్వహణ, ఉత్తమ గ్రంథ ప్రచురణ, కళామందిరం నిర్వహణ, సభలు, సమావేశాల ఏర్పాటు, సాహిత్య పురస్కారాలు, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు మున్నగు వాటితో పాటు వయోజన విద్యా వ్యాప్తికి ప్రత్యేక చర్యలు అమలు పరిచారు. 1993లో

కీర్తిశేషులయ్యే ముందు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత పద్మభూషణ్ గౌరవ స్వీకర్త, మహాకవి డా.సి.నారాయణ రెడ్డి గారు తమ తర్వాత పరిషత్తు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలనే అభీష్టాన్ని వ్యక్తపరిచారాయన. ఆ ప్రకారమే డా.సి.నారాయణ రెడ్డి గారు 1993 లో అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినారు. వారి మార్గదర్శకత్వంలో పరిషత్తు వినూత్న కార్యక్రమాలు చేపట్టి శీఘ్రతరంగా పురోగమిస్తున్నది. ముఖ్యంగా బంగారు తెలంగాణ నిర్మాణంలో పరిషత్తు పెక్కు విలక్షణ కార్యక్రమాలు అమలు పరుస్తున్నది. ఈ కీలక దశలో ఆ మహాకవి 12-06-2017 న ఆకస్మికంగా పరమపదించడం విశ్వవ్యాప్తంగా వున్న తెలుగుజాతికి, తెలుగు సాహిత్యానికి ప్రత్యేకించి తెలంగాణ సారస్వత పరిషత్తుకు తీరని వ్యధను కలిగిస్తున్నది. డా.సి.నారాయణ రెడ్డి గారి ఆశయాలకు, ఆదర్శాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఆ మహనీయుని స్ఫూర్తితో పరిషత్తు తన కర్తవ్యాలను ఇకముందు కూడ కొనసాగిస్తుంది.

డా.రామానుజరావు గారు రాష్ట్ర సాహిత్య అకాడమీ కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, అధ్యక్షులుగా, 1957 నుంచి 1985 వరకు అసాధారణ సేవలందించినారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యులుగా, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా, మూడు పర్యాయాలు తాత్కాలిక ఉపాధ్యక్షులుగా చేసిన కృషి శ్లాఘనీయం. కేంద్రం ఆ విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చే యత్నాన్ని తీవ్రంగా ప్రతిఘటించి ఆ ప్రతిపాదనను విరమింపజేసిన ఘనత డా.దేవులపల్లి రామానుజరావు గారిదే.

'గోలకొండ' పత్రిక సంపాదక వర్గ సభ్యులుగా, "శోభ" ప్రధాన సంపాదకులుగా పత్రికా రచనలో ఆయన తమ ప్రతిభావ్యుత్పత్తులను నిరూపించినారు. 25 కు పైగా ఆయన గ్రంథాలు ఆయన రచనా పాటవానికి నిదర్శనాలు. రాజ్యసభ సభ్యులుగా డా.రామానుజరావు గారి కృషి ప్రముఖుల మన్ననలందుకున్నది.

తెలంగాణ సారస్వత పరిషత్తు, 2016 ఆగస్టు 25 నుంచి 2017 ఆగస్టు 25 వరకు డా.రామానుజరావు గారి శతజయంత్యుత్సవాలను ఘనంగా తెలంగాణ అంతటా నిర్వహించింది. హైదరాబాదులో ప్రారంభోత్సవంతో మొదలైన ఈ ఉత్సవాలు రాష్ట్రంలోని ముఖ్యమైన కేంద్రాలలో కూడా నిర్వహించింది. "డా.దేవులపల్లి రామానుజరావు గ్రంథావళి" పేరుతో ప్రత్యేక బృహత్ సంకలనాన్ని ప్రచురించింది. శతజయంతి సమాపనోత్సవ సందర్భంగా ఆయన విగ్రహాన్ని పరిషత్తు ప్రాంగణంలో ప్రతిష్ఠించడం హర్షణీయం.

శతజయంతిని పురస్కరించుకొని డా.రామానుజరావు గారి జీవితం లోని అన్ని పార్శ్వాలను విశదీకరిస్తూ డా.గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి రచించిన "డా.దేవులపల్లి రామానుజరావు" గ్రంథాన్ని వెలువరిస్తున్నాం. సమర్థంగా, పరిశోధనాత్మకంగా, హృద్యమైనశైలిలో అందించిన రచయితకు అభినందనలు తెలియజేస్తున్నాను.

పరిషత్తు కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడంలో సహకరించిన మా సంస్థ ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య గారికి, ట్రస్టు, కార్యనిర్వహణ వర్గం, సర్వసభ్యమండలి సభ్యులకు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకించి సాంస్కృతిక శాఖకు, పరిషత్తు అభిమానులకు, కృతజ్ఞతలు.

ఈ గ్రంథం అందరి మన్ననలందుకోగలదని విశ్వసిస్తున్నాను.

(ఆచార్య ఎల్లూరి శివారెడ్డి)
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు

హైదరాబాదు,
తేది :25-08-2017.

డా॥ జె.చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : (ఆ) 24753724

ప్రవేశిక

డా.దేవులపల్లి రామానుజరావు తెలంగాణ వైతాళికులు. వైతాళికులు అని సాభిప్రాయంగానే ప్రయోగించాను. కారణం ఈనాడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా రెండు వేరువేరు రాష్ట్రాలు వున్న ప్రాంతాలు ఆనాడు కూడా నిజామాంధ్ర, బ్రిటిషాంధ్రగా వేరుగానే వున్నాయి. బ్రిటిషువారి ప్రత్యక్షపాలనలో వున్న ఆంధ్ర ప్రాంతాలు విద్యాపరంగా, కమ్యూనికేషన్ల పరంగా వ్యావసాయికంగా అభివృద్ధిలో వున్నాయి. తెలంగాణ నిజాము పాలనలో వుంది. నిజాము రాష్ట్రంలో తెలంగాణ, కన్నడ, మరాత్వాడ కలిసి వున్నాయి. ముఖ్యంగా తెలంగాణలో 90 శాతం మంది మాట్లాడేది తెలుగు. కాని 10 శాతం మంది మాట్లాడే ఉర్దూ అధికార భాషగా వుంది. అక్షరాస్యత 10 శాతంలోపే. పట్టణాల నుంచి పల్లెల దాకా పేదరికం, అవిద్య, సాంస్కృతికపరమైన అవగాహనలేమి ప్రబలివున్నాయి. ప్రజలకు వాక్స్వాతంత్ర్యం, మాతృభాషలో విద్య నేర్చుకునే హక్కు పత్రికా నిర్వహణ హక్కు లేదు. కొంతమంది మహనీయులు అటువంటి పరిస్థితులను పారదోలి వెలుగులు ప్రసరించేలా చేయడానికి పాటు పడ్డారు. గ్రంథాలయ ఉద్యమాన్ని, ఆంధ్ర మహాసభల్ని నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు వంటి మహాసంస్థల్ని నెలకొల్పారు. 'హితబోధిని', 'తెనుగు', 'నీలగిరి', 'గోలకొండ', 'శోభ', 'సుజాత' వంటి పత్రికల్ని నడిపారు. ఆ సంస్థలు, పత్రికలు తెలంగాణకు ఆధునిక యుగారంభాన్ని అందించాయి. వాటితో తెలంగాణ మిగతా ప్రాంతాలకు దీటుగా సర్వాంగీణంగా నిలిచింది. ఈ కృషిలో అగ్రభాగాన నిలిచినవారు సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, దేవులపల్లి రామానుజరావు ఇంకా ఎందరో. వీరంతా తెలంగాణకు వైతాళికులు.

ఈ వైతాళికుల్లో ప్రధానంగా చెప్పుకోదగిన డా.దేవులపల్లి రామానుజరావుగారి శతజయంతిని 2016 ఆగస్టు 25 నుంచి 2017 ఆగస్టు 25 వరకు

జరుపుకుంటున్నాం. 2016 ఆగస్టు 24న పరిషత్తులో అధ్యక్షులు డా.సి.నారాయణరెడ్డి గారి ఆధ్వర్యంలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టుకున్నాం. రామానుజరావుగారి తమ్ముడు, తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు దేవులపల్లి ప్రభాకరరావు ప్రారంభకులుగా విచ్చేశారు. రామానుజరావు జననం, వారి తొలి అడుగులు వేసిన నేల ఓరుగల్లు. అందువల్ల 2016 నవంబర్ 27న హనుమకొండలో వారి శతజయంత్యుత్సవం జరిగింది. పరిషత్తు కార్యవర్గ నిర్ణయాన్ని అనుసరించి మహబూబ్‌నగర్, నిజామాబాద్, సిద్ధిపేట, ఆదిలాబాద్, కరీంనగర్, నల్లగొండ తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు జరిగాయి. ప్రతిచోటా రామానుజరావుగారి ఛాయాచిత్ర ప్రదర్శన, వారి రచనల ప్రదర్శన, విక్రయం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఉత్సవాలకు తమ పూర్తి సహకారం అందించిన ఆయా సాహితీ సాంస్కృతిక సంస్థలకు, కవి పండితులకు, ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలల తెలుగు శాఖలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అన్నిచోట్ల సదస్సులు జరిగాయి. ఆ సదస్సుల్లో స్థానికంగా వున్న పండితులేగాకుండా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రామానుజరావుగారి వ్యక్తిత్వంపైనా, రచనలపైనా పత్రసమర్పణలు చేశారు. ఆ ప్రసంగ వ్యాసాలను, శతజయంతి కార్యక్రమాల విశేషాలను ప్రత్యేక సంచికలో ప్రచురిస్తున్నాం. ఎ.వి.కళాశాల వారు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు, డా.బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు శతజయంతి నిర్వహించారు. పరిషత్తు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నది.

డా.దేవులపల్లి రామానుజరావుగారు సంపన్నుల కుటుంబంలో పుట్టారు. చిన్ననాడే భాషా సాహిత్యాలపై అపారమైన అనురక్తిని ఏర్పరచుకొన్నారు. న్యాయశాస్త్రాన్ని అభ్యసించారు. స్వయంకృషితో అనేక భాషల్లో సముచితమైన ప్రజ్ఞను సొంతం చేసుకున్నారు. పద్యాలు రాశారు. వ్యాసాలు రాశారు. విమర్శా ప్రసంగాలు చేశారు. రాజరాజనరేంద్ర గ్రంథాలయానికి కార్యదర్శి స్థాయి నుంచి ఆంధ్ర సారస్వత పరిషత్తు, సాహిత్య అకాడమీ వంటి సమున్నత సంస్థలకు నాయకత్వం వహించి దశాబ్దాలపాటు తెలుగు భాషా సాహిత్యాల వికాసానికి కృషి చేశారు. ఆంధ్ర ప్రాంతంలోని మహాపండితులకు దక్కని అవకాశాలను దక్కించుకొని యావత్ తెలుగు నేలకు వెలుగు నిచ్చే విధంగా ప్రకాశించారు. ఆయన అటు సాహిత్య అకాడమీలో, ఇటు ఆంధ్ర సారస్వత పరిషత్తులో ఉన్నప్పుడు ఆంధ్ర ప్రాంతం కూడా ఆయనను

ఎంతో గౌరవాదరాలతో చూసింది. వారందరిలోకి అధికునిగా, వారందరికీ ఆత్మీయునిగా ఉంటూనే తెలంగాణ వ్యక్తిత్వాన్ని నిలువెత్తున నిలుపుకున్నారు. తమ మాట తెలంగాణ, తమ రచనా భాష తెలంగాణ శిష్టవ్యావహారిక భాష. పరిషత్తు పాలకవర్గమంతా తెలంగాణ వాళ్ళతోనే నిండివుండేది. తన చుట్టూ చేరి సాహితీ ప్రాభవాన్ని చాటుకునే ఆంధ్ర ప్రాంతపు కవి పండితుల ఉద్ధృతిలో కొట్టుకుండా తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నారని చెప్పటమే నా ఉద్దేశ్యం. పరిషత్తును 1943లో ప్రారంభిస్తే 1993లో వారు కన్నుమూసే దాకా అనేక హోదాల్లో అర్ధశతాబ్దం పరిషత్తు వేదికగా తెలంగాణలో తెలుగుభాషా పరిరక్షణ, పరివ్యాప్తి, వికాసదీప్తి త్రిముఖంగా అభ్యున్నతి సాధించడానికి రామానుజరావు చేసిన కృషి అనితర సాధ్యమైంది. సాహిత్య అకాడమీని దేశంలోని ఇతర రాష్ట్రాల సాహిత్య అకాడమీలకు ఆదర్శంగా నిలిపేందుకు మూడు దశాబ్దాలు అలుపెరుగని సేవలందించారు.

డా. దేవులపల్లి రామానుజరావుగారి జన్మశతాబ్దిని ఒక పండుగగా జరుపుతున్నది పరిషత్తు. అయినా మాకు ఈ ఉత్సవాల నిర్వహణలో అండదండలందిస్తున్న వారెందరో ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వ సహాయ సహకారాలను ప్రత్యేకంగా పేర్కొనాలి. ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు పరిషత్తుకు 10 లక్షల రూపాయల వార్షిక గ్రాంటు ఇస్తూ ఇటువంటి ప్రయోజనదాయకమైన కార్యక్రమాలను నిరాఘాటంగా కొనసాగించేందుకు దోహదపడుతున్నారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారికి, తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు శ్రీ అజ్మీరా చందూలాల్‌గారికి, సాంస్కృతిక సారథి ఛైర్మన్ రసమయి బాలకృష్ణగారికి, ప్రభుత్వ సలహాదారు డా. కె. వి. రమణాచారి గారికి, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి శ్రీదేశపతి శ్రీనివాస్‌గారికి, సాంస్కృతిక, పర్యాటక, యువజనాభ్యుదయ శాఖల కార్యదర్శి శ్రీ బుర్రా వెంకటేశంగారికి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు శ్రీ మామిడి హరికృష్ణగారికి సవినయ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

డా. దేవులపల్లి రామానుజరావుగారి శతజయంతి ఉత్సవాలను తలపెట్టింది, వివిధ ప్రాంతాల్లో ఉత్సవాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించింది, మమ్మల్ని నడిపించింది మొన్నటి దాకా అధ్యక్షులుగా వున్న జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు, పద్మభూషణ్ గౌరవస్వీకర్తలు, మహాకవి డా. సి. నారాయణరెడ్డిగారు. ఈనాడు భౌతికంగా వారు మన మధ్య లేరు. కాని వారి స్ఫూర్తి మాకు ఎప్పటికీ దారి చూపుతూనే

వుంటుంది. వారిని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాం. వారి పట్ల అనంతమైన ఆరాధనాభావం కలిగి, వారి మార్గంలో పరిషత్తును నడుపుతున్న ప్రస్తుత అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి ధన్యవాదాలు.

డా.దేవులపల్లి రామానుజరావు శతజయంతి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహించి వారిని ఈ తరానికి గుర్తు చేయాలని భావించాం. ఆ కార్యక్రమాలతోపాటు వారి రచనల్లో ప్రతులు అలబ్దంగా వున్న వాటిని 'డా.దేవులపల్లి రామానుజరావు గ్రంథావళి' పేరుతో ప్రచురిస్తున్నాం. వారి సంగ్రహ జీవిత చరిత్రను ప్రముఖ విమర్శకులు డా.గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి రాశారు. ఆ గ్రంథాన్ని ముద్రించాం. డా.రామానుజరావు శతజయంతి ప్రత్యేక సంచికను రూపొందించి అందిస్తున్నాం. జీవితచరిత్ర రచయిత డా.బాలశ్రీనివాసమూర్తిగారికి, ప్రత్యేక సంచికకు వ్యాసాలందించిన ప్రముఖులకు, పరిశోధక విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. డా.రామానుజరావుగారి జీవితంలో ఎక్కువ కాలం ఈ పరిషత్తు ఆవరణలో గడిచింది. అందుకని వారు తిరుగాడిన ఈ ప్రాంగణంలో వారి విగ్రహాన్ని నెలకొల్పుతున్నాం. విగ్రహ రూపకల్పన చేసిన శిల్పి అప్పల్నాయుడుకు, శిల్పం తయారీకై విరాళాన్నిచ్చిన డా.చింతపల్లి వసుంధరారెడ్డిగారికి, శ్రీ మంత్రి రామారావుగారికి, శ్రీ సాయని వెంకటేశగారికి, శ్రీ పి.వెంకటేశ్వర్లుగారికి, శ్రీ సముద్రాల యాదగిరిరావు గారికి కృతజ్ఞతలు.

ఈ కార్యక్రమాల నిర్వహణలో పూర్తి సహాయ సహకారాలందించిన మా కార్యక్రమ సలహాదారు శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారికి, శ్రీ యాదగిరిరావు, శ్రీ గోపాలరెడ్డి, శ్రీధర్, రామదాసు, రాంలాల్, తిరుపతి, మారుతి, శ్రీమతి అంజమ్మలకు ధన్యవాదాలు.

(డా॥ జె.చెన్నయ్య)
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ సారస్వత పరిషత్తు

విషయ సూచిక

సమున్నత సారస్వత వ్యక్తిత్వం

"తెలగాణమ్మున ఆంధ్రభారతిని బందీచేసి ఆంధ్ర ప్రజా
వళి కంఠమ్ముల నొక్కియుంచిన తరిన్ భాషాభిమానోగ్ర కా
హళి మ్రోయించి నిరంకుశుండగు నిజామల్లాడగావాడ వా
దల సాహిత్య జయధ్వజమ్మిడినప్రోడా! వీర రామానుజా,

నీ సంకల్పము వజ్రకల్పము, మహాంధ్రీ పాదపద్మార్చనా
వ్యాసంగంబొ అనల్పము, ఉల్లము మధూద్యన్మల్లికాతల్పము; అ
భ్యాసం బాంధ్ర సవిత్రిసేవనమె, లేదావంత యుంగర్వము; ఉ
చ్ఛ్వాసంబైనను నిశ్వసించుటయినన్ సర్వమ్ము సాహిత్యమే.

ఎంతవారినైన నెదరించితివె గాని
పదవినెంచి తలను వంచలేదు
సాయపడుటెగాని సాయమ్ము కోరవు
కవుల పాలి కల్పకమ్ము నీవు

స్వాతి చినుకుకన్న స్వచ్ఛమౌ హృదయమ్ము
మధువు కన్న నెంతొ మధురవాక్కు
వజ్రధార కన్న పదునైన శేముషి
మిత్రులందు ప్రాణమిత్ర మీవు..."

(మహాకవి దాశరథి రచించిన వీర రామానుజీయము కవిత)

మహాకవి దాశరథి రచించిన ఈ కవిత స్వర్గీయ దేవులపల్లి రామానుజరావు గారి నిరుపమాన వ్యక్తిత్వానికి దర్పణం. హైదరాబాద్ సంస్థాన విలీనానికి ముందు ప్రారంభమైన రామానుజరావు అక్షరసేద్యం ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కూడా మరో మూడున్నర దశాబ్దాలపాటు అవిశ్రాంతంగా కొనసాగింది. స్వీయ సంస్కృతి, మాతృభాష, సాహిత్యాల కోసం జీవితంలో అన్నింటినీ త్యాగం చేసి ఏక లక్ష్యం

కొరకు జీవనాన్ని అంకితం చేసినవారు ఏ ప్రాంతంలోనైనా అరుదుగా కనబడతారు. ఈ అరుదైన మూర్తిమత్వం తెలుగులో దేవులపల్లి రామానుజరావు స్వంతం, ఆధునిక తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఆయనదొక ప్రత్యేక అధ్యాయం అని చెబితే అది ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. స్వయంగా రచయిత, కవి, వక్త, పాత్రికేయుడు, విమర్శకుడు, పరిశోధకుడు, చరిత్రకారుడు– వీటితోపాటు సమర్థవంతమైన సంస్థాగత నిర్వహణాదక్షుడు రామానుజరావు. జీవితంలో నిర్మలత్వాన్ని, స్నేహసంపదను గొప్ప ఆచరణాలుగా మార్చుకున్న సుమనస్వి. సమకాలీనులందరికీ ఆప్తమిత్రుడు.

రామానుజరావు జన్మభూమి వరంగల్లు పట్టణం. వరంగల్లు జిల్లాలోని బొల్లికుంటలో 1917 ఆగస్ట్ 25వ తేదీనాడు ఆయన జన్మించారు. తల్లి ఆండాళమ్మ, తండ్రి వేంకటాచలపతిరావు. సంపన్నులైన కుటుంబీకులు. ఆనాటి వరంగల్లు పట్టణ ప్రముఖుల్లో వేంకటాచలపతిరావుగారు ఒకరు. ఎప్పుడూ అతిథి అభ్యాగతులతో ఇల్లు నిండుగా ఉండేది. వేంకటాచలపతిరావు అతిథులకు ఎటువంటి లోటు రాకుండా చూసుకునేవారు. అతిథుల్లో పలువురు తెలుగు సాహిత్యరంగంలోనివారు. వీరిలో కొందరు సుదూర ప్రాంతాల నుండీ కూడా వచ్చేవారు. వెంకటాచలపతిరావు స్వయంగా వారికి ఆర్థిక సహాయాన్ని అందించేవారు. ఇంట్లో సాహిత్య చర్చలూ జరిగేవి. ఇట్లా రామానుజరావు తన బాల్యంలోనే సాహిత్య మాధుర్యాన్ని ఆస్వాదించగలిగారు. అనంతర కాలంలో ఆయన తెలుగు భాషాసాహిత్య వికాసాలకు ఒక నిబద్ధ సేనానిగా సేవలు అందించేందుకు ఈ బాల్యజీవన అనుభవాలు పునాదులు వేశాయి. అయితే ఇల్లు దాటితే అంతా ఉర్దూమయం. బోధనాభ్యసనాలు అన్నీ ఉర్దూ మాధ్యమంగానే ఉండేవి. ఉర్దూ ఆనాటి అధికార భాష. సమాజంలోని సంపన్న వర్గాలకు చెందినవారు ఉర్దూలోనే మాట్లాడుకునేవారు. ఇంట్లో తెలుగు సాహిత్య వాతావరణ సౌరభాలు, బయట ప్రపంచంలో ఎక్కువమంది ఉర్దూ సంభాషణలు చేసేవారు. రామానుజరావుకు ఉర్దూతోనూ గట్టి పరిచయం ఏర్పడింది. గాలిబ్ వంటి మహాకవుల కవితా సుధల్ని వ్యాఖ్యానించే స్థాయికి ఉర్దూ విద్వత్తు ఎదిగింది. రామానుజరావు తెలుగు సాహిత్యాన్ని అత్యంత గాఢంగా అభిమానించారు. అయితే ఆయన ఏనాడూ ఉర్దూను ద్వేషించలేదు. అందుకే సియాసత్ పత్రిక వ్యవస్థాపకులు, రామానుజరావు సన్నిహితమిత్రులు ఆబిద్ అలీఖాన్ ఆయనను "హైదరాబాద్ సంస్కృతికి అసలైన ప్రతినిధి"గా అభివర్ణించారు.

రామానుజరావు బాల్యమిత్రుల్లో మాటేటి రామప్ప ప్రముఖులు. వారిద్దరి స్నేహం రమారమి అర్ధ శతాబ్దం పాటు అరమరికలు లేకుండా సాగింది. రామప్ప కూడా ప్రతిభాశాలి. నిజాం ప్రభుత్వ యంత్రాంగంలో కలెక్టర్ స్థాయిలో బాధ్యతలు నిర్వహించారు. ఆయన రాసిన ఒక వ్యాసంలో రామానుజరావు తొలినాటి బడి విశేషాలు దొరుకుతాయి. వరంగల్లులో ఇద్దరూ కలసి బాల్య విద్యాభ్యాసం చేశారు. ఇదివరకే పేర్కొన్నట్టు వెంకటా చలపతిరావు సంపన్న గృహస్థు. అందుకే కొంతకాలంపాటు రామానుజరావుకు ఇంట్లోనే విద్యను చెప్పించారు. బహుశా అది ఈనాటి హోంట్యూషన్ వంటిది కావచ్చు. నాల్గవ ఫారమ్ నాటికి రామానుజరావు పాఠశాల గడపలో అడుగుపెట్టారు. మట్టెవాడ నుండి వరంగల్లు వరకు ఆయన టాంగాలో వచ్చేవారు. ఇట్లా టాంగాలో బడికి రావడం నాటి కాలంలో ప్రతిష్ఠకు ప్రతీకగా ఉండేది. ఆయన చదువుకునే పాఠశాలలో అబ్దుల్‌సలామ్ అనే ఆయన వైస్ ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. వెంకటాచలపతిరావుకు ఆయన మిత్రుడు. రామానుజరావు నాటి పాఠశాల సహ విద్యార్థులలో ఎందరో ప్రముఖులున్నారు. బొమ్మకంటి సత్యనారాయణరావు, హయగ్రీవాచారి, కాళోజీ సోదరులు రామేశ్వరరావు, నారాయణరావు, పర్సా వేంకటేశ్వరావులు వీరిలో ప్రముఖులు. రామానుజరావుకు వీరందరితో సాన్నిహిత్యం ఉండేది. బాల్యంలో చిగురించిన మైత్రిని రామానుజరావు సుదీర్ఘకాలం పాటు కొనసాగించారు. ప్రసిద్ధ కవి, విమర్శకులు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి "నీకు మంచి మిత్రుణ్ణి ఒకరిని చెప్పు అని ఎవరైనా నన్నడిగితే చట్టున తడుముకోకుండా శ్రీ దేవులపల్లి రామానుజరావు అని చెబుతాను" అన్నారు. ఒక్క ఇంద్రగంటి వారే కాదు మరెంతో మందికి ఈ గాఢమైన స్నేహానుభూతిని పంచిన సహృదయులు రామానుజరావు.

సంపన్న గృహస్థు కుమారుడే అయినా రామానుజరావులో ఏనాడూ దర్పాన్ని చూడలేదని రామప్ప రాశారు. అది రామానుజరావులో జీవితాంతం నిలిచిన గొప్ప లక్షణం. "ఆయన (రామానుజరావు) పొందిన గౌరవాలకు లెక్కలేదు. అవే యితరులకు లభించి ఉంటే మెడపైన తలనిలిచేది కాదేమో అనిపిస్తుంది, రామానుజరావు రాగద్వేషాలకు అతీతుడు" అని రాశారు సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు.

వరంగల్లులో విద్యాభ్యాసం పూర్తి అయింది. ఆయన మిత్రుల్లో చాలామంది ఊర్ధ్వాపైపు సాగిపోయారు. రామానుజరావు మాత్రం తెలుగుకే కట్టుబడి ఉన్నారు.

బి.ఏ. వరకు తెలుగు ద్వితీయ భాషగా కొనసాగించారు నిజాం కళాశాలలో. బి.ఏ. విద్యాభ్యాసం చేశారు. యావత్ హైదరాబాద్ సంస్థానంలో అటు ఔరంగబాద్ నుండి ఇటు ఖమ్మం వరకు అదే అత్యున్నత విద్యాసంస్థ. అటు తర్వాత మరింత ఉన్నత చదువుల కోసం ఉస్మానియా యూనివర్సిటి. రామానుజరావు బి.ఏ. చదువుతున్న కాలంలో నిజాం కాలేజి మదరాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేది. జాతీయస్థాయిలో గుర్తింపును పొందిన మేధావులు నిజాం కళాశాల ఆచార్యులుగా విశిష్టమైన సేవల్ని అందించారు. జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొంటున్న నాయకులు సర్ సి.వి.రామన్ వంటి విశ్వవిఖ్యాత శాస్త్రవేత్తలు నిజాం కాలేజిని సందర్శించారు. ఉపన్యాసాలు చేశారు. మేథా వికాసానికి అత్యుత్తమ వేదికగా నిలిచిన నిజాం కళాశాలలో బి.ఏ. చదవడంతో రామానుజరావు వ్యక్తిత్వం మరింత తేజోవంతమైంది. బహుశా నిజాం కళాశాల జ్ఞాపకాలు ఆయనను జీవిత పర్యంతం గొప్ప జ్ఞాపకాలుగా నిలిచి ఉంటాయి. "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" అన్న రచన చదివినపుడు ఈ అభిప్రాయం ఏర్పడుతుంది. నిజాం కళాశాల వైభవాన్ని ఇంత గొప్పగా వర్ణించి చెప్పిన తెలుగు ఆత్మకథ మరొకటి లేదని వ్యాఖ్యానించడం సత్యదూరం కాదు. ఆయన నిజాం కళాశాల విద్యార్థిగా ఉన్న కాలంలో కురుగంటి సీతారామయ్య తెలుగు పాఠాలు బోధించేవారు. ఆయన నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు వీరవిధేయుడుగా గుర్తింపును పొందారు. అయితే ఉత్తమ పరిశోధకుడు, విమర్శకుడు, అధ్యాపకుడు కూడా. తణికెళ్ళ వీరభద్రుడు వంటి అసాధారణ ఆంగ్ల విద్వాంసుడు కూడా ఆనాటి నిజాం కళాశాల ఆచార్య వర్గంలోని వారు. నిజాం కళాశాల మేథా వైభవ వాతావరణంతో పాటు హైదరాబాద్ నగరంలో తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణ కోసం స్వచ్ఛంద స్థాయిలో సాగుతున్న ప్రయత్నాలూ రామానుజరావుకు వినూత్న స్ఫూర్తిని అందించాయి. సాహిత్యదీపం ఆరిపోకుండా ఉండాలంటే వ్యక్తులు, సంస్థల ద్వారా నిర్దిష్టమైన కృషి కొనసాగుతూనే ఉండాలని రామానుజరావు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఆయన ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీల్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు నాడు భాగ్య నగరంలో కలిగిన అనుభవాలే కారణాలు కావచ్చు.

డిగ్రీ విద్యార్థిగా సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేసిన రామానుజరావు. కోస్తాంధ్ర ప్రాంతంలోని కవితా సమీరాల్ని ఆస్వాదించారు. భావ కవిత్వాన్ని ఎంతో

ఇష్టంతో చదివారు. పచ్చతోరణం కావ్యరచనకు ఆనాటి భావకవితాభిరుచి కారణం. రాయప్రోలు సుబ్బారావు సాధించిన అభివ్యక్తి నవ్యతను గుర్తించారు. రామానుజరావు; రాయప్రోలు కవిత్వాన్ని చివరివరకూ అభిమానించారు. విశ్వనాథ సత్యనారాయణ ఆ రోజుల్లో హైదరాబాద్ వచ్చి సాహిత్య సభల్లో పాల్గొనేవారు. విశ్వనాథ సాహిత్య మూర్తిమత్వం రామానుజరావుకు స్ఫూర్తినిచ్చింది. వేయిపడగలు నవలను నిశితంగా అధ్యయనం చేశారు. వేయి పడగలు నవలపై 1940లలోనే సాధికారిక విశ్లేషణలు రచించిన వారిలో రామానుజరావు ఒకరు. అప్పటికాయన న్యాయశాస్త్రం చదువుతున్న నవయువ విద్యార్థి! ఉత్తమ స్థాయి సాహిత్యంపై విద్యార్థి దశలోనే ఆయనకు స్పష్టత ఏర్పడింది. 1980లలో ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలుగు వాళ్ళు తప్పక చదవాల్సిన పుస్తకాలేవి? అన్న ప్రశ్నకు జవాబుగా "భారతం, భాగవతం, శతక వాఙ్మయం, ప్రత్యేకంగా వేమన, తాళ్ళపాక కవులు, క్షేత్రయ్య పదాలు, వీరేశలింగం, చిలకమర్తి, పానుగంటి వారి కొన్ని రచనలు, గురజాడ వారి ముత్యాల సరాలు, కన్యాశుల్కం, రాయప్రోలు వారి తృణకంకణం, ఆంధ్రావళి, తెలుగుతోట, విశ్వనాథవారి ఏకవీర, కిన్నెరసాని పాటలు, వేయిపడగలు, శ్రీశ్రీ మహాప్రస్థానం, చలం కథలు, ముద్దుకృష్ణ సంకలనం 'వైతాళికులు', ఉన్నవవారి మాలపల్లి" అని రామానుజరావు బదులు చెప్పారు. ఆయన విద్యార్థి దశలోనే (అప్పటికింకా సంకలనం కాని మహాప్రస్థానం వంటి ఒకటి రెండు మినహా) ఈ రచనల్లో చాలావాటిని చదివి ఉంటారు. తిక్కన, పోతన, వేమనలు ఆయనకు అభిమానకవులు.

రామానుజరావుకు ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుకు మధ్య కొన్ని పోలికలు కనబడతాయి. ఇద్దరూ గొప్ప నిర్వహణాదక్షులు, నాయకత్వ లక్షణాలు ఉభయులలోనూ పుష్కలంగానే ఉన్నాయి. అయితే ఈ ఇద్దరూ ప్రత్యక్ష క్రియాశీలక రాజకీయరంగంలో ఉండేందుకు నిరాసక్తతను వ్యక్తం చేశారు. వారు రాజకీయ రంగంలో ఉన్నా అది సంక్షిప్త సమయమే. రామానుజరావు ఆనాటి రాజకీయ ఉద్రిక్త వాతావరణంలో ప్రత్యక్ష రీతిలో భాగస్వామ్యాన్ని ఇష్టపడలేదు. 1938 నాటి ఉస్మానియా విద్యార్థుల చారిత్రాత్మక వందేమాతరం ఉద్యమంలో ఆయన ఉన్నారు. విశ్వవిద్యాలయం నుండి బహిష్కృతులైన వారిలో ఆయన ఒకరు. ఇక్కడ నుండి బహిష్కృత విద్యార్థుల వలెనే నాగపూర్ యూనివర్సిటీకి వెళ్లారు. అక్కడ న్యాయశాస్త్రాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సమయంలో నాగ్‌పూర్ నగరంలో మూర్తీభవించిన

జాతీయోద్యమ వాతావరణంలో ప్రభావితులయ్యారు. తొలినాళ్ళ నుండి ఆయన జాతీయవాదే. నాగ్‌పూర్‌లో చదివిన కాలంలో ఆయన మరింత గాఢమైన జాతీయవాదిగా మారారు. అయితే ఆయన అభిమాన నాయకుడు మాత్రం గోపాలకృష్ణ గోఖలే. ఈ విషయాన్ని ఆయన మిత్రుడు మాటేటి రామప్ప ప్రస్తావించారు. "జవహర్‌లాల్‌నెహ్రూ, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, ఆచార్య నరేంద్రదేవ్, గోఖలే, తిలక్ వంటి నాయకుల ప్రభావం తనపై ఉందనీ" రామానుజరావు ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

నాగర్‌పూర్‌లో న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్న కాలంలోనే రామానుజరావులోని రచయిత ఆవిష్కరించబడ్డాడు. 1939-40 ప్రాంతాల్లో గోలకొండ పత్రికలో ఆంధ్ర మహాసభ నాయకుల్ని గురించి కొన్ని "వాక్ చిత్రాలు" రచిస్తే అవి మాడపాటి హనుమంతరావు ప్రశంసలు పొందాయి. ఆ రోజుల్లో తెలుగు - ఉర్దూ పత్రికా సంపాదకుల్లో సురవరం ప్రతాపరెడ్డి, మందుముల నరసింగరావుల వ్యక్తిత్వాలు రామానుజరావుకు బాగా నచ్చాయి. మాడపాటి అందించిన ప్రోత్సాహం ఆయనకు శ్రీరామరక్షగా మారింది. నాగ్‌పూర్‌లో రామానుజరావు విద్యార్థిగా ఉన్న కాలంలోనే హైదరాబాద్ నుండి తొలి తెలుగు దినపత్రిక ప్రారంభమైంది. ఈ పత్రిక పేరు "తెలంగాణ". తెలుగు - ఇంగ్లీషు పత్రికా రచనల్లో సిద్ధహస్తులైన బుక్కపట్టణం రామానుజాచార్యులు ఈ పత్రికకు సంపాదకులు. అప్పట్లో అర్ధవారపత్రికగా ఉన్న గోలకొండ మనుగడే కష్టంగా ఉండేది. ఈ స్థితిలో దినపత్రిక నిరాటంకంగా కొనసాగడం అసాధ్యమైందే. ఇదే నిజమైంది. తెలంగాణ పత్రిక ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే మూత పడింది." ఈ పత్రిక సంపాదక మండలిలో చేరమని హనుమంతరావు గారు కోరుతూ నాకు ఉత్తరము వ్రాసినారు. అయితే నాగపూర్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసిస్తున్నందువల్ల నేను వారి కోరిక నెరవేర్చలేదు. అయితే నవ్యసాహిత్యాన్ని గురించి అనేక వ్యాసాలు ధారావాహికంగా ఈ పత్రికకు వ్రాస్తుండేవాడిని. నవ్యకవితా నీరాజనం, వేయిపడగలు మొదలైనవి ఇందులోనివే" అని "పత్రికా రచయితగా నా అనుభవం" అన్న వ్యాసంలో రామానుజరావు గుర్తు చేసుకున్నారు. రామానుజరావు సాహితీ విమర్శనరంగంలో ఎదిగేందుకు తెలంగాణ పత్రిక దోహదం చేసిందని స్పష్టపడుతున్నది. ఆ పత్రిక సాహిత్య అంశాలకు పెద్ద

పీట వేసిందని చెప్పేందుకు రామానుజరావు రచించిన గొప్ప వ్యాసాలే సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

జాతీయోద్యమకాలంలో అటు బ్రిటిషిండియాలో, ఇటు హైదరాబాద్ సంస్థానంలోనూ న్యాయవాద వృత్తికి బాగా ఆదరణ ఉండేది. న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన వారు అటు ధనార్జనతోపాటు ఇటు ఉన్నతమైన సామాజిక గౌరవాన్నీ సాధించుకునేవారు. రామానుజరావుకు ఆనాడు న్యాయవాదిగా నిలబడేందుకు పుష్కలమైన అవకాశాలున్నాయి. సంపన్న నేపథ్యం, స్వస్థలం వరంగల్లులో కావల్సినంత పలుకుబడి, అనివార్యమైన తత్క్షణ కుటుంబ బాధ్యతలు లేకపోవడం ఇవన్నీ ఆయనకు కలసి వచ్చేవే. రామానుజరావు నాగ్‌పూర్ నుండి వచ్చిన వెంటనే న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభిస్తారని ఆయన మిత్రులు, హితులు భావించారు. అయితే వీరందరి అంచనాలకు భిన్నంగా భాషాసేవకే అంకితం కావాలని రామానుజరావు నిశ్చయించుకున్నారు. ఆ నిశ్చయం నుండి అణువంతైనా దూరం కాలేదు. భాషాసేవ నిజంగానే అమూర్తమైనది, ధనార్జనమిథ్య, ఎన్నో ఒడుదొడుకులు ఎదురవుతుంటాయి, ఆశించిన ప్రతిస్పందనలు కానరావు – అయినాసరే, రామానుజరావు చెదరలేదు. భాషాసేవలో నిమగ్నులయ్యారు.

1943లో ప్రతాపరెడ్డి, భాస్కరభట్ల కృష్ణారావు, లోకనంది శంకరనారాయణరావు, బూర్గుల రంగనాథరావు వంటి సాహితీవేత్తలు, భాషాభిమానుల సంకల్పబలంతో ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రారంభమైన సంగతి తెలిసిందే. సాంస్కృతిక నిర్బంధ పరిస్థితులున్న ఆనాటి సంస్థానంలో పరిషత్తు వ్యూహాత్మకరీతిలో అడుగులు వేసింది. భాషాసేవ కోసం అంకితం కావాలనుకున్న రామానుజరావు సారస్వతపరిషత్తు తనకు తగిన వేదిక కాగలదని భావించారు. 1944 నుండి పరిషత్తు కార్యక్రమాల్లో మమేకమయ్యారు. వరంగల్లులో జరిగిన చారిత్రాత్మకమైన పరిషత్తు సభలకు రామానుజరావు సూత్రధారి. “నభూతోనభవిష్యతి” అన్న రీతిలో నిర్వహించిన ఆలంపురం (1953) ఆంధ్ర సారస్వత పరిషత్తు సభలకు ఆయనే రూపశిల్పి. “రామానుజరావు అంటేనే సారస్వత పరిషత్తు, సారస్వత పరిషత్తు అంటేనే రామానుజరావు” అనే స్థాయిలో దేవులపల్లివారు సంస్థలో కలిసిపోయారు.

'తెలుగువారు అందరూ ఒకే గొడుగు క్రింద సమైక్యంగా ఉండడం సముచితం' అన్నది రామానుజరావు ఏర్పర్చుకున్న సూత్రబద్ధమైన వైఖరి. రాజకీయరంగంలో ఎటువంటి పరిస్థితులు ఉన్నప్పటికీ ఆయన ఈ అభిప్రాయాన్ని ఎంత మాత్రమూ మార్చుకోలేదు. నిజాం పాలన తొలగిపోయి ఇంకా హైదరాబాద్ సంస్థానపు రాజకీయ – పాలనా వ్యవస్థలు రూపుదిద్దుకోని రోజుల్లో; విశాలాంధ్ర నినాదం వినిపించారు. విజయవాడ కేంద్రంగా అయ్యదేవర కాళేశ్వరరావు ఈ నినాదానికి అంకురార్పణ చేశారు. ఆయన ఆలోచనల పర్యవసానంగా "విశాలాంధ్ర మహాసభ" ఏర్పడింది. రామానుజరావు ఈ మహాసభ ఆశయాలకు మద్దతునిచ్చారు. కాళోజీ నారాయణరావు, ఎం.ఎస్.రాజలింగం వంటి వారు కూడా ఇదే వైఖరిని అవలంబించారు. భాషా వికాసం అన్న దృష్టితోనే రామానుజరావు ఈ ధోరణిని ఎంపిక చేసుకున్నారని భావించవచ్చు. అటు తరువాత రోజుల్లో ఆయన ఎక్కడ ప్రసంగించినా తెలంగాణ వైభవాన్ని కళ్ళకు కట్టినట్టుగా వివరించేవారు. నెల్లూరు (1978) టౌన్‌హాలులో చేసిన ప్రసంగం దీనికి దాఖలా. రామానుజరావుకు తెలంగాణ పట్ల ప్రత్యేకాభిమానం ఉండేదని చెప్పడంలో సందేహమే అవసరం లేదు. ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ఆచార్య చేకూరి రామారావు అన్నట్టు "తెలంగాణ సాంస్కృతిక వికాసానికి జీవితాన్ని, సాహిత్యాన్ని అంకితం చేసినవారు దేవులపల్లి రామానుజరావు..."

1957లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పాటైంది. 1957–79 మధ్య కార్యదర్శిగా, 1979–82ల నడుమ ఉపాధ్యక్షులుగా, 1982 నుండి సంస్థను రద్దు చేసే వరకు అధ్యక్షులుగానూ ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి మూడుసార్లు తాత్కాలిక ఉపకులపతిగా వ్యవహరించారు. ఒకసారి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. ఇంకా ఎన్నో బాధ్యతలు నిర్వహించారు. వాటిలో కొన్ని –

1. **ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు – 1952–1954 మరియు 1983 మొదలుకొని తుదిశ్వాస విడిచేవరకు (1993 జూన్ 6).**
2. **కేంద్ర సాహిత్య అకాడమీ, కార్యనిర్వాహక సభ్యులు 1967–1977.**
3. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాగూర్ శతజయంతి కమిటీ కార్యదర్శి (1960–62)**
4. **హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ మెమోరియల్ రీసెర్చి సంస్థ కార్యనిర్వాహక సభ్యులు.**

5. హైదరాబాద్‌లోకి అంజుమన్ తరక్కి ఇ ఉర్దూ కార్యవర్గ సభ్యులు.

6. న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ భారతీయ భాషా సమితి సభ్యులు (1970-72)

7. హైదరాబాద్ కేంద్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ 1966-73.

8. తొలి ప్రపంచ తెలుగు మహాసభల కోశాధికారి (1975-76)

9. తెలుగు అకాడమీ, కార్యనిర్వాహక వర్గ సభ్యులు 1975-76

10. ఉర్దూ అకాడమీ కార్యనిర్వాహక మండలి సభ్యులు 1976-79

11. సురభారతి సమితి (హైదరాబాద్) ఉపాధ్యక్షులు (1970-1993)

12. ఆలిండియా రేడియో హైదరాబాద్ కార్యక్రమాల సలహా మండలి సభ్యులు 1962-68

వివిధ కమిటీల కార్యనిర్వాహక సభ్యత్వం. ఇంకా :

సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (1952-55), పాఠ్యపుస్తక కమిటీ (1952-57) విద్యా విభాగంలో ఉపాధ్యాయుల ఎంపిక కమిటీ (1952-57), స్టేట్ సెంట్రల్ లైబ్రరీ పుస్తక కమిటీ (1965-75), వయోజన విద్యాకమిటీ (1952-54), కళాశాల విద్యాకమిటీ (1952-54), రిమాయల్ స్కాలర్ షిప్ కమిటీ (1954-56), ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ అడ్మినిస్ట్రేటివ్ గ్లాసరీ కమిటీ సభ్యులు (1957-66).

విశ్వవిద్యాలయ స్థాయుల్లో :

1. ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యులు 1953-75
2. ఉస్మానియా విశ్వవిద్యాలయం సిండికేట్ సభ్యులు 1963-76
3. తాత్కాలిక వైస్ ఛాన్సలర్ - ఉస్మానియా యూనివర్సిటి - అక్టోబర్ 1972
4. తాత్కాలిక వైస్‌ఛాన్సలర్ - ఉస్మానియా యూనివర్సిటి - జనవరి-మే 1975
5. తాత్కాలిక వైస్‌ఛాన్సలర్ - ఉస్మానియా యూనివర్సిటి -ఆగస్ట్-అక్టోబర్ 1973
6. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, కార్యవర్గసభ్యులు.
7. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు.

సహకారరంగం :

1. హైదరాబాద్ జనరల్ కో ఆపరేటివ్ ట్రేడింగ్ కమిటి 1954–58 – డైరెక్టర్
2. హైదరాబాద్ కోఆపరేటివ్ జనరల్ ఇన్సూరెన్స్ సొసైటి, 1959–71– డైరెక్టర్ పార్లమెంట్‌లో.

రాజ్యసభ సభ్యత్వం 1960–62

వీటితోపాటు ఇంకా మరెన్నో బాధ్యతలను రామానుజరావు సమర్ధవంతంగా నిర్వహించారు.

న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉంటూనే తనను తాను చక్కని విమర్శకుడిగా నిరూపించుకున్న ప్రతిభాశాలి రామానుజరావు. 1940 మొదలుకొని 1980ల దాకా విరివిగా రచనలు కొనసాగించారు. వివిధ కీలక బాధ్యతలు, ఎన్నో పనుల ఒత్తిడులలో ఉంటూ కూడా రచనా వ్యాసంగాన్ని నిర్వహించారు. ఒకవేళ వ్యవస్థా సంబంధమైన పనులు కనుక లేకపోతే ఆయన కలం నుండి ఇంకా ఎన్నో రచనలు వెలువడేవి. వీరి రచనలన్నీ ఆణిముత్యాలే. రామానుజరావును విలక్షణ సాహితీవేత్తగా నిలబెట్టేందుకు ఈ రచనలు ప్రాతిపదికలు అవుతాయి. ఆ రచనల వివరాలు ఇవి –

1. సారస్వత నవనీతము : ఇదొక చక్కని సాహిత్య విమర్శా వ్యాస సంకలనం. రామానుజరావు నిశిత విశ్లేషణా ధోరణికి, వైవిధ్యభరితమైన దృష్టి కోణానికి, అందమైన వచనశైలికి ఇది నిదర్శనం. తెలంగాణాలో తొలితరం సాహిత్య విమర్శకులలో రామానుజరావు స్థానాన్ని పదిలపరచే రచన.

2. హైదరాబాద్‌లో స్వాతంత్ర్యోద్యమాలు : ఇదొక చక్కని సమకాలీన రాజకీయ చరిత్ర రచన. సమకాలీన చరిత్రకారుడికి ఉండవలసిన చారిత్రక పరిజ్ఞానం, నేపథ్య అధ్యయనం ఈ రచనలో ప్రముఖంగా ఉన్నాయి. చరిత్రకారునిలో ఉండవలసిన నిష్పాక్షిక దృష్టి రామానుజరావులో సంపూర్ణంగా ద్యోతకమైంది.

3. తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము : ఇది సాంస్కృతిక రచన. యావత్ తెలుగు ప్రాంతంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసిన అంశాలన్నింటినీ ఈ రచన సింహావలోకనం చేసింది.

4. పచ్చతోరణం : రామానుజరావులోని భావుకత, నవ్య కవిత్వ సృజనశక్తి ఈ కావ్యంలో కనబడతాయి. నవ్య కవిత్వ ప్రతినిధిగా చెప్పదగిన తెలంగాణ ఆధునిక కావ్యాల్లో పచ్చతోరణం ఒకటి.

5. తెలంగాణ జాతీయోద్యమాలు : తెలంగాణ చరిత్ర – సంస్కృతి – భాష తదితర అంశాలపై అన్ని వైపులా నిర్లక్ష్యం అలుముకున్న వేళల్లో వెలువడిన గొప్ప రచన.

6. నా రేడియో ప్రసంగాలు : పత్రికా సంపాదకీయాలు, పలు పత్రికా వ్యాసాలు రచించిన రామానుజరావు రేడియో మాధ్యమానికి తగినట్టుగా రచనలు చేయగలరని ఈ ప్రసంగాలు చెబుతున్నాయి. వర్ధమాన రేడియో ప్రసంగ కర్తలకు ఇవి చక్కని నమూనాలు. ఆసక్తికరమైన ఎత్తుగడ, సామాన్యులను దృష్టిలో పెట్టుకొని చేసిన విషయ వివరణ, ధారాశుద్ధి ఈ ప్రసంగాలకు అదనపు అలంకారాలు.

7. సాహిత్యోపన్యాసములు : వివిధ ప్రాంతాల్లో చేసిన సాహిత్య ప్రసంగాలు. వీటిలో సాహిత్య విమర్శ తాలూకు లక్షణాలు నిండుగా ఉన్నాయి.

8. యాభై సంవత్సరాల జ్ఞాపకాలు : తెలంగాణలోనే కాదు, తెలుగులో వెలువడిన అత్యుత్తమ ఆత్మకథల్లో ఇది ఒకటి. 1981లో ఇది వరంగల్ సాహితీ బంధు బృందం ద్వారా మొదట ప్రచురణను పొందింది.

ఇంకా అనువాద వాఙ్మయం, బాలసాహిత్యం, నిఘంటు నిర్మాణం, సంకలనాల రూపకల్పన, సంచికల సంపాదకత్వం ఇట్లా వివిధ దశల్లో రామానుజరావు వాఙ్మయ సేవ సాగింది.

"అతడజాత శత్రువు
ఆయన తెలంగాణ ప్రజా సంస్కృతికి
వన్నె చేకూర్చిన మహా మనీషి
ఆయన మహాంధ్ర ప్రజావాణిని నిలబెట్టిన ధన్యజీవి
ఆయన ఈ మట్టిని తట్టి సాహితీమూర్తులను నిర్మించిన మహాశిల్పి
ఆయన మాదేవులపల్లి రామానుజరాయుడు
ఆయనకు ఇవే నా అక్షరాంజలులు" అని "అజాతశత్రువు" పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య పేర్వారం జగన్నాథం ఒక స్మృతి కవితను రచించారు. ఆయన వలెనే పలువురు సమకాలీన సాహితీవేత్తలు రామానుజరావును అభిమానించారు. ఆయనకు తమ రచనల్ని అంకితం చేశారు. ఆయన పట్ల ఆయా సాహితీవేత్తలకున్న అసమానమైన అభిమానమే ఈ అంకితాలకు కారణం. వారెవరూ ఆయన ఆర్థిక సహాయాన్ని కోరలేదు!

సుప్రసిద్ధ కవి, విమర్శకులు, వక్త గుంటూరు శేషేంద్రశర్మ తమ "సాహిత్యకౌముది" అనే విశిష్ట వ్యాస సంకలనాన్ని రామానుజరావుకు అంకితం చేస్తూ అంకిత పద్యాలు రచించారు. శేషేంద్రకు రామానుజరావు విలక్షణ వ్యక్తిత్వం పట్ల ఏర్పడిన గౌరవానికి ఈ పద్యాలు ప్రతీకలు :

"ఆ రామానుజరావు భావుకుడు, సత్యారాధనావైఖరీ
శ్రీ రమ్యుండును సాహితీ మధుప రాజీకంజ కింజల్కనీ
హారో దార మరందధార సుజన వ్యాహార హారావళీ
భారాలంకృత కీర్తి కంధరుడు శుభ్ర స్వీయ చారిత్రుడున్

తెలుగుల గుండెలందిచట దేజముగ్రుంకిన యట్టివేళలో
వెలుగులు పాదుకొల్పి నిలిపెన్ మన యాంధ్రికి దేవళమ్ములన్
తెలుగుపొలాలలో బెనిచె దీక్షగ నెన్నిటినో కలమ్ములన్
హలములుగా కదల్చి నవహారి హిరణ్మయి వాఙ్మయమ్ములన్

కమ్మని పల్కుతో విగత కల్మషసాదర మాధురీ వరీ
యమ్మగు తీరుతోనెసగి యాంధ్ర సరస్వతి తోట కంద చం
దమ్ములు గుస్తరించు కవితా రసమూర్తులు వారితోడనె
య్యమ్ములు మర్వరాని తలిరాకుల పాకలు తేనెవాకలున్

అతడిష్టుండగు నాకు, పూజ్యుడు, సమస్తాంధ్రావనీ మండల
స్థిత సారస్వత భూరి వర్ణములకున్ జేతమ్ము చూతమ్మునన్
శ్రుతి పేయమ్ముగ బాడు కోయిలవలెన్ శోభింప నీకౌముదీ
కృతి నర్పింతును గౌరవ ప్రణయ సంకేతమ్ముగా వానికిన్"

సుప్రసిద్ధ సంస్కృత పండితులు – పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు "కావ్యమీమాంస"ను రామానుజరావుకు అంకితం ఇవ్వడానికి గల కారణాన్ని గురించి ఇట్లా రాశారు :

"నాకున్న 20 సంవత్సరాల పరిచయాన్ని బట్టి శ్రీ రామానుజరావుగారు ఆదర్శభూతులైన ఒక కర్మయోగి అనే నిర్ణయానికి వచ్చాను ఏనాడో, అందుచేతనే నాకు వారిపై ఉన్న ఆదరానికి చిహ్నముగా నా కావ్యమీమాంసను వారికి అంకితం చేశాను."

దేవులపల్లి వారికి వివిధ కవులు, రచయితలు అంకితం చేసిన కృతులు :

1. అశ్వఘోషుడు (నాటకము) డాక్టర్ అరిపిరాల విశ్వం
2. నవోదయం - బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి
3. అనపోతు - సిద్ధయ్యకవి
4. కవితాపుష్పకం - డాక్టర్ దాశరథి
5. తెలుగు హాస్యము - మునిమాణిక్యం నరసింహారావు
6. సాహిత్య కౌముది - గుంటూరు శేషేంద్రశర్మ
7. జయంతి - ముదిగొండ వీరభద్రమూర్తి
8. సాహిత్య సౌరభం - డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం.
9. జాతకకథలు - (ఐదవభాగం) స్వర్గీయ స్వామి శివశంకరస్వామి
10. ఉదయం నా హృదయం - డాక్టర్ సి.నారాయణరెడ్డి
11. భాషా చారిత్రక వ్యాసావళి - డాక్టర్ తూమాటి దొణప్ప
12. మందారాలు - పోతుకూచి సాంబశివరావు
13. వైతరణి - వాసిరెడ్డి సీతాదేవి
14. అక్షర గుచ్ఛము - డాక్టర్ జ్ఞానానందకవి
15. ప్రతిజ్ఞ - ఎన్.వి.జగన్నాథం
16. ఫారసీ కవుల ప్రసక్తి - ఎన్.సదాశివ
17. అల్లసాని పెద్దన - డాక్టర్ పల్లా దుర్గయ్య
18. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము - జంధ్యాల జయకృష్ణ ప్రసాద్ బాపూజీ
19. నెలవంక - సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రత్యేక సంచిక
20. కాంతి పుంజాలు - నీలా జంగయ్య
21. బొమ్మ - శ్రీమతి జ్యోతిర్మయి
22. కావ్యమీమాంస - (రాజశేఖరుడి సంస్కృత రచనకు తెలుగు వ్యాఖ్య) ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

23. లజ్జా కిరీటధారిణి - వూటుకూరి లక్ష్మీకాంతమ్మ

24. పుంభావ సరస్వతి శ్రీనాథుడు - పాలకోట రాధాకృష్ణశాస్త్రి

25. ఉగాదులు - డాక్టర్ బోయి భీమన్న

26. వ్యాసాంజలి - తక్కెళ్ళ బాలరాజు

27. బెజవాడ దుర్గా మల్లీశ్వరాలయ శాసనాలు - బి.ఎన్.శాస్త్రి

రామానుజరావు వ్యక్తిత్వ విశిష్టతల్ని ఎంతో మంది ప్రముఖులు కొనియాడారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, సారస్వత పరిషత్తు ప్రస్తుత అధ్యక్షులు డాక్టర్ సి.నారాయణరెడ్డి "అతీత శత్రువు"గా రామానుజరావును అభివర్ణించారు. నియమబద్ధ జీవితం, స్వార్థచింతనా రాహిత్యం రామానుజరావు వ్యక్తిత్వంలోని గొప్ప లక్షణాలుగా ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు పేర్కొన్నారు. నిజాయితీ, కార్యదీక్ష ఆయనలో దండిగా ఉన్నాయని సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్య ప్రశంస. వందేమాతరం కావ్యకర్త ముదిగొండ వీరభద్రమూర్తి "ఆయన ఒక మాట అనరు - ఒక మాట పడరు" అని చెప్పారు.

"పూని యొకింత తెల్గునకు పుణ్యముసేయ దొడంగి రేనియున్
ధ్యానము సేయుడీ సుమహితంబగు నామము పెక్కసార్లు "రా
మానుజ"యన్న మానమదమత్సర దూషితులైన వారికిన్
జ్ఞానము వచ్చు, స్వార్థమదిచచ్చు పవిత్రత హెచ్చుటబ్రమే" అని పద్యప్రశంసలో దేవులపల్లి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబింపజేశారు ప్రసిద్ధ కవి ఉత్పల సత్యనారాయణాచార్య.

ఎవరికి వారు తమ పని చేయడం సులువు. అయితే ఒక సంస్థ నడవాలంటే ఎవరికి వారు పనిచేస్తే సరిపోదు. అందరూ కలిసిన "బృంద స్ఫూర్తి" (టీం స్పిరిట్) అవసరం. ఇటువంటి బృంద స్ఫూర్తి ఏర్పడాలంటే సహనము, కార్యదక్షత కలబోసిన నాయకుడు కావాలి. ఇటువంటి నాయకుడిని రామానుజరావు వ్యక్తిత్వంలో దర్శించవచ్చు. సారస్వత పరిషత్తు, సాహిత్య అకాడమీల్ని రామానుజరావు దక్షతతో నిర్వహించిన తీరు ఇందుకు నిదర్శనం.

అందరినీ కలుపుకొనిపోయే సుగుణం, అందరి అభిప్రాయాలనూ గుర్తించే స్వభావం, భిన్న రాజకీయ, సాంస్కృతిక ధోరణులు కలవారితోనూ అరమరికలు లేకుండా మైత్రి నెరపడం రామానుజరావు జీవితంలో కనబడుతుంది. వామపక్ష

మేధావి కాంచనపల్లి వెంకట రామారావుతో స్నేహం అటువంటిదే. రామానుజరావును విశ్వనాథ సత్యనారాయణ ఇష్టపడ్డారు. ఆయన భావాల్ని తీవ్రంగా వ్యతిరేకించే తాపీ ధర్మారావు కూడా రామానుజరావును అభిమానించారు. తుమ్మల సీతారామమూర్తి, జాషువా వంటి ప్రసిద్ధ కవులు హైదరాబాద్ వచ్చినపుడు రామానుజరావును తప్పనిసరిగా కలిసే వెళ్లేవారట.

రామానుజరావు సమున్నత సారస్వత వ్యక్తిత్వం అనే ఈ అధ్యాయాన్ని ముగించే ముందు ఆయన కుమార్తె ఎం.విమల; మనుమడు అనిల్ కృష్ణల జ్ఞాపకాల్ని కూడా చేర్చటం అవసరం. వ్యక్తిగత జీవితంలో ఆయన తీరుతెన్నుల్ని ఈ జ్ఞాపకాలు రేఖామాత్రంగా పరిచయం చేస్తాయి. ముందుగా కుమార్తె విమల జ్ఞాపకాలు :

"బాపు విగ్రహారాధన చేయలేదు. ఉదయమే ఆదిత్య హృదయం చదివేవారు. తరువాత భారత, భాగవతాలు, ముకుందమాలలో ఇష్టమైన పద్యాలు చదివేవారు. ఇంట్లో చిన్నపాటి గ్రంథాలయం ఉండేది. నాటి గురువుల్ని పదే పదే గుర్తు చేసుకునేవారు. గణితాన్ని బోధించిన అరుణాచల శాస్త్రి అంటే ఆయనకు ప్రత్యేకమైన అభిమానం. బాపుకు దళితుల పట్ల అవ్యాజ అనురాగాలు ఉండేవి. ఇంట్లో వసతి కల్పించి విద్యావకాశాలు కల్పించి జీవనోపాధి చూపించి వారి యోగక్షేమాలు చూడడం తన బాధ్యతగా భావించేవారు. వరంగల్‌లో ఉన్న సమయంలో పిల్లలతో వాహ్యాళి – చుట్టు పక్కల వారిని ఆప్యాయంగా పలుకరించి వారి కష్టసుఖాలు తెలుసుకునేవారు. సహనశీలి అమ్మ సహకారం ఆయనకు సదా ఉండేది. ఐశ్వర్యం ధనధాన్యాల పట్ల మమకారం లేదు. ఆడపిల్లలమని మా చదువును నిర్లక్ష్యం చేయలేదు. చదివించారు. బాపు విమర్శలకు జడిసేవారు కాదు, నిజానికి పట్టించుకునేవారు కాదు. సమక్షంలో లేని వారి గురించి పల్లెత్తు మాటైనా ఆయన నోటి నుండి జారేదికాదు. మా పిల్లలు తాతయ్య ప్రేమానురాగాలు పూర్తిగా పంచుకున్నారు. కాకతీయ సామ్రాజ్య పాలకుల గుర్తుగా మా అమ్మాయిని "రుద్రమాంబ" అని ముద్దుగా పిలుచుకునేవారు. మనుమరాలు శ్రీ దేవికి లేఖలు అనే పుస్తకం రాయాలనే బాపు కోరిక సఫలం కాలేదు. సత్సంకల్పంతో, సత్కార్య నిర్వహణలో పట్టుదల, అకుంఠిత దీక్షలతో సఫలీకృతుడై "ఖలులు తిట్టి రటంచు కలతపడనేల" అనే మహామనీషి మా బాపు"

(పుట 275–279; మానాన్నగారు: డాక్టర్ ద్వా.నా.శాస్త్రి)

"కుటుంబంలో రామానుజరావు" అన్న వ్యాసంలో డాక్టర్ అనిల్‌కృష్ణ తెలిపిన జ్ఞాపకాలు ఇట్లా ఉన్నాయి :

"తన వ్యక్తిత్వానికి బురఖా తగిలించుకునే ప్రయత్నాలు ఆయన ఎన్నడూ చేయలేదు. సెప్టెంబర్ నెలలో కొత్తబట్టలు కుట్టించుకొమ్మని ఇంట్లోవాళ్ళు గొడవపెట్టేవారు. మరో నెల తరువాత అక్టోబర్ నెలలో ఖాదీ దుకాణానికి వెళ్ళి నాలుగు జతల బట్టలు కొనేవారు. గాంధీ జయంతి సందర్భంగా ఖాదీబట్టలు ధరించాలనుకునే దేశభక్తి గల తాతయ్య స్వాతంత్ర్య సమరయోధుల పింఛను కొరకు ఏనాడూ ఆశించలేదు. స్నేహితులపట్ల తాతయ్యకు మమకారం, తాతయ్య భోజన ప్రియుడు. సొజ్జ భక్ష్యాలంటే ఆయనకు ప్రీతి. తాతయ్య ఎప్పుడూ ఉత్సాహంగా క్రమశిక్షణతో తన దినచర్యను కొనసాగించేవారు."

(ఆంధ్రసారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక, పుట 188)

అనేక సంవత్సరాలపాటు రామానుజరావుతో కలిసి పనిచేసిన ప్రసిద్ధ సాహితీవేత్త గడియారం రామకృష్ణశర్మ దేవులపల్లివారి అంతరంగాన్ని సరిగ్గా అంచనా వేశారు. ఆయన అభిప్రాయంలో ఈ అధ్యాయం పరిసమాప్తమవుతోంది.

"ఆంధ్ర సారస్వత పరిషత్తు - శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు" అన్న వ్యాసంలో గడియాం ఇట్లా రాశారు.

"వీరిని గూర్చి కొందరికి కొన్ని అభిప్రాయాలుండవచ్చును. కొన్ని అపోహలుండవచ్చును. కానీ వారి ఏ చర్యలుగాని ఇతరులకు ఏమాత్రము నష్టము కలగించు ఉద్దేశముతో చేసినవికావని కేవలము పరిషత్తు పురోభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఆయా సందర్భములలో ఆ విధముగా వ్యవహరించినారని నేను నిస్సందేహముగా తెలుపగలను. మరొకరు వీరి స్థితిలో ఉండియున్నచో తమ పలుకుబడిని స్వార్థమునకు ఉపయోగించుకొని, ఎంతో లాభము పొందియుందురు. అట్లుకాక వారి శక్తి యుక్తులన్నియు పరిషత్‌కే ఉపయోగింపబడినవనుట ప్రత్యక్షర సత్యములు. అధికార పీఠములపై ఉన్నవారి అడుగులకు మడుగులొత్తు నేర్పు - వారికి ఉన్నచో నేడు ఇతరులవలె ఉన్నత పదవులలో విరాజిల్లుచుండువారు. వారి వ్యక్తిత్వమట్టిదికాదు. చూచువారికి వారి వాక్కు కఠిన మనిపించును కాని హృదయము మెత్తనిది."

సంస్థల వికాసానికే అంకితమైన జీవితం

రామానుజరావుగారు తన సుదీర్ఘ ప్రజాహిత జీవితంలో పలు సంస్థలతో అనుబంధాన్ని పెంచుకున్నారు. హైదరాబాద్, వరంగల్లు నగరాలతోపాటు తెలంగాణలో, కోస్తాంధ్ర రాయలసీమల్లోనూ నెలకొల్పిన సాహిత్య-సాంస్కృతిక సంస్థలతో ఆయనకు సాన్నిహిత్యం ఉండేది. ఆయా సంస్థల వారు రామానుజరావు మార్గదర్శనాన్ని స్వీకరించేవారు. తమ ప్రాంతంలో నిర్వహించే సభలకు వక్తగా ఆహ్వానించేవారు. ఈ సందర్భాలలో ఔచిత్యానికి ఎటువంటిలోపమూ రాకుండా రామానుజరావు ప్రసంగించేవారు. అయితే ఆయన అనుబంధాన్ని పెంచుకున్న సంస్థల్లో మూడు ప్రధానమైనవి. అందులో ఒకటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, మరొకటి ఆంధ్ర సారస్వతపరిషత్తు మూడవ సంస్థ ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఈ సంస్థలకు రామానుజరావు అందించిన సేవలు అనిర్వచనీయమైనవి. సంస్థల వికాస క్రమంలో రామానుజరావు నిర్వహించిన భూమికను చరిత్ర గుర్తించింది. ఆయా సంస్థల ప్రస్తావన వచ్చినవెంటనే రామానుజరావు పేరు స్ఫురణకు రావడం వాటితో రామానుజరావు అనుబంధాన్ని గురించి చెప్పకనే చెబుతుంది. ఈ అధ్యాయం అందుకు సంబంధించిన వివరాల్ని సమీక్షిస్తుంది.

1948 సెప్టెంబర్‌లో హైదరాబాద్ సంస్థానం విశాల భారతావనిలో విలీనమైన తరువాత తెలంగాణలోని తెలుగు సాహిత్యాభిమానుల్లో కొత్త ఆకాంక్షలు చిగురించాయి. అప్పటివరకు తీవ్రనిర్బంధాల్ని ఎదుర్కొన్న తెలుగు భాషా సాహిత్య సంస్కృతులకు సంపూర్ణమైన స్వేచ్ఛ లభించినందుకు వారందరూ ఉప్పొంగిపోయారు. ఇక అప్పటి నుండి తెలుగువారి సాంస్కృతిక ఐక్యతను గురించిన ఆలోచనలు బలపడ్డాయి. విశాలాంధ్ర మహాసభ ఏర్పడడం, ఆంధ్ర రాష్ట్ర అవతరణ, కర్నూలు రాజధాని కావడం, అక్కడ ఏర్పడ్డ పాలనాపరమైన ఇబ్బందులు, హైదరాబాద్ రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు సర్కారు స్థిరపడడం – అనంతర రాజకీయ పరిణామాల నడుమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రూపకల్పన – ఇవి చాలామందికి తెలిసినవే. వాటిని తిరిగి ఈ సందర్భంలో వివరించడం అవసరం కాదేమో. 1956 నవంబర్ మొదటి తేదీ తరువాత

సంభవించిన సాంస్కృతిక పరిణామాల్నే ఇక్కడ పేర్కొనడం సముచితం. అందులో ప్రధానమైంది ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పాటు. తెలుగు సాహితీవేత్తలకు సరిపడే విశాలమైన వేదికగా సాహిత్య అకాడమి ఏర్పాటు అవసరమని పలువురు భావించారు. వారిలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డితోపాటు రామానుజరావు ప్రముఖులు. గోపాలరెడ్డికి అప్పటికే కోస్తాంధ్ర ప్రాంతంలో ప్రముఖ రాజకీయవేత్తగా గుర్తింపు ఉంది. స్వయంగా కవి, రచయిత. గురుదేవ్ రవీంద్రనాధటాగూర్ ప్రత్యక్ష శిష్యులు. ఆయన సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవతరించింది. రామానుజరావు ఈ సంస్థకు సుదీర్ఘకాలంపాటు కార్యదర్శిగా ఉన్నారు. అకాడమీ ఏర్పాటు నాటి సంగతుల్ని ప్రసిద్ధ పాత్రికేయులు జి.ఎస్.వరదాచారి తమ స్వీయచరిత్ర "జ్ఞాపకాల వరద"లో నమోదు చేశారు. అకాడమీ ఏర్పడేనాటికి వరదాచారి పాతికేళ్ళ నవయువ పాత్రికేయుడు. ఆయన స్వీయ చరిత్ర ఇటీవలే (మే, 2017) ఆవిష్కరణ పొందింది. నాటి జ్ఞాపకాల్ని ఆయన ఇట్లా రాశారు. (ఆయన ఆరోజుల్లో ఆంధ్రజనత పత్రికలో పాత్రికేయులు).

"1957 ప్రారంభం, ముక్కోటి తెలుగు ప్రజలను కలిపి ఆంధ్రప్రదేశ్ అంటూ ఒక రాష్ట్రం ఏర్పడింది గనుక తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేసేందుకు ఒక సాహిత్యపరిషత్తు ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచన తెలుగు సాహిత్యకారులకు కలిగింది. అప్పటికే అంటే 1954లోనే కేంద్ర సాహిత్య అకాడమీ ఏర్పాటయి పని చేస్తున్నది. రాష్ట్రంలో అటువంటి సంస్థలేదు. ప్రాంతీయ రచయితల సంఘాలు ఉన్నాయి. తెలంగాణ రచయితల సంఘం ఈ ప్రాంతంలో క్రియాశీలకంగా ఉండేది. ఆ పరిస్థితులలో రాష్ట్రస్థాయి సంస్థ ఏర్పాటును గురించిన ఆలోచన రావడం సహజం. అందుకే హైదరాబాద్ బొగ్గులకుంటలోని ఆంధ్రసారస్వత పరిషత్తు ఆవరణలో రెండు రోజుల సభలు ఏర్పాటు చేశారు. ఎడిటరు నన్నీ సభలకు వెళ్ళి విశ్లేషణాత్మక వార్త రాయమన్నారు. "మీకు జర్నలిజం తరగతిలో విశ్లేషణాత్మక కథనాల గురించి చెప్పి ఉంటారు గదా" అన్నారు. నేను అలాగే రెండు రోజులూ వెళ్లాను. తల్లావఝుల శివశంకరశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో విశ్వనాథ సత్యనారాయణ, శ్రీశ్రీ, అబ్బూరి రామకృష్ణారావు, ఆరుద్ర, దాశరథి కృష్ణమాచార్య, సి.నారాయణరెడ్డి, పోతుకూచి సాంబశివరావు, ఒకరేమిటి తెలుగులో పేరున్న కవులు, కవయిత్రులు, రచయితలు, రచయిత్రులు అందరూ పాల్గొన్నారు. సంప్రదాయవాదులు, అభ్యుదయ వాదులతో

కలిసిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య పరిషత్తు కార్యవర్గం ఏర్పాటైంది. దీనితీరుపై అప్పుడే భిన్నమైన అంచనాలు. కాని కొద్దిరోజులలోపలే బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఏర్పాటు కావడంతో అందరి దృష్టి అటు మళ్లింది. కేంద్ర సాహిత్య అకాడమీకి అనుబంధంగా ప్రభుత్వ సహాయ సహకారాలతో పని చేసే సాహిత్య అకాడమి తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధికి ప్రశంసనీయమైన కృషి చేసింది. దీనికి చాలా కాలం విశ్వనాథ సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా దేవులపల్లి రామానుజరావు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తెలుగు భాషలోని ప్రధాన గ్రంథాలన్నింటినీ పాఠకులకు సరసమైన ధరకు అందించేందుకు వీరు చేపట్టిన ఒక రూపాయికో గ్రంథం విప్లవాత్మకమైంది. వీరు ప్రచురించిన వృత్తిపదకోశాలు భాషాభివృద్ధికి తోడ్పడే అక్షయఖనులు. **(జ్ఞాపకాల వరద పుట 132-133)**

సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు సంస్థ రజతోత్సవాలను పురస్కరించుకొని వెలువరించిన ప్రత్యేక సంచికలో ఒక వ్యాసాన్ని రచించారు. "సాహిత్య అకాడమి - నాడు; నేడు" అనే శీర్షికతో రచించిన ఈ వ్యాసంలో సంస్థ ప్రారంభ సందర్భ విశేషాలున్నాయి. వాటిని సంక్షిప్త రూపంలో చెబితే

"1957 ఆగస్ట్ 7వ తేదీనాడు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రారంభోత్సవం జరిగింది. నాటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ సంస్థ ప్రారంభకులు. ఆంధ్ర యువతీమండలి సభామండపంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అప్పుడు భీమ్‌సేన్ సచార్ గవర్నర్. రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యామంత్రితోపాటు గోపాలరెడ్డి, విశ్వనాథ, రామానుజరావు వేదిక మీద ఆశీనులయ్యారు. 1957 ఆగస్ట్‌లోనే నియమావళి ఏర్పాటైంది. 61 మందితో కార్యనిర్వాహక వర్గం ఏర్పాటైంది. గోపాలరెడ్డి అధ్యక్షులు, విశ్వనాథ ఉపాధ్యక్షులు, రామానుజరావు కార్యదర్శి, బిరుదురాజు రామరాజు సంయుక్త కార్యదర్శి". గోపాలరెడ్డి ఈ వ్యాసంలో "అకాడమీ స్థాపింపబడిన 8 మాసములలోనే నేను కేంద్రమంత్రిగా హైదరాబాదును వదలినాను. తరువాత హైదరాబాద్ కాపురము లేదు. కార్యభారము కార్యదర్శులదే. ముఖ్యముగా 21 సంవత్సరములుపైగా కార్యదర్శిగా నుండిన శ్రీరామానుజరావే కార్యభారము వహించినారు" అంటూ ప్రశంసా వ్యాఖ్య చేశారు. **(పుట 455-456 ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రజతోత్సవ సంచిక)**

సాహిత్య అకాడమీకి కార్యదర్శి కీలక బాధ్యులు. ఇది ఎంతో ప్రతిష్ఠాత్మక బాధ్యత కూడా. అప్పటికి నాలుగు పదుల వయసులోనే ఉన్న రామానుజరావు ఈ బాధ్యతలకు ఎంపిక కావడం ఆయన విలక్షణత్వాన్ని చెబుతోంది. ఈ సందర్భంలో 1957ల నాటి తెలుగు సాహిత్యవాతావరణాన్ని సమీక్షించుకోవాలి. అప్పటికే కోస్తాంధ్ర ప్రాంత కవులు, రచయితలు, పత్రికా సంపాదకుల ప్రాబల్యం బాగా పెరిగింది. వారు ఇక్కడి సాహితీరంగ ప్రముఖుల్ని పెద్దగా పరిగణలోకి తీసుకోలేదన్నది చారిత్రక సత్యం. శివశంకర స్వామి వంటి వారికి కవితా ప్రతిభతో పాటు గట్టి పలుకుబడి ఉండేది. ఈ నేపథ్యంలో అచ్చమైన తెలంగాణ సాహితీవేత్త రామానుజరావు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శి కావడం గొప్ప విశేషమే. ఈ విషయాన్ని ఆయన తన "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు"లో ఇట్లా నమోదు చేశారు.

"కార్యదర్శి పదవిని కాటూరి వేంకటేశ్వరరావు పేరును ఆపేక్షించినట్లు దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు వారి పేరును ప్రతిపాదించినట్లు నాకు తెలిసినది. నార్ల వేంకటేశ్వరరావుగారు కాళోజి నారాయణ రావుగారి పేరును ప్రతిపాదించినట్లు తెలిసినది. అబ్బూరి రామకృష్ణారావుగారికి కూడా తాను కావలెనని కోరిక ఉండినదని విన్నాను. నార్ల వేంకటేశ్వరరావుగారు, అబ్బూరి రామకృష్ణారావు గారు ఉభయులూ పట్టాభి రామారావుగారికి సన్నిహితులు, సలహాదారులుగా ఉండిరి. ఏ కారణం వల్లనో ఈ ముగ్గురి పేర్లు ప్రభుత్వం ఇష్టపడలేదు. తరువాత ఒకరోజు అబ్బూరి రామకృష్ణారావుగారు నా వద్దకు వచ్చినారు. అంతకు ముందు నాకు వారితో పరిచయములేదు. అదే తొలి పరిచయము. కొంతసేపు మాట్లాడిన తరువాత సాహిత్య అకాడమీ కార్యదర్శిగా నేను ఉంటే బాగుండునని అన్నారు. అప్పుడు నేను వారితో ఎవరి వద్దకు వెళ్ళి అర్థించే స్వభావము నాకులేదు. వారు కోరితే అంగీకరిస్తాను. నా అంతట నేను కావలెనని అర్థించను అని చెప్పినాను. తర్వాత రెండు రోజులకు పట్టాభి రామారావు గారి కారు తీసుకొని అబ్బూరి రామకృష్ణారావు గారు వచ్చి మంత్రిగారు నన్ను ఆహ్వానించినారు అని తెలిపినారు. నేను వారి వెంట వెళ్ళి మంత్రిగారిని కలుసుకోగా మంత్రిగారు కార్యదర్శిగా ఉండడానికి అంగీకరించమని నన్ను కోరినారు. నేను అంగీకరించాను." **(యాభై సంవత్సరాల జ్ఞాపకాలు పుట 138)**

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పాతిక సంవత్సరాల ఉజ్వల ప్రస్థానానికి రామానుజరావు మార్గదర్శిగా ఉన్నారని అభివర్ణించడం సముచితం. సాహిత్య అకాడమీ

భవిష్య కార్యక్రమాల విషయంలో ఆయనకు సుస్పష్టమైన అవగాహన ఉండేది. ఏర్పర్చుకున్న నియమావళిని తు.చ. తప్పకుండా అనుసరిస్తూ సంస్థ ముందంజ వేయవలసి ఉంటుంది. అందుకే "ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నియమావళిలో యీ సంస్థ ఆశయాలు, లక్ష్యాలు, కార్యవిధానములు స్పష్టముగా పేర్కొనబడినవి. గడచిన 25 సంవత్సరాలలో యీ ఆశయాల పరిధిలోనే సాహిత్య అకాడమి తన కార్యక్రమాలు రూపొందించుకున్నది" అని రజతోత్సవ సంచికలో రామానుజరావు స్పష్టం చేశారు. (రజతోత్సవ సంచికలో వ్యాసం : అకాడమీ ప్రచురణలు – పదకోశాలు – పరిశోధనాత్మక గ్రంథాలు పుట 457) ప్రైవేటు సాహిత్య ప్రచురణ సంస్థలకూ అకాడమీకి మధ్య పోలికలు ఉండరాదు; అంతేకాదు– విశ్వవిద్యాలయాలలో అప్పటికే పరిశోధనలు వేగాన్ని పుంజుకున్నాయి. అవి కాకుండా విభిన్నమైన రీతిలో అకాడమీ పరిశోధనలు చేయించాలి. ఇదంతా సంక్లిష్టమైన బాధ్యత. అయినా తనదైన వివేచనాత్మక దృక్పథంతో రామానుజరావు అకాడమీ లక్ష్యసాధనకు దిశానిర్దేశం చేశారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రజతోత్సవాల నివేదికలో నాటి కార్యక్రమాల కార్యదర్శి, ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తి తమ నివేదికలో సంస్థ సాధించిన ప్రగతిని వివరించారు. స్థూలంగా ఆ ప్రగతి ఇది.

1. **ప్రామాణికమైన, సమగ్రమైన తెలుగు నిఘంటువు రూపకల్పన.**
2. **ప్రాచీనాంధ్ర కవుల పద ప్రయోగ కోశాల రూపకల్పన**
3. **ప్రాచీనాంధ్ర కావ్యాల పరిష్కృత ముద్రిత ప్రతులకు విద్వత్ పీఠికల్ని రచింపజేయడం.**
4. **అందరికీ ఉపకరించే పరామర్శ గ్రంథాల ప్రచురణ**
5. **వివిధ ప్రక్రియల్లో వెలువడిన గ్రంథాలకు బహుమతులు ప్రకటించడం, ప్రదానం చేయడం.**

"గడచిన 25 సంవత్సరాలలో సాహిత్య అకాడమి తెలుగు సాహిత్య వికాసానికీ, తెలుగు రచయితల ప్రతిష్ఠకూ, తెలుగు పఠితృలోకానికీ పరిశోధకులకూ పండితులకూ అన్ని విధాలా ఉపయుక్తంగా ఉండే గ్రంథాలను ప్రచురించి ఉపన్యాసాలనూ, సదస్సులనూ ఏర్పాటు చేసి తెలుగు దేశంలోని నలుమూలల రచయితల మధ్య

అక్షరసేతువుగా రూపొందుతూ వచ్చింది." "అకాడమీ ఒక దృక్పథానికి చెందింది కాదు. చెందింది కారాదు. ఆంధ్రప్రదేశ్ అకాడమి అలాకాలేదు. అదే దాని వ్యక్తిత్వం కూడా" అని ప్రసిద్ధ విమర్శకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం రాశారు. **(ఆధునిక సాహిత్యానికి అకాడమీ చేస్తున్న కృషి – వ్యాసం; రజతోత్సవ సంచిక పుట 461)** అందుకు అనుగుణంగానే వివిధ ప్రాంతాలు, దృక్పథాలకు చెందిన సాహితీవేత్తలకు అకాడమీ స్థానాన్ని కల్పించింది. వైవిధ్యభరితమైన కార్యక్రమాలు నిర్వహించింది. ప్రసిద్ధ ఉర్దూ కవి ఇక్బాల్, రవీంద్రనాధ్ ఠాగూర్, గురజాడ అప్పారావు, మరాఠీ నవలా రచయిత హరినారాయణ ఆప్టే, బెంగాలీ రచయిత శరత్ చంద్ర ఛటర్జీ, చిన్నయసూరి, గిడుగు రామమూర్తి, వేదం వేంకటరాయశాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, కాశీనాథుని నాగేశ్వరరావు, తిరుపతి వేంకటకవులు, కట్టమంచి రామలింగారెడ్డి, సరోజనీదేవి, మారేపల్లి రామచంద్రశాస్త్రి శతజయంతి ఉత్సవాలు అకాడమీ ఆధ్వర్యంలో జరిగాయి. క్షేత్రయ్య త్రిశతి జయంతి, తులసీదాసు చతుశ్శత జయంతి, సూరదాసు పంచశతజయంతి ఉత్సవాలను కూడా సాహిత్య అకాడమీ నిర్వహించింది.

అకాడమీ కార్యక్రమాల రూపకల్పన, వాటిని పటిష్ఠంగా అమలు చేయడాన్ని రామానుజరావు తమ విధ్యుక్త బాధ్యతగా గుర్తించారు. రెండున్నర దశాబ్దాల కాలంపాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీని దీక్షాదక్షతలతో ముందుకు నడిపించారు. "అకాడమీ పుట్టుక నుంచి కార్యదర్శిగా ఉండి 20 సంవత్సరాలు అత్యంత శ్రద్ధాసక్తులతో నిర్వహించిన సాహిత్య స్నేహమూర్తులు ప్రస్తుత అకాడమీ అధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి అభినందనలు" అంటూ ఇరివెంటివారు తమ నివేదికలో సముచితమైన వ్యాఖ్య చేశారు.

అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి "భళిరే రామానుజరావు" అన్న వ్యాసంలో అకాడమీ కార్యనిర్వహణలో రామానుజరావుదే కీలక భూమిక అని స్పష్టం చేస్తూ ఇట్లా రాశారు :

"నాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ద్వారానే వారితో ఎక్కువగా పరిచయము. 1957 ఆగస్టులో అది ప్రారంభమైనప్పటి నుండి నేను, వారు అధ్యక్షులుగా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించినాము. నేను అకాడమీ అధ్యక్షుడైన తరువాత 8 మాసములకు హైదరాబాదును వదలి ఢిల్లీలో మంత్రినైనాను. ఆ తరువాత

పార్లమెంటులోను, లక్నోలోనూ, నెల్లూరులోనూ నేను జీవితం గడిపినాను. అంటే అకాడమీ అధ్యక్షులుగా నేను ఎనిమిది మాసములు మాత్రమే హైదరాబాద్‌లో ఉండినాను, నేను దూరముగా ఉన్నా అధ్యక్షుడినే. కాని అన్ని కార్యకలాపములు రామానుజరావు చూచుకొనుచుండిరి. నేను సభలకు రావడం అధ్యక్షత వహించడం తగిన సలహాలు ఇవ్వడం చేస్తూ ఉండినా అకాడమీ దైనందిన కార్యకలాపములన్నీ రామానుజరావుగారే చూసుకొనుచుండిరి. ఈ రీతిగా 23 సంవత్సరములు అకాడమీ పనిని నిర్వహించినాము." **(అక్షరదీపం పుట 11)**

రామానుజరావు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన రోజుల్లో సాహిత్య అకాడమి రమారమి 400 పుస్తకాలు ప్రచురించింది. పరిశోధనాత్మక ప్రచురణలకు పెద్దపీట వేసింది. ప్రామాణికత కోసం విశేషంగా శ్రమించింది. ఇందుకు సంబంధించిన అనుభవాలను ప్రసిద్ధ సాహితీమూర్తి గడియారం రామకృష్ణశర్మ స్వీయచరిత్రలో చూడవచ్చు.

రామానుజరావు ఆనాటి పరిస్థితుల్లో విశాలాంధ్ర వాదాన్ని సమర్థించిన వాస్తవాన్ని కాదనలేము. అయితే ఆనాడు సాహితీరంగ ప్రముఖులందరూ విశాలాంధ్ర వాదంవైపే మొగ్గు చూపిన వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా రామానుజరావు నాటి తెలంగాణ పండిత మండలికి కూడా తగిన ప్రోత్సాహాన్ని అందించారు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఆనాడు సాహిత్య అకాడమీ ప్రచురణల్లో భాగస్వాములైన తెలంగాణ సాహితీవేత్తలు – వారి కృషి ఇది :

కె.గోపాల కృష్ణారావు (ఆధిక్షేప శతకములు – సం॥ 1982), కేశవపంతుల నరసింహశాస్త్రి (అనర్ఘ రాఘవము, సం॥ 1977), చెలమచెర్ల రంగాచార్యులు అభిజ్ఞాన శాకుంతలమ్ (వ్యాఖ్యానం – 1982), ఎస్.సదాశివ (అమ్జద్ రుబాయీలు సం॥1964), ఆంధ్ర శతక వాఙ్మయము (డాక్టర్ కె.గోపాలకృష్ణారావు –సం॥1975), డా.సి.నారాయణరెడ్డి (ఆధునికాంధ్ర కవిత్వం – భావకవిత్వ యుగం), డాక్టర్ పి.యశోదారెడ్డి (ఉత్తర హరివంశం – సం॥1970), బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి (ఉర్దూ కథానికలు సం॥ 1963), ఎస్.సదాశివ (ఉర్దూ కవుల కవితా సామగ్రి– సం॥1970, ఉర్దూ సాహిత్యచరిత్ర – సం॥1963), గడియారం రామకృష్ణ శర్మ (కేయూర బాహుచరిత్ర –సం॥ 1966), సి.నారాయణరెడ్డి (గాంధీయం –

సం॥1969), కేశవపంతుల నరసింహశాస్త్రి (చంద్రికాపరిణయము – సం॥1982), శ్రీరంగాచార్య (చాటుపద్య రత్నావళి – సం॥1978), డాక్టర్ బి.రామరాజు (జాంబవతీ పరిణయము – 1969), డాక్టర్ ఎం.కులశేఖరరావు (జైమిని భారతము – సం॥1980), శ్రీరంగాచార్య (తాలాంకనందినీ పరిణయము –1980), డాక్టర్ దాశరథి (తెలుగు అఫ్‌సానే –సం॥1963), డాక్టర్ ఎం.కులశేఖరరావు (తెలుగు వచన వికాసము–సం॥ 1975), బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి (దశకుమార చరిత్రము – 1967), మరింగంటి శ్రీరంగాచార్య (దశరథ రాజనందన చరిత్రము– 1974), డాక్టర్ పి.యశోదారెడ్డి (ప్రబంధ వాఙ్మయము – 1975), ఎస్.సదాశివ (ఫారసీక కవుల ప్రసక్తి–1976), డాక్టర్ పి.యశోదారెడ్డి (మహాభాగవత కల్ప కుసుమమాల –1982), ఎస్.సదాశివ (మీర్జాగాలిబ్ –1969, మౌలానా రూమీ మస్నవీ – 1967), కేశవపంతుల నరసింహశాస్త్రి (రఘువంశం వ్యాఖ్యానం), డాక్టర్ బి.రామరాజు (రాఘవాభ్యుదయం – 1965), డాక్టర్ కోవెల సంపత్కుమారాచార్య (లక్షణ సారసంగ్రహము–1971), డాక్టర్ కె.సుప్రసన్నాచార్య (వసుచరిత్ర–1967), డాక్టర్ బి.రామరాజు (వాల్మీకి చరిత్ర–1968), డాక్టర్ పల్లా దుర్గయ్య (విక్రమార్కచరిత్రము – 1968), డాక్టర్ కె.గోపాలకృష్ణారావు (విక్రమోర్వశీయనాటక పీఠిక అనువాదం 1978), డాక్టర్ బి.రామరాజు (శుకసప్తతి – 1973, శృంగారశేఖర భాణము – 1969), కండ్లకుంట అళహ సింగరాచార్యులు (సంస్కృత క్రియలు – 1978), కేశవపంతుల నరసింహశాస్త్రి (సంస్థానములు – సాహిత్యసేవ 1975), డాక్టర్ ఎం.కులశేఖరరావు (సింహగిరి వచనములు –1980), గడియారం రామకృష్ణశర్మ (సింహాసన ద్వాత్రింశిక–1982), డాక్టర్ కె.సంపత్కుకుమారాచార్య (సుకవి మనోరంజనము – 1976), డాక్టర్ పి.యశోదారెడ్డి (హరిశ్చంద్రోపాఖ్యానము – 1967).

రామానుజరావు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా ఉన్న రోజుల్లో తమను గుర్తించి తగురీతిలో ప్రోత్సహించారని పలువురు తెలంగాణ సాహితీవేత్తలు రాశారు. మౌఖికంగానూ ఈ అంశాన్ని కృతజ్ఞతా పూర్వకంగా స్మరించిన వారు ఎందరో ఉన్నారు.

రామానుజరావు కార్యశైలి, దీక్షాదక్షతల వల్ల ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీకి దేశంలోని వివిధ రాష్ట్రాలలోని సాహిత్య అకాడమీల కంటే గొప్ప గుర్తింపు దక్కిందని

ఆనాటి సాహితీవేత్తల నిశ్చితాభిప్రాయం. "ఇతరములైన అకాడమీల కంటే సాహిత్య అకాడమీ చేసిన సేవ శాశ్వతమును, ప్రశంసాపాత్రమునై విరాజిల్లెను. దాని ద్వారా ఆంధ్ర సాహితీ సరస్వతికెన్నో నూతనాలంకారములు కల్పింపబడెను" అన్నారు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పూర్వఅధ్యక్షులు ఆచార్య దివాకర్ల వేంకటావధాని. "సాహిత్య అకాడమీ కార్యదర్శులుగా శ్రీ రామానుజరావుగారు చూపిన కార్యదక్షత అనన్యసాధారణమైనది. ఈ అకాడమీ దేశంలోని ఏ అకాడమీ కూడా ప్రచురించజాలని అన్ని గ్రంథాలు ప్రచురించిందంటే వీరి కార్యదీక్షయే అందుకు కారణం అని చెప్పడంలో సందేహంలేదు" అన్నారు ప్రసిద్ధ సంస్కృత విద్వాంసులు ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు. "దేవులపల్లి రామానుజరావు రెండున్నర దశాబ్దాలపాటు సాహిత్య అకాడమీ నావను నడిపించిన కర్ణాధారులు పరస్పర విరుద్ధ భావాలున్న రచయితలతో ఇంతకాలం ఒక సాహిత్య సంఘాన్ని నిర్దుష్టంగా ప్రయోజనాత్మకంగా సమన్వయ గుణసంపన్నంగా నడిపిన గౌరవం ఆయనకే దక్కుతుంది. ఇది భారత దేశ చరిత్రలోనే ఒక అపురూపమైన విషయం. ఆయన స్వయంగా రచయిత అయినా తన ప్రాభవం కోసం సంస్థను ఉపయోగించని ధీరోదాత్తులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ భారతదేశంలో అన్ని రాష్ట్రాల సాహిత్య అకాడమీల కంటే మిన్నగా తన ఉనికిని సార్థక పరచుకున్నదని నిష్పాక్షికులైన విజ్ఞులెందరో తమ అభిప్రాయాలను వెలిబుచ్చినారు" అని డాక్టర్ ఇరివెంటి కృష్ణమూర్తి రాశారు. ఈ ప్రముఖుల వ్యాఖ్యలు ప్రశంసలు కావు; అవి ప్రత్యక్షర సత్యాలు. ఆనాటి సాహిత్య అకాడమీతో సాన్నిహిత్యమున్న వారెవరిని అడిగినా ఈ సంగతిని స్పష్టంగా నిర్ధారిస్తారు.

1983లో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనకు అప్పటివరకు తెలుగునాట వికసించిన ఆధునిక సాహిత్యం, ఇందుకు దోహదం చేసిన సాహిత్య అకాడమీ వంటి సంస్థల గురించిన అవగాహన లేదు. ఆయన నాటి మదరాసు మహానగరంలో ఉన్నందువల్ల ఈ సంస్థల గురించి తెలియకపోవడమూ అసహజం కాదు. అయితే రాజకీయ రంగంలో ఉన్నట్టే ఆయనకు సాంస్కృతిక రంగంలోనూ కొంతమంది సలహాదారులు ఉండేవారు. వారిలో ఒకరిద్దరికి సాహిత్య అకాడమీని రద్దు చేయించాలనే ఆలోచన వచ్చి ఉంటుంది. ఆనాడు రామారావు గట్టిగా తలచుకుంటే జరగనిది లేదు! అట్లా ఉండేది ఆయన పలుకుబడి. హితవరుల సలహాను

అనుసరించారు రామారావు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న పలు అకాడమీల్ని రద్దు చేయించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ రద్దు జరిగింది. సంస్థ గత చరిత్రలో నిలిచిపోయింది. రద్దు నిర్ణయం సమయంలో కొంతమంది సాహితీవేత్తలైనా బలమైన నిరసన తెలిపితే పరిస్థితి కొంత భిన్నంగా ఉండేదేమో. రామానుజరావు అకాడమీల రద్దు నిర్ణయం పట్ల తమ తీవ్ర నిరసనను తెలియజేశారు. ఆచార్య తిరుమల, సీతాశరశ్చంద్రలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో "మన రాష్ట్రంలోని అకాడమీల రద్దు విషయంపై మీ అభిప్రాయమేమిటి?" అని అడిగిన ప్రశ్నకు "అకాడమీల రద్దు విషయం సమర్ధనీయం కాదు. ఆ విషయం మీద ఆంధ్రజ్యోతి ఆంధ్రపత్రికలలో కూడా నా అభిప్రాయం పత్రికా ముఖంగా తెలియజేయడం జరిగింది. జూన్ 1985లో ఈ విషయం ముఖ్యమంత్రిగారి సమక్షంలో కూడా చెప్పడం జరిగింది" అని జవాబిచ్చారు రామానుజరావు.

అకాడమీల రద్దు జరిగిన రెండు దశాబ్దాల తరువాత తిరిగి తెలుగు సాహితీవేత్తలు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పునరుద్ధరణను గురించి పలు సభలు, సమావేశాల్లో ప్రస్తావిస్తూ వచ్చారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే ఈ ప్రస్తావనలు బలంగా వెలువడ్డాయి. అయితే ఆ రోజుల్లో దీనిపై పెద్దగా ప్రభుత్వం తరఫున స్పందనలు కనిపించలేదు. ఇటీవలి కాలంలో తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు చొరవ తీసుకొని తెలంగాణ సాహిత్య అకాడమీని ఏర్పాటు చేశారు. తెలుగు సాహిత్యాభిమానులందరూ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు.

ప్రస్తుతం తెలంగాణ సారస్వత పరిషత్తుగా మారిన నాటి నిజాం ఆంధ్ర సారస్వత పరిషత్తుకు రామానుజరావు అందించిన అపారమైన సేవలను గూర్చి సమీక్షించుకుందాం. వాస్తవానికి ఈ అంశంపై ఎంత సమీక్షించినా కొంత తక్కువే అవుతుంది– అందువల్ల విశేషాంశాల్ని మాత్రమే ఇక్కడ పేర్కొనడం జరుగుతుంది.

వందేమాతర ఉద్యమం కారణంగా నాగ్‌పూర్‌కు తరలివెళ్ళి అక్కడ న్యాయశాస్త్ర పట్టభద్రులయ్యారు రామానుజరావు. అప్పటికే ఆయన హైదరాబాద్ నుండి (చాలా కొద్దికాలమే) వెలువడిన తెలంగాణ దినపత్రికలో రచించిన వ్యాసాలు మాడపాటి హనుమంతరావు వంటి పెద్దల మెప్పును పొందాయి. సుదూర మరాఠీ ప్రాంతంలో ఉంటున్నప్పటికీ తెలుగు సాహిత్యపు తాజా సంగతుల్ని సైతం రామానుజరావు

అధ్యయనం చేస్తున్నట్టు నాటి వ్యాసాలు చెప్పకనే చెప్పాయి. ఈ వ్యాసాల్ని చదివిన వారికి ఆ రచయిత తప్పకుండా సాహిత్య ప్రపంచానికే అంకితమవుతాడనే అభిప్రాయం ఏర్పడుతుంది. ఇది వాస్తవం. రామానుజరావు న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే తమ భవిష్య లక్ష్యాన్ని నిర్ధారించుకున్నారు. తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషకు సేవచేయడమే తన ఏకైక సంకల్పంగా భావించారు. అందుకు తగిన వేదికగా ఆంధ్రసారస్వత పరిషత్తు కనబడింది. 1944లో సారస్వత పరిషత్తు కార్యవర్గ సభ్యులయ్యారు దేవులపల్లి రామానుజరావు.

సారస్వత పరిషత్తు ఆవిర్భావ నేపథ్యం చాలా మందికి తెలుసు కనుక ఇక్కడ ఆ అంశాన్ని సుదీర్ఘంగా వివరించవలసిన పనిలేదు. 1930లో ఆంధ్రమహాసభ వార్షిక కార్యక్రమాలు ఒక రూపానికి వచ్చాయి. ఇది తొలుత తెలుగు సాహిత్య సాంస్కృతిక అంశాలకు తగు ప్రాధాన్యతను కల్పించింది. అయితే 1937 నిజామాబాద్ (ఆరవ) మహాసభల తరువాత సంస్థ దృక్పథంలో మార్పు పొడసూపింది. ఇది ప్రతాపరెడ్డి వంటి భాషాభిమానులకు రుచించలేదు. తెలుగు భాషా సాహిత్యాల ప్రోత్సాహక వేదిక ఒకటి ఎంతో అవసరమని వారు భావించారు. ప్రతాపరెడ్డి, మాడపాటి వంటి పెద్దల ఆశీస్సులతో భాస్కరభట్ల కృష్ణారావు, బూర్గుల రంగనాధరావు, లోకనంది శంకరనారాయణరావు వంటి కార్యదక్షుల ఉత్సాహంతో 1943లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడింది. "ఇంతింతై వటుడింతయై" అన్న రీతిలో పరిషత్తు ఎదిగింది. ఎంతోమంది తెలుగు అభిమానులకు వటవృక్షం వలె నీడనిచ్చి కల్పవృక్షం వలె జీవనోపాధిని కలిగించింది. నాటి పెద్దల సంకల్పబలం, తరువాత కాలం నుండి నేటివరకు నిర్వాహకుల దక్షతాబలంతో ఇప్పుడు కూడా గొప్ప సంస్థగా మన్ననలు అందుకుంటున్నది. తనకు సారస్వత పరిషత్తుతో ఏర్పడిన పరిచయ – అనుబంధాలను గురించి రామానుజరావు ఇట్లా రాశారు :

"1943లో పరిషత్తు స్థాపన సందర్భంలో నాకు ఆ సంస్థతో ఏర్పడిన సంబంధం క్రమ క్రమంగా దృఢపడింది. 1944లో కార్యవర్గ సభ్యునిగా ఎన్నికై 1949లో ఉపాధ్యక్షుడనై పరీక్షా కార్యదర్శినై పరిషత్తు కార్యక్రమాలలో పూర్తిగా నిమగ్నుడనైతిని. 1948-53 మధ్యన పరిషత్తుతో అవినాభావ సంబంధము కలిగినది. ఇతర ఉద్యమాలు వేనిలో పాల్గొనినా అవి రాజకీయ ఉద్యమాలైననూ సాంస్కృతిక వైజ్ఞానిక ఉద్యమాలైననూ ఏవైనను జీవితముతో పూర్తిగా పెనవేసుకొనిపోయినది ఆంధ్ర

సారస్వత పరిషత్తు మాత్రమే. అది యావజ్జీవిత సంబంధముగా పరిణమించినది. ఆంధ్ర సారస్వత పరిషత్తు శాఖోపశాఖలుగా విస్తరించి రాష్ట్రేతర ప్రాంతాలలో కూడా పరీక్షల నిర్వహణ, ఉత్తమ శ్రేణి ప్రచురణల సాహిత్య సమావేశాలు ఏర్పాటు మొదలైన కార్యక్రమాలతో ముందుకు సాగింది. హైదరాబాద్ రాజధాని నగరంలో పరిషత్తుకు విశాలమైన వసతి, భవనాలు ఏర్పడినవి. మంచి గ్రంథాలయం రూపొందినది. ఎం.ఏ. తరగతుల వరకు బోధన చేసే ప్రాచ్యకళాశాలను పరిషత్తు నిర్వహిస్తున్నది. అనేక సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలకు పరిషత్తు కేంద్రమైనది. దేశంలో యీ విధంగా సువ్యవస్థితమైన సారస్వత సంస్థలు మిక్కిలి తక్కువ. అందరి సహకారంతో తెలుగువారు గర్వించదగిన ఒక మహాసంస్థగా యీనాడు పరిషత్తు శోభిల్లుతున్నది. పరిషత్తు వికాసానికి జీవితంలో అత్యధిక భాగాన్ని వినియోగించిన సంతృప్తి పూర్తిగా నాకున్నది. ఇంటిలోని వ్యవసాయాన్ని విస్మరించి సులభంగా సాధించగలిగిన ఉద్యోగాల జోలికి పోక అనుకూలంగా అవలంబించదగిన న్యాయవాద వృత్తిని గూర్చి శ్రద్ధ వహించక యీ విధంగా సారస్వత పరిషత్తు నుండి ప్రారంభించి – పూర్తిగా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలలో మునిగిపోయినాను" (యాభై సంవత్సరాల జ్ఞాపకాలు పుట 111). ఆచార్య ఎల్లూరి శివారెడ్డి "మరపురాని మనస్వి" అన్న వ్యాసంలో పేర్కొనట్టు "పరిషత్తు వెన్నెముక రామానుజరావుగారు. పరిషత్తు అభ్యుదయానికి తమ జీవితంలోని సుఖాల్ని ధారపోశారు..."

రామానుజరావు కార్యదీక్ష వల్ల పరిషత్తు ఎంతో తొందరగా విస్తరించింది. పరీక్షల నిర్వహణ కట్టుదిట్టంగా జరిగింది. ఒక్క ఆంధ్రప్రదేశ్ భౌగోళిక పరిధిలోనే కాదు, తెలుగేతర ప్రాంతాలలోనూ పరిషత్తు పరీక్షలు నిర్వహించబడ్డాయి. పరిషత్తులో జరిగే ప్రసంగ కార్యక్రమాలకు ఆ కాలంలో నగరంలోని సాహిత్యాభిమానులు తండోపతండాలుగా తరలివచ్చేవారని ఆనాటి పలువురి జ్ఞాపకాలు చెబుతున్నాయి. 1930–40 ప్రాంతాల్లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం ప్రముఖ వక్తలకు ఎట్లా వేదికగా మారిందో అటు తరువాత కాలంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు అటువంటి వేదిక అయింది. పరస్పర విరుద్ధమైన సైద్ధాంతిక అభిప్రాయాలున్న వారు సైతం ఇక్కడ ఒకేచోట ప్రసంగించడం విశేషం. చారిత్రాత్మకమైన పరిషత్తుకు, ఉన్నత వ్యక్తిత్వమున్న రామానుజరావుకు పెద్దలందరూ సముచిత ఆదరాన్ని పలికారు. పరిషత్తు ప్రాంగణంలో ప్రాచ్యకళాశాల ఎంతో చక్కగా ఎదిగింది. ఒక తెలుగు పండిత శిక్షణ

కళాశాల కూడా ఏర్పాటైంది. గ్రంథాలయమూ రూపుదిద్దుకున్నది. "ఆంధ్ర సారస్వత పరిషత్తు – దేవులపల్లి రామానుజరావుగారు" అన్న వ్యాసంలో పరిషత్తుతో దశాబ్దాల అనుబంధమున్న గడియారం రామకృష్ణశర్మ పరిషత్తు కార్యక్రమాల్ని వివరించారు. అవి :

1. **చక్కటి ప్రణాళికతో తెలుగు పరీక్షలు నిర్వహిస్తున్నది. ఇవి రాష్ట్రేతర ప్రాంతాలతోపాటు మారిషస్ వంటి విదేశాల్లోనూ జరుగుతున్నాయి.**
2. **ప్రజాసాహిత్యము, పండిత సాహిత్యము, జానపద సాహిత్యముగా ఉత్తమ గ్రంథాల ప్రచురణ జరుగుతున్నది.**
3. **ఉత్తమస్థాయి గ్రంథాలయము నిర్వహించబడుతున్నది.**
4. **సాహిత్య కార్యక్రమాలు, పండిత సన్మానాలు జరుగుతున్నాయి.**
5. **సాహిత్యవేదిక పేరుతో ప్రతినెలా చర్చాగోష్టులు జరిపి ఆ ఉపన్యాసములను ప్రచురిస్తున్నది.**
6. **ప్రీ డిగ్రీ కోర్సు నుండి ఎం.ఏ. వరకు గల తరగతులతో ఒక ప్రాచ్యకళాశాల నడుపబడుతున్నది.**

రామానుజరావు సుదీర్ఘ కాలంపాటు సారస్వత పరిషత్తుకు సేవలు అందించడం నిజంగా తెలుగువారి అదృష్టం. సంస్థ వికసిస్తున్న దశలో ఆయన వంటి కార్యదక్షులు బాధ్యులుగా ఉండడం సాంస్కృతిక రంగానికి వరమైంది. **ప్రముఖ రచయిత్రి ఇల్లిందల సరస్వతీదేవి రాసినట్లు "రామానుజరావు చేసిన కృషిలోకంతటికీ సారస్వత పరిషత్తు విషయంలో జరిగిన కృషి గణనీయమైనది. నిర్మాణాత్మకమైనది, స్వతంత్ర ప్రతిపత్తి కలిగినది, శాశ్వతంగా నిలిచేది..." ప్రముఖ రచయిత గోపాల చక్రవర్తి "ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆయనకు ఆరోప్రాణం" అని పేర్కొన్నారు. ఇది సుస్పష్టమైన సత్యం.**

ఆంధ్రసారస్వత పరిషత్తు మహాసభలు పలు ప్రాంతాల్లో అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడ్డాయి. 1949లో తూపురాన్‌లో జరిగిన సభల తాలూకు విశేషాలు జి.కృష్ణ "విలేకరిలోకం"తోపాటు మరెన్నో చోట్ల దొరుకుతాయి. 1950లో మంచిర్యాలలో మహాసభలు గొప్పగా జరిగాయి. అయితే వీటన్నింటికంటే చారిత్రాత్మక స్థాయిలో జరిగినవి ఆలంపూర్ (1953) మహాసభలు. నాటి సభా విశేషాలు

గడియారం రామకృష్ణశర్మ "శతపత్రం", మహాకవి దాశరథి "యాత్రాస్మృతి"ల్లో దొరుకుతాయి. పలు చారిత్రక వ్యాసాలలో నాటి విశేషాలు నమోదు అయ్యాయి. ఈ సభలు "నభూతో నభవిష్యతి" అని పెద్దలు చెప్పారు. సంక్రాంతి సమయంలో నిర్వహించిన ఈ సారస్వత ఉత్సవంలో రమారమి ఇరవై ఐదువేల మంది అతిధులకు పిండి వంటలతో వడ్డనలు చేశారట. నాటి భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చేసిన ప్రసంగం చిరస్మరణీయమైనదని చెబుతారు. ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, అభ్యుదయకవి శ్రీరంగం శ్రీనివాసరావు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు – ఇంకా ఎందరెందరో ప్రముఖులు ఈ సభల్లో పాల్గొన్నారు. గడియారం రామకృష్ణ శర్మ సంపాదకత్వంలో "సుజాత" పత్రిక ప్రత్యేక సంచికను వెలువరించింది. ఇది కలకాలం పదిలపరచుకోదగిన స్థాయిలో ఉంది. ఆలంపురం సభలను అత్యంత క్రమశిక్షణాయుతమైన పద్ధతిలో నిర్వహించడం వెనుక దేవులపల్లి రామానుజరావు పాత్ర ఎంతో ఉంది. ఆయనతో సంపూర్ణంగా కదిలి ఆలంపూర్ సభల్ని విజయవంతం చేసిన మరొక ప్రముఖ సాహితీవేత్త గడియారం రామకృష్ణశర్మ.

మూడవ బాధ్యత ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సంబంధించింది. సంస్థ శత వార్షికోత్సవాల సందర్భంలో "నవ తెలంగాణ" దినపత్రిక ఒక ప్రత్యేక సంచిక **(ఓ.యూ. సావనీర్ ప్రత్యేకం)**ను వెలువరించింది. ఇందులో "ఉస్మానియా మేరునగధీరుడు" అనే వ్యాసంలో ఇట్లా రాశారు (పుట 26).

"ఓ.యూ. ఉనికిని కాపాడారు. స్వాతంత్ర్యానంతరం తొలి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని చూసి పరవశించారు ఆ నిజాం సంస్థానం విలీనానంతరం ఆయన స్థాపించిన ఉస్మానియా యూనివర్సిటీని కేంద్రీయ విశ్వవిద్యాలయంగా మార్చాలని యత్నించారు. అంటే... తొట్టతొలిగా దేశభాష ఉర్దూ మీడియంలో స్థాపించిన వర్సిటీని హిందీ మీడియం వర్సిటీగా మార్చాలన్నది నెహ్రూ వాంఛ. బహుశా రామానుజరావు ఆ కాలంలో లేకుంటే అంత పనీ జరిగిపోయేదే. దేశ భక్తుడైన రామానుజరావు ఆ విషయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. నెహ్రూ నిర్ణయానికి వ్యతిరేకంగా శిష్టజన మద్దతును కూడగట్టారు. ఆయన చొరవ ఫలితంగానే ఉస్మానియా యూనివర్సిటీ తన ఉనికిని కాపాడుకోగలిగింది. దీనిని చరిత్రకారులు సరిగ్గా రికార్డు చేయలేదు. దాంతో ఆయనకు ఈ విషయంలో రావల్సినంత ప్రాధాన్యత రాలేదు".

ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విద్యాలయంగా మార్చే ప్రయత్నానికి నేపథ్యం ఉంది. నవాబ్ అలీ యార్ జంగ్ అనే ఉన్నత విద్యావంతుడు వైస్‌ఛాన్సలర్‌గా పనిచేశారు. పోలీసుచర్య తరువాత కాలంలో భారత ప్రభుత్వం - నిజాం రాజుకు మధ్య లైజాన్ ఆఫీసర్‌గానూ నియామకాన్ని పొందాడు. ఆయనకు తెలుగు భాష పట్ల కొంత చులకన భావం కూడా ఉండేదట. విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ కాగానే ఒక కొత్త ఎత్తుగడను ఆయన తయారు చేసుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రం స్వాధీనం చేసుకొని, హిందీ భాషలో విద్యాబోధన చేయించవలెనని ప్రభుత్వానికి లేఖ రాసి ఆమోదాన్ని పొందాడు. కేంద్రం ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తుందని ఆయనకు తెలుసు. ప్రతిఫలరూపంలో తనకు మరిన్ని మంచి పదవులు లభిస్తాయనే అంచనా ఆయనలో ఉంది. ఈ రెండూ నిజమయ్యాయి. కేంద్రం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసుకునేందుకు నిర్ణయించింది. ఇది స్థానికులలో తీవ్రమైన నిరసనను రేకెత్తించింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈ నిరసనలకు ఒక స్పష్టమైన రూపాన్ని ఇచ్చింది. ప్రముఖ న్యాయవాది లక్ష్మణరావు అధ్యక్షతన దేవులపల్లి రామానుజరావు కార్యదర్శిగా ఒక సిటిజన్స్ కమిటీ ఏర్పాటైంది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి ప్రముఖులు ఈ ఉద్యమానికి మద్దతునిచ్చారు. ప్రతిపక్షాలు పౌర సంఘం (సిటిజన్స్ కమిటి) అభిప్రాయాన్ని బలపర్చాయి. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, కేంద్ర విద్యామంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ హైదరాబాద్ వచ్చినపుడు పౌర సంఘం ఒక రాయబార వర్గాన్ని వారి దగ్గరికి పంపించింది. జవహర్‌లాల్ నెహ్రూ ఈ రాయబార వర్గంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాయబార వర్గం కూడా అదేస్థాయిలో స్పందించింది. తర్కబద్ధంగా తమ అభిప్రాయాన్ని తెలియజేసింది. రాయబారవర్గం కోరికను ఆమోదించవలసినదిగా ప్రధాని నెహ్రూకు ఆజాద్ సలహా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసుకొని హిందీని బోధనా భాషగా చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నది. నేటి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఆనాడు ఏర్పడిన గండాన్ని తప్పించుకునే క్రమంలో రామానుజరావు కృషి ఇంత బలంగా ఉంది! ఆ రోజుల్లో యావత్ హైదరాబాద్ సంస్థానానికి కలిపి ఉన్నది ఒకే ఒక్క విశ్వవిద్యాలయం; అదీ - కేంద్ర ప్రభుత్వం స్వాధీనంలోకి వెళితే - స్థానికులకు వైవిధ్యభరిత విద్య ఎండమావిగా మారేది. తెలంగాణ ప్రాంతం మరింత వెనుకబాటుకు లోనయ్యేది. ఇటువంటి అనర్థాలు ఏర్పడకుండా ఉండేందుకు రామానుజరావు ఆనాడు ఆరంభించిన నిరసనోద్యమం అంకురార్పణ చేసింది.

"శ్రీ దేవులపల్లి రామానుజరావు – ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని హిందీ విశ్వవిద్యాలయంగా మార్చాలనే ప్రతిపాదనను తీవ్రంగా గర్హించారు. హైదరాబాద్ ప్రజలు ఈ ప్రతిపాదనకు పూర్తిగా వ్యతిరేకమని నొక్కి వక్కాణించారు.

ఆ తరువాత కేంద్ర విద్యామంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ గారికి తమ సహచరులతో కలిసి ఢిల్లీ వెళ్ళి వాస్తవ విషయాలు అవగతం చేసి ఈ ప్రతిపాదన అమలు జరక్కుండా చేశారు. ఇదొక ఘన విజయం..." అని మహాకవి దాశరథి **"యాత్రాస్మృతి" (పుట 49)**లో రాశారు.

ఇది నిజంగా – ఆనాటి పరిస్థితుల్లో ఘన విజయమే.

"ఉస్మానియా మేరునగధీరుడు" వ్యాసం అందిస్తున్న సమాచారం ప్రకారం రామానుజరావు "1953 నుండి సెనేట్ సభ్యులుగా వ్యవహరించారు. అనంతరం సిండికేట్ సభ్యులుగా పనిచేశారు. తొలిసారిగా అక్టోబర్ 1972లో ఆక్టింగ్ వైస్‌ఛాన్సలర్‌గా సేవలందించారు. తిరిగి 1973 ఆగస్ట్ – అక్టోబర్ వరకు అవే విధులు నిర్వహించారు. మూడోసారి 1975లో జనవరి నుంచి మే నెల వరకూ పనిచేశారు."

"పదవీకాంక్ష లేకుండా నిజాయితీగా నిర్మాణ కార్యక్రమాలు చేబట్టి, చేబట్టిన వాటిని ఏ విధంగా నడపవలెనో శ్రీరామానుజరావుగారిని చూచి నేర్చుకోవలసిందే. నాకు తెలిసిన ఇట్టి మహానుభావులలో క్రీ.శే. మాడపాటి వారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, మూడవవారు రామానుజరావు, నాలుగవ వ్యక్తి కోసం వెతకవలసి ఉంటుంది" అన్నారు ప్రసిద్ధ ఉర్దూకవి కాళోజీ రామేశ్వరరావు. సంస్థల నిర్వహణలో రామానుజరావు చూపించిన అంకిత భావానికి ప్రతిరూపాలు రామేశ్వరరావు గారి వాక్యాలు.

సాహిత్యపత్రిక నేతృత్వం - సంపాదకీయ కర్తృత్వం

సాహిత్య పత్రికా సంపాదకులకు ఉండవలసిన ఆదర్శవంతమైన మూర్తిమత్వం రామానుజరావులో సుస్పష్టంగా ఉండేది. కొత్త కవులు - రచయితలను హృదయపూర్వక రీతిలో ప్రోత్సహించే సుగుణం, అక్షర లోకంలో వినూత్నంగా ఆవిష్కరించబడుతున్న రీతుల్ని సాదరంగా స్వీకరించే దృక్పథం - స్వయంగా సరళరీతిలో రచనలు చేయగల నేర్పు - ఇవన్నీ మేలిమిరకపు సాహిత్య సంపాదకుల లక్షణాలు. రామానుజరావు ఈ త్రిగుణాల మేలికలయిక అని ఆయన సంపాదకత్వంలో వెలువడిన “శోభ” సాహిత్య మాసపత్రిక నిరూపించింది. నిజానికి ఈ పత్రిక సుదీర్ఘ కాలం పాటు ప్రచురణ పొందినదికాదు. అయినా ఆ పత్రిక తెలంగాణ తెలుగు పత్రికారంగ చరిత్రలో తనదైన విలక్షణ స్థానాన్ని సంపాదించింది. **“యాభై సంవత్సరాల జ్ఞాపకాలు”**లో రామానుజరావు శోభ పత్రిక విశేషాల్ని నమోదు చేశారు. వాటి సారాంశం ఇది.

“మిత్రుల ప్రోత్సాహం ప్రోద్బలాలతో 1946 ప్రాంతంలో శోభ సాహిత్య మాసపత్రిక వరంగల్లు నుండి ప్రారంభమైంది. ఒక సంవత్సరం నడిచింది. తిరిగి 1950 ప్రాంతంలో గోలకొండ ప్రచురణల పక్షాన మరొక సంవత్సరం నడిచి ఆగిపోయింది. తెలంగాణాలో సాహిత్య పత్రికలు లేనిలోటు తీర్చేందుకే శోభను ఆరంభించడం జరిగింది. మాడపాటి, సురవరంతోపాటు నల్లగొండ మిత్రుల తోడ్పాటు ఉండేది. కాళోజీ నారాయణరావు, పొట్లపల్లి రామారావు వంటి మిత్రులు సహకరించారు. యువకవి దాశరథి తొలి రచనలు శోభలో ప్రకటితమైనాయి. ఇల్లిందల సరస్వతీదేవి రచనలు కూడా. శివశంకరస్వామి ఆంధ్రప్రాంత కవి పండితుల రచనలు సేకరించి పంపుతూ ఉండేవారు. సాహితీమేఖల (చండూరు) కవుల రచనలు, కాళోజీ నారాయణరావు, పొట్లపల్లి రామారావు, భాస్కరభట్ల కృష్ణారావు, నందగిరి ఇందిరాదేవి, బూర్గుల రంగనాధరావు, వెల్దుర్తి మాణిక్యరావు, ధరణికోట శ్రీనివాసులు రచనలు శోభలో ప్రచురితమయ్యాయి. శోభ ఆంధ్ర తెలంగాణ మధ్య వంతెనగా ఉండేది” (పుట 93)

"తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం" అన్న ప్రామాణిక గ్రంథంలో డాక్టర్ వి.లక్ష్మణరెడ్డి శోభ పత్రికకు ఇట్లా పరిచయం చేశారు.

"1947 ఏప్రిల్‌లో శోభ అనే సాహిత్య మాసపత్రిక దేవులపల్లి రామానుజరావుగారి సంపాదకత్వాన వరంగల్లు నుంచి వెలువడి ఒక సంవత్సరం నడిచి రజాకారుకాలంలోని పరిస్థితుల వల్ల ఆగిపోయింది. తర్వాత 1950 నుండి సుమారు రెండేండ్లు హైదరాబాద్ నుండి వెలువడి ఆగిపోయింది. కేశవపంతుల నరసింహశాస్త్రిగారి ప్రబంధ పాత్రలు, రాజమన్నారు గారి రేడియో ప్రసంగాల్లాంటి వెన్నో ఉత్తమ సాహిత్య వ్యాసాలిందులో వెలుగుచూశాయి" (పుట 140)

శోభ పత్రిక ఉద్దేశాలను స్థాపనకు దారితీసిన పరిస్థితులను దేవులపల్లి వారు ఇట్లా తెలిపారు.

"ఒకనాడు ప్రసంగ వశమున నేడు తెలంగాణమునకున్న ముఖ్యమైన కొరతలలో మాసపత్రిక యొకటియని ఆంధ్ర పితామహులగు మాడపాటి హనుమంతరావుగారు వచించి యుండిరి. ఆనాటి వారి యాదేశము మా యుత్సాహమునకు దోహదమొనరించినది. పూజ్యులగు శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారు మందుముల నరసింగరావుగారు రాయప్రోలు సుబ్బారావుగారు మా యుద్యమమును ప్రోత్సహించి యాశీర్వదించినారు. నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తు మాపైన శుభాక్షతలు చల్లినది. సాహితీమేఖలవారు, నల్లగొండ సారస్వతపరిషత్తు వారు సాధన సమితివారు మాకు పెట్టని కోటలై యున్నారు. విద్వద్వర్యులు రసిక శేఖరులునగు శ్రీ పర్నా వేంకటేశ్వరరావుగారు మాకు అండయై నిలిచియున్నారు. కావుననే మా బరువు కొంత తగ్గుచున్నది..." **(షబ్నవీస్ - తెలంగాణ పత్రికారంగ చరిత్ర, 1886-1956, సంగిశెట్టి శ్రీనివాస్, పుట 120)**

పత్రిక సంవత్సర చందా ఆరురూపాయలు. విడి ప్రతి వెల ఎనమిది అణాలు. తొలుత వరంగల్లులోని మొకరంజాహీ రోడ్డులో గల కార్యాలయం నుంచి పత్రిక ప్రచురణ కొనసాగింది. అప్పుడు ముద్రణ సికిందరాబాద్‌లోని శ్రీరామాప్రెస్‌లో జరిగేది. పోలీసు చర్య అనంతరం పత్రిక ప్రచురణ - నిర్వహణ హైదరాబాద్‌లోని గోలకొండ పత్రికా కార్యాలయానికి మారింది. పత్రికకు ప్రసిద్ధ చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావు అందంగా ముఖ చిత్ర రచన చేసేవారు. గోలకొండ పత్రిక సంపాదకులు నూకల నరోత్తమరెడ్డి సహకారం శోభ పత్రికకు లభించింది.

తెలంగాణలో అపుడప్పుడే పదునెక్కుతున్న ఆధునిక సాహిత్య ప్రక్రియా రచనల్ని శోభ స్వాగతించింది. పవిత్రమైన ఆశయాలు, స్పష్టమైన సంపాదకీయ విధానంతో నడిచిన పత్రిక ఇది. "ఆంధ్ర సంస్కృతి సాహిత్యముల గానమునకు మనోహర మొసంగు రచనలకు మా పత్రిక పక్షాన స్వాగతం, ఈనాటి సంస్కృతి వికాసమునకు ముఖ్య సాధనములు పత్రికలు, జాతీయ పునర్వికాస శుభోదయమునకు సేవ యొనరించు ఆశయముతో మా శోభ యుదయించినది" అని నిర్వాహకులు సంపాదకీయ వ్యాఖ్యల్లో తమ ఆశయాల్ని స్పష్టం చేశారు.

తొలి సంచిక - పలు వినూత్న అంశాల్ని పలికించిన అక్షర విపంచిక. (రెండవసారి ప్రచురణ సందర్భంలో) 1950 ఫిబ్రవరి 4, 5, 6 తేదీల్లో నాటి అత్రాఫ్ బల్దా జిల్లా ప్రాంతంలోని తూపురాన్‌లో నిర్వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యక్రమాల ప్రత్యేక సంచికగా దీన్ని తీర్చిదిద్దారు. పరిషత్ సమావేశాల్లో జరిగిన చర్చలు ప్రచురణ అయ్యాయి. పరిషత్ సభలకు విస్తారమైన ప్రచారం లభించింది. హైదరాబాద్ ప్రభుత్వ యంత్రాంగంలో బాగా పేరున్న ఉన్నతస్థాయి అధికారి ఇల్లిందల రామచంద్రరావు ఈ సభలో "సాముదాయిక మాండలిక శబ్దకోశం" తదితర అంశాల్ని ప్రస్తావించారు. పర్సా వేంకటేశ్వరరావు తమ ప్రసంగంలో "మన సాంస్కృతిక సంపద శిధిలమవుతున్నందుకు'' ఆవేదన చెందారు. ఆదిరాజువీరభద్రరావు "మన పరిశోధనలు మరింత వేగవంతం కావాలని" పిలుపునిచ్చారు. తూపురాన్ సాహిత్య గోష్ఠుల్లో సాహితీమేఖల సారధి అంబడిపూడి వెంకటరత్నం చక్కని ప్రసంగం చేశారు. తెలంగాణ తొలి తరం కథా రచయిత్రుల్లో ప్రముఖులు నందగిరి ఇందిరాదేవి కథానిక స్వరూప స్వభావాల్ని గురించి ప్రసంగించారు.

ఆధునిక సాహిత్య విమర్శా ప్రక్రియకు శోభ పత్రికలో సముచిత స్థానం దొరికింది. కేశవపంతుల నరసింహశాస్త్రి "ప్రబంధ పాత్రలు" వ్యాసాలు శోభలో తొలుత వెలుగుచూశాయి. "పారిజాతాపహరణంలో నారదుడు" అనే వ్యాసంతో ప్రబంధ పాత్రల వ్యాసపరంపర ప్రారంభమైంది. "మాయా ప్రవరుడు" అనే వ్యాసంతో ముగిసింది.

పరిశోధనాత్మక వ్యాసాలకు శోభ పెద్దపీట వేసింది. రాయప్రోలు సుబ్బారావు పలు మౌలిక అంశాల్ని స్పృశిస్తూ "జానపద గేయములు" అనే వ్యాసాన్ని రచించారు. సాహితీసింహావలోకనం ఒక చక్కని అంశం. త్రివేణి పత్రిక సంపాదకులు కోలవెన్ను

రామకోటేశ్వరరావు "భారతీయ సాహిత్య సింహావలోకనం" పేరుతో మంచి వ్యాసం రాశారు. ఆదిరాజు వీరభద్రరావు రచించిన పల్లెపదాలు మరొక మంచి వ్యాసం. ప్రసిద్ధ చరిత్రకారులు మల్లంపల్లి సోమశేఖరశర్మ "ప్రాచీన విద్యాపీఠములు – ప్రాచీన గ్రంథాలయములు" శీర్షికతో రాసిన వ్యాసంలో మన ప్రాచీన వారసత్వ సంపదను పరిచయం చేశారు. దూపాటి వేంకట రమణాచార్యులు "విశ్వేశ్వర శివదేవుడు" వ్యాసం ఉల్లేఖ్యమైంది.

సజీవ రచనలు అనే పేరుతో శివశంకరస్వామి, శ్రీశ్రీ, వేటూరి ప్రభాకరశాస్త్రి, దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి, నార్ల వేంకటేశ్వరరావు తదితర ప్రముఖుల అభిప్రాయాల్ని పొందుపర్చారు. ఆఖరున చెళ్ళపిళ్ళ వారి మీద ఒక వ్యాసాన్ని ప్రకటించారు.

కథ, కవిత్వం, నాటకం ఈ మూడు సాహితీ ప్రక్రియల్లోనూ శోభలో రచనలు వచ్చాయి. శోభ ప్రచురించిన "విమర్శకుడు" అనే నాటిక కొంత గమ్మత్తుగా ఉంది. రచయిత్రి ఇల్లిందల సరస్వతీదేవి అనంతర కాలంలో "స్వర్ణ కమలాలు". బృహత్ కథానికా సంపుటి రచయిత్రిగా సుప్రసిద్ధులయ్యారు. ఈ నాటకంలో సమకాలీన సాహిత్యంపై వ్యాఖ్యలున్నాయి. ఆమె రచించిన గ్రహపాటు, గళ్ళలుంగీ కథలు శోభలో వచ్చాయి. సింగరాజు లింగమూర్తి "జీవితాదర్శాలు", బూర్గుల రంగనాథరావు "అంతర్వాహిని" కథలు కూడా పేర్కొన్నదగ్గవి. తెలంగాణలో కథానికా ప్రక్రియ వికసిస్తున్న దశను శోభలో ప్రచురితమైన రచనలు పరిచయం చేస్తున్నాయి.

కవితా ప్రచురణలోనూ వైవిధ్యం వుంది. నవ్యతతో కూడిన కవిత్వం శోభలో వెలువడింది. భాగి (బహుశా భాగి నారాయణమూర్తి కావచ్చు) కాలశక్తి, పొట్లపల్లి రామారావు "ప్రభువు ఘనతేమి", "కుపితనగరము", పల్లా దుర్గయ్య "క్కోలా", ఒద్దిరాజు సీతారామచంద్రరావు "మేఘమాల" శోభలో ప్రచురణను పొందిన ఉత్తమ కవితల్లో కొన్ని.

దేవులపల్లి రామానుజరావు ఆ రోజుల్లో "శోభ మాసపత్రికను ప్రారంభించడం ఒక సాహస కృత్యమని చెప్పవచ్చు" అంటారు ఆయనకు అత్యంత సన్నిహితులైన గడియారం రామకృష్ణశర్మ. నిజమే, రజాకార్ల అల్లర్లతో వరంగల్లు పట్టణం అట్టుడికి పోతున్నవేళల్లో సారస్వత ప్రీతి, అపారమైన ఆత్మ విశ్వాసమే ఇంధనాలుగా పాతిక సంవత్సరాలుదాటిన యువకుడు స్థాపించిన పత్రిక ఇది. ఎటువంటి లాభాపేక్ష లేదు, భారీగా ఆర్థిక సహాయాన్ని అందించగలరనే దాతలులేరు, చందాదారులు

ఉత్సాహంతో ముందుకు రాగలరన్న భరోసా కూడా శూన్యమే. అయినా మూడు సంవత్సరాలపాటు శోభాయమానంగా రామానుజరావు "శోభ" పత్రికను నిర్వహించారు.

తెలుగు సాహిత్య పత్రికా చరిత్రలో శోభకు ఉన్నతస్థానం ఉంటుంది.

దేవులపల్లివారికి అనుబంధం ఉన్న మరొక పత్రిక "గోలకొండ". ఇందుకు కొంత నేపథ్యం ఉంది.

1940వ దశకం మలిభాగంలో తెలంగాణలో తెలుగు దినపత్రికలకు పెద్దగా ప్రోత్సాహకరమైన వాతావరణం లేదు. 1942లో బుక్క పట్టణం రామానుజాచార్యుల సంపాదకత్వంలో తెలంగాణ అనే పేరుతో ఒక దినపత్రిక ప్రారంభమైంది. పాఠకుల నుండి ఆదరణ రాలేదు. దీనితో ప్రారంభమైన రెండు మూడు మాసాలకే పత్రికను మూసి వేయవలసిన పరిస్థితి ఏర్పడింది. అయితే నిజాం ప్రభుత్వ యంత్రాంగానికి సన్నిహితుడైన జి.ఎం.కలకత్తావాలా మాత్రం "మీజాన్" పేరుతో మూడు (తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు) భాషల్లో దినపత్రికను నడిపించగలినాడు. తెలుగు పత్రికకు ప్రముఖ సాహితీవేత్త అడవి బాపిరాజు సంపాదకులు. మీజాన్‌కుసైతం పెద్దగా పాఠకాదరణ లభించిందని చెప్పలేము. బాపిరాజు ప్రతిభ వల్ల ఈ పత్రిక కొంత వైవిధ్యరీతిలో వెలువడేది. తిరుమల రామచంద్ర, రాంభట్ల కృష్ణమూర్తి, విద్వాన్ విశ్వం వంటి ప్రతిభావంతులు మీజాన్‌లో తొలి దశలో పని చేశారు. నాటి పరిస్థితుల్ని గోలకొండ పత్రిక సంపాదకులు ప్రతాపరెడ్డి సరిగ్గానే అంచనా వేశారు. పత్రికను ద్వైవారపత్రికగానే కొనసాగించారు. అయితే అనారోగ్య కారణంగా ఆయన కొంత కాలంపాటు బాధ్యతల నుండి వైదొలగి స్వగ్రామం నీళ్ళులేని ఇటికాలపాడుకు వెళ్లారు. బహుశా యాజమాన్యంతోనూ చిన్నగా అభిప్రాయ భేదాలు ఏర్పడి ఉంటాయి. వనపర్తి సంస్థానాధీశుడు రాజా రామేశ్వరరావు గోలకొండ పత్రిక నిర్వహణలో ప్రముఖులయ్యారు. 1947లో గోలకొండ పత్రికను దినపత్రికగా ప్రచురించాలని నిర్ణయించారు. ప్రతాపరెడ్డి ఈ దశలో పత్రిక నుండి నిష్క్రమించేందుకే నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడొక సంగతిని పరిగణనలోకి తీసుకోవాలి. రాజా రామేశ్వరరావు సోషలిస్టు సిద్ధాంత అభిమాని, ప్రతాపరెడ్డి కాంగ్రెస్ పార్టీకి అభిమాని. ఈ స్థితిలో ఉభయుల మధ్య సయోధ్య బహుశా అసాధ్యమే అయ్యేది.

రామానుజరావు 1939లో గోలకొండ పత్రికలో కొన్ని రచనలు చేశారు.. అప్పటి నుండి ప్రతాపరెడ్డితో పరిచయం, అది క్రమేపీ ఉభయుల నడుమ ఆత్మీయమైన అనుబంధంగా మారింది. రామానుజరావు పలు ప్రసంగాలు, వ్యాసాల్లో ఎంతో గౌరవనీయమైన రీతిలో ప్రతాపరెడ్డి జ్ఞాపకాల్ని ప్రస్తావించడం ఇందుకు దాఖలా. తెలుగు బాగా తెలిసిన నాటి యువ మేధావులలో రామానుజరావు వ్యక్తిత్వం ప్రతాపరెడ్డికి నచ్చింది. తాను స్వగ్రామం వెళుతున్నప్పుడు ఆయన రామానుజరావుకు ఒక లేఖ రాశారు. హైదరాబాద్ వచ్చి గోలకొండ పత్రికా సంపాదకత్వాన్ని స్వీకరించవలసినదిగా సూచించారు. తాను చేస్తున్న ఈ ప్రతిపాదనకు మాడపాటి హనుమంతరావు సమ్మతి కూడా ఉన్నదని పేర్కొన్నారు. ఈ లేఖ రామానుజరావు కొత్త జీవితానికి శ్రీకారం చుట్టింది. కొంతకాలంపాటు ఆయనలో సందిగ్ధతకూ కారణమైంది. ఎందుకంటే, రామానుజరావు అపుడు వరంగల్లులో ఉన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న చక్కని భూవసతి ఉంది. వ్యవసాయం చేసుకోవచ్చు, న్యాయవాద పట్టా ఉంది. న్యాయవాదిగా ప్రాక్టీసు చేసుకోవచ్చు, ఎటూ తేల్చుకోలేకపోతున్న తరుణంలో గోలకొండ దినపత్రికలో చేరేందుకు అవకాశం వచ్చింది. పలుమార్గాల్లో ఎటువెళ్లాలో తెలియని బాటసారి మనఃస్థితి వంటి పరిస్థితి. అయితే రామానుజరావు లోతుగా ఆలోచించారు. ఎంతో గొప్ప నిర్ణయం తీసుకున్నారు. వరంగల్లును విడిచిపెట్టి హైదరాబాద్‌కు రావాలని నిశ్చయించుకున్నారు. బహుశా ఆనాటి ఈ కీలక నిర్ణయమే ఆయన జీవితానికి చక్కని కీర్తిశిఖరాల్ని అందించింది.

సంక్షోభ సమయంలో రామానుజరావు గోలకొండ సంపాదకులుగా బాధ్యతలు చేపట్టారు. ఒకవైపు రజాకార్ల విజృంభణ, మరొకవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం, వీటితో నాటి సర్కారు పౌరవ్యవస్థల పట్ల అత్యంత కఠినమైన వైఖరిని తీసుకున్నది. పత్రికలు సర్కారు కన్నెర్రకు లోనయ్యాయి. అటు ప్రభుత్వంతో ప్రత్యక్ష పోరాటం చేయకుండా, ప్రభుత్వ చర్యలకు వంతపాడకుండా లౌక్యంతో నడిపించిన సంపాదకులు రామానుజరావు.

గోలకొండ పత్రిక నిర్వహణ లిమిటెడ్ కంపెనీ చేతుల్లోకి మారింది. ఇందులో ఒక డైరెక్టర్ల బోర్డు ఉండేది. దీనికి రాజా రామేశ్వరరావు అధ్యక్షులు, నూకల నరోత్తమరెడ్డి మేనేజింగ్ డైరెక్టర్. వీరిద్దరూ నిజాం కళాశాల పూర్వ విద్యార్థులు. రామానుజరావు కూడా అక్కడి పూర్వ విద్యార్థే కనుక యువకదశ నుండే చెలిమి

కొనసాగుతూ వచ్చింది. యాజమాన్యానికీ రామానుజరావుకు మధ్య ఎక్కడా అభిప్రాయ భేదాలు పొడసూపలేదు. యాజమాన్యం ఆయనను ఎంతో ఆదరించింది. రామానుజరావు తనకు దక్కిన ఆదరాన్ని నిలబెట్టుకున్నారు. రమారమి ఇరవై సంవత్సరాల పాటు పత్రికకు సంపాదకీయాలు రాశారు. పత్రికలో కీలకమైన ఎడిటోరియల్ బాధ్యతలు కూడా పర్యవేక్షించేవారు. రోజూ సంపాదకీయాలు రాయడం ఎంత చేయి తిరిగిన పాత్రికేయులకైనా అంత సులువైన పని కాదు. సంపాదకీయాల్లో వైవిధ్యం అనివార్యమైన అవసరం. అద్భుతమైన ధారాశుద్ధి వచన రచనలో ఉండాలి. సంపాదకీయ రచయిత సమాచారాన్ని కొన్నిసార్లు కుప్పబోసిన రీతిలో పాఠకులకు అందించాలి. రామానుజరావు ఇవన్నీ చేసి చూపించారు. "సంపాదకీయ రచనల కోసం రామానుజరావు ఆంగ్ల, ఉర్దూ, తెలుగు పత్రికలన్నింటినీ అనునిత్యం ఓపికతో చదవడం తాను కళ్ళారా చూశానని" గడియారం రామకృష్ణశర్మ రాశారు.

నరోత్తమరెడ్డి, రాజా రామేశ్వరరావు ఇద్దరూ రామానుజరావుకు మిత్రులే. అయితే ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విషయంలో వారి మధ్య ఏకాభిప్రాయం లేదు. నరోత్తమరెడ్డి నూటికి నూరుపాళ్ళు తెలంగాణ వాది; రామానుజరావు అదే స్థాయిలో విశాలాంధ్ర అనుకూలవాది. 1953 ప్రాంతంలో తెలంగాణ వాదం యువతరంలో ప్రస్ఫుటంగా బయట పడింది. నరోత్తమరెడ్డి తెలంగాణ వాదికనుక గోలకొండ పత్రిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బాహాటంగా బలపరచింది. ఇట్లా గోలకొండవైఖరి మూడు సంవత్సరాలపాటు మార్పు లేకుండా ఉంది. ఈ కాలంలో రామానుజరావు పత్రికతో సంబంధాల్ని విడిచిపెట్టారు. ఆ మూడేళ్ళు సంపాదకీయాలు రాయలేదు. అటుతరువాత తిరిగి కొనసాగించారు. రామానుజరావు సూత్రబద్ధ జీవనవైఖరిని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.

"పత్రికా రచయితగా నా అనుభవం" అన్న వ్యాసంలో నాటి జ్ఞాపకాల్ని ఇట్లా నమోదు చేశారు రామానుజరావు-

"గోలకొండ ప్రారంభమైనప్పటి నుంచి ఆగిపోయేవరకు సుమారు ఇరువది సంవత్సరాలు సంపాదకత్వ బాధ్యతలలో పాలు పంచుకొని నేను సంపాదకీయాలు వ్రాయడం జరిగినది. పోలీసు చర్య తరువాత రెండు మూడు సంవత్సరాల కాలం ఆ పత్రిక తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించినపుడు మాత్రం ఆ పత్రికతో సంబంధం వదలుకొని విశాలాంధ్రను నేను సమర్థించడం జరిగినది.

పోలీసు చర్య తరువాత గోలకొండ పత్రిక ద్వారా అనేక అభ్యుదయకర ఉద్యమాలను సమర్థిస్తూ సంపాదకీయాలను నేను వ్రాయడం జరిగినది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రజల మాతృ భాషలైన తెలుగు, మరాఠీ, కన్నడములకు సముచిత స్థానం కల్పించడానికి విజయవంతంగా పోరాడడం జరిగినది. కేంద్ర ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్వాధీనం చేసుకొని హిందీ విశ్వవిద్యాలయంగా నడుపవలెనని నిర్ణయించగా నేను కన్వీనరుగా స్వర్గీయ లక్ష్మణరావుగారు అధ్యక్షులుగా మాడపాటి, సురవరం ప్రభృతులు సభ్యులుగా ఒక పాఠ సంఘం ఏర్పడి ఒకగొప్ప పోరాటాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. తత్ఫలితంగా ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా నడిపే నిర్ణయాన్ని భారత ప్రభుత్వం ఉప సంహరించుకుంది. ఈ ఉద్యమాన్ని గోలకొండ పూర్తిగా సమర్థించింది. ఇవన్నీ చారిత్రాత్మకమైన సంఘటనలు.

ఇటువంటి చరిత్ర నిర్మాణ కృషిలో పాల్గొనగలగడం సర్వదా స్మరించుకునే అనుభవం. ఆ రోజులలో పత్రికా రచన ద్రవ్యార్జనకు నిరుద్యోగ సమస్యా పరిష్కారానికి ఉపయోగపడే వ్యవస్థ కాదు. ప్రతాపరెడ్డిగారు నరసింగరావుగారు పత్రిక ద్వారా ప్రత్యక్షంగా దేశసేవ చేసినారు. హనుమంతరావుగారు పరోక్షంగా పత్రికలను దేశ సేవకు ఉపయోగించుకున్నారు. జీవనోపాధి కొరకు పత్రికల ఆదాయం మీద ఆధారపడక దేశసేవకు ప్రజాసేవకు పత్రికలను తీర్చిదిద్దిన త్యాగమూర్తుల కాలం అది. అటువంటి త్యాగమూర్తుల అడుగుజాడలలో నేనూ నడిచి పత్రికలను దేశసేవకు భాషా సేవకు సాధనంగా స్వీకరించిన అనుభవాన్ని ఈనాడు సంస్మరించుకుంటే ఆనందం కలుగుతుంది." **(అక్షరదీపం పుట 301)**

శోభ పత్రిక నిర్వాహక సంపాదకులుగా, గోలకొండ సంపాదకీయ రచయితగా పాత్రికేయరంగంలో రామానుజరావు సంపూర్ణమైన సంతృప్తిని పొందారనే భావించాలి.

"శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు పత్రికా రచయిత" అన్న వ్యాసంలో గడియారం రామకృష్ణశర్మ వెల్లడించిన అభిప్రాయంతో ప్రస్తుత అధ్యాయానికి ముక్తాయింపును పలకడం సముచితమవుతుంది.

"పత్రికా నిర్వహణ, దేశసేవా కార్యంగా భావించబడి దృఢ నిశ్చయంతో నిస్వార్థంతో పవిత్ర దీక్షతో మన పెద్దలు దాన్ని నిర్వహించినారు. అట్టి ప్రసిద్ధ సంపాదకుల కోవలో రామానుజరావుగారు చేరదగిన వారని నిస్సందేహంగా చెప్పవచ్చును."

(డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారి అభినందన సంచిక – పుట 44)

సతత హరితం - పచ్చతోరణం

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో సీమాంధ్ర – తెలంగాణ ప్రాంతాల మధ్య స్వభావ తారతమ్యాలు స్పష్టంగా కనబడతాయి. తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వ పరిశోధనలు ముమ్మరమైన క్రమంలో ఈ తారతమ్యాలపై పలువురి దృష్టి నిలిచింది. సీమాంధ్ర అందులోనూ ప్రధానంగా మధ్యకోస్తా ప్రాంతంపై ఇంగ్లీషు సాంస్కృతిక ప్రభావాలు ఎక్కువగా ఉండేవి. ఈ ప్రాంతంలో బ్రిటిష్ ప్రత్యక్ష పాలన బాగా స్థిరపడింది. ఇంగ్లీషు విద్యతో పలువురికి చక్కని పరిచయం ఏర్పడింది. ఇంగ్లీషు సాహిత్యాన్ని ఎంతో మక్కువతో చదువుకునే విద్యావంతుల సంఖ్య పెరిగింది. దీనితో ఇంగ్లీషు సాహిత్యంలోని అతి నవ్యనవీన ధోరణులు కోస్తాంధ్రలో వెనువెంటనే ప్రతిధ్వనించాయి. వ్యాసం, కథానిక, నవల, ఆధునిక నాటకం, కవిత్వం – ఇట్లా దాదాపు అన్ని ప్రక్రియల్లోనూ ఆంగ్లేయ నవ్యత అక్కడి సాహిత్యాన్ని ఆవరించింది. అక్కడి కవిత్వంలో ఆంగ్ల కాల్పనిక కవుల ప్రభావం సుస్పష్టమైంది. రాయప్రోలు, కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణ, దువ్వూరి రామిరెడ్డి, నాయని సుబ్బారావు, నండూరి సుబ్బారావు తదితర ప్రతిభావంతులు నవ్యతా ప్రభావంతో గొప్ప కవిత్వాన్ని సృజించారు. వస్తువులో కొత్తదనం, ఎంపిక చేసుకున్న ఛందస్సుల్లో నూరుశాతం ఔచిత్యం, వక్రోక్తి ప్రాధాన్యత, పదలాలిత్యం, సుకుమారమైన అభివ్యక్తీకరణలు గత శతాబ్ది తొలి దశాబ్దాలలో కోస్తాంధ్ర ప్రాంత కవిత్వాన్ని సుసంపన్నం చేశాయి. నవ్యకవిత్వం, భావకవిత్వం, కాల్పనిక కవిత్వం వంటి పేర్లతో పిలవబడిన ఆనాటి కవితారీతులు తెలుగు ఆధునిక సాహిత్య చరిత్రలో స్వర్ణయుగాన్ని నెలకొల్పాయి.

తెలంగాణాలో మాత్రం విభిన్నమైన కవితావాతావరణం ఉండేది. ఈ ప్రాంతంలో నిజాం రాజు ఏలుబడి ఉంది. సమాజానికి ఆధునిక విద్య అందుబాటులోకి రాలేదు. ఏడవ నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఉర్దూ భాషకు అత్యధిక ప్రాధాన్యతను కల్పించడం వల్ల తెలుగు వంటి దేశీయ భాషలు నామమాత్రంగా మిగిలిపోయాయి. ఉర్దూ ప్రభావం ఎక్కువ. ఉర్దూ మధురమైన భాష. అందులో సందేహానికి తావులేదు. అయితే ఇంగ్లీషు సాహిత్యంలో ఆధునిక యుగంలో సంభవించిన నవ్య పరిణామాలు

ఉర్దూలో కనిపించవు. ఆధునిక ప్రక్రియలు ఇంకా ఆ రోజుల్లో ప్రాథమిక స్థాయిలోనే ఉన్నాయి. ఉర్దూలో గత శతాబ్ది తొలిదశలో రొమాంటిక్ పొయెట్రీ వంటిదేదీ ఉధృతస్థాయిలో వెలువడలేదు. దీనితో తెలంగాణ ప్రాంతంలో నవ్య కవితాసృజన సాధ్యం కాలేదు. కవులు పాండిత్యంలో రాణించారు. ప్రబంధరీతిలో పద్యరచన చేశారు. వారిలో పలువురి ప్రతిభ కోస్తాంధ్ర నవ్యకవులకు ఎంతమాత్రం తీసిపోనిది. అయితే అభివ్యక్తిలో మాత్రం సమకాలీన నవ్యతను ప్రకటించలేకపోయారు. కోదాటి రామకృష్ణారావు వంటి ఒకరిద్దరు ఇందుకు మినహాయింపు. తెలంగాణలో కొందరు సాహిత్య చరిత్రకారులు "తెలంగాణలో భావకవిత్వమే వెలువడలేదు" అన్నారు; మరికొందరు కోదాటి రామకృష్ణారావును ఏకైక ప్రతినిధిగా చూపారు. ఏమైనా నవ్య కవిత్వం ఆనాడు తెలంగాణలో నామమాత్రమే.

తమ ప్రాంతంలో ఇతర కవుల రచనలకు పూర్తిగా భిన్నంగా కోస్తాంధ్ర ప్రాంత కవితా రీతికి దగ్గరగా కావ్యరచన చేసిన వారు దేవులపల్లి రామానుజరావు. అందుకు సాక్ష్యం పచ్చతోరణం కావ్యం.

రామానుజరావు నాగ్‌పూర్‌లో విద్యార్థిగా ఉన్న రోజుల్లో కోస్తాంధ్రలో వికసించిన అభినవ కవితను శ్రద్ధతో అధ్యయనం చేశారు. ఒక సహృదయుడిగా ఆ కవిత్వాన్ని నిండుగా ఆస్వాదించారు. సారస్వత నవనీతమైన వ్యాసాల్ని రచించారు. అభినవ కవితపై ఆయన చేసిన ప్రశంసలు ఎన్నెన్నో! అభినవ కవి ప్రతిభామూర్తులందరి కవిత్వాన్నీ ఆయన కూలంకషంగా తరచిచూశారు. ఇంతటి లోతైన రీతిలో ఆసాంతం ఆ కవిత్వాన్ని చదివినవారు తక్కువే అన్నా అతిశయోక్తి కాదు. ఇట్లా సుదీర్ఘ కాలంపాటు అభినవ కవితను చదువుతూ ఉండటంతోనూ ఆయనకు తెలియకుండానే ఆ కవిత్వపు మృదుపదజాలం మదిలో స్థిరపడిపోయి ఉంటుంది. పచ్చతోరణంలో ఆపదజాల ప్రతిస్పందనల్ని స్పష్టంగా గమనించవచ్చు. అభినవ కవితలోని ధారాశుద్ధి రామానుజరావు కలంలో జాలువారింది. ఈ పద్యం అందుకు ఉదాహరణ.

> **"చల్లని సోగచూపులును చక్కని చామనచాయ రూపమున్**
> **పల్లవ కోమలంబులగు పచ్చని చెక్కుల జారు చెమ్మటల్**
> **పుల్లనవారవిందముల పొల్పు హసించెడు పాదయుగ్మమం**
> **దల్లన మ్రోయు నందియలు నందము జింద గనంపదచ్చటన్..."**

(ఆముక్తమాల్యద)

పచ్చతోరణం కావ్యంపై రాయప్రోలు సుబ్బారావు కవితారీతి తాలూకు ప్రభావాలు ఉన్నాయని ఆచార్య నాయని కృష్ణకుమారి ఒక వ్యాసంలో విశ్లేషించారు. ఇది సత్యం. "పచ్చతోరణం ఆనాటి కాల్పనిక కవిత్వానికొక ఉదాహరణ. వివరణాత్మక విశ్లేషణ. పచ్చతోరణం ఆ కాలపు కవితా విన్యాసానికి పట్టిన మెరుగు టద్దపు సొగసు" అన్న ఆచార్య కృష్ణకుమారి వ్యాఖ్యలు కావ్య హృదయాన్ని చక్కగా ఆవిష్కరిస్తున్నాయి. అభినవ కవితకు ఆద్యులైన రాయప్రోలు సుబ్బారావు కవితా ప్రతిభ పట్ల రామానుజరావుకు ఎంతో ఆదరం ఉండేది. పలు సందర్భాలలో ఆయన చేసిన ఉపన్యాసాల్లో రాయప్రోలు పద్యాలు ఆలవోకగా వచ్చి చేరడం ఇందుకు సాక్ష్యం. పచ్చతోరణం కావ్యంలో రాయప్రోలును ఎంతో గొప్పగా ప్రశంసించారు రామానుజరావు.

"తెలుగు నాడు నీది, తెలుగు బిడ్డవు నీవు
తెనుగటన్న నీకు తీపి మెండు
తెనుగుకన్నె జడల దీర్చి మక్కువ తోడ
తెనుగు తోటలందు ద్రిప్పినావు..."

సూరన సుకవితాసుందర సౌధాన కావ్య సౌభాగ్యంబు గాంచినావు
శ్రీనాథ కవిరాజు శృంగారవనములో కుసుమాల దోసిళ్ళ దోసినావు
తిక్కనామాత్యుని తీయ మామిడిపండ్ల మాధుర్యమున మేను మరచినావు
పోతనార్యుని సుధాపూత కావ్యంబున ఆవేశ రత్నాల నడిగినావు

అంతియేకాక ఆంధ్రంబునందు నీవు
భావకవి లోకమునకు సంభావ్యుడవయి
త్రోవ జూపుదు కవి కుమారులకునేడు
రాయప్రోలు దానిమ మీద రామచిల్క (నీరాజనము)

రాయప్రోలుతో రామానుజరావుకు విద్యార్థి దశలోనే పరిచయం ఏర్పడింది. 30-3-42 నాడు రాయప్రోలు రాసిన లేఖలో "రామానుజరావు రచనల్ని ఆత్మీయమైన కవిత్వం"గా పేర్కొన్నారు. పచ్చతోరణం కావ్యానికి ఉపసేచని రచిస్తూ "ఆత్మీయభావన ప్రబోధించినట్లు అభినవ కవులు తమ తమ భణితి భావములను రచనలో నడిపారు. వారిలో శ్రీరామానుజరావుగారు గణతికెక్కిన యువకవి" అని రాయప్రోలు ప్రశంసించారు.

రామానుజరావులోని సుసంపన్నమైన భావుకతకు పచ్చతోరణం అనే ఒకేఒక్క కావ్యం ఆధారంగా నిలిచింది. ఆయన అనేక వచన రచనలు చేసిన సంగతి జగద్విదితం. ఈ రచనల ద్వారా ఆయన బహుముఖ విద్వత్తు కలసిన మేధావిగా గుర్తింపును సాధించారు. అయితే ఆయన "పచ్చతోరణం" మినహా మరే కావ్య రచనా చేయకపోవడం చాలామందికి అసంతృప్తినే కలిగించింది. రాయప్రోలు సుబ్బారావు ఈ వాస్తవాన్ని గుర్తించి "ఈ కవి కావ్య కృషి వదలడం తెలంగాణము తేనెమాగాణికి కొరత కాకతప్పదు" అని అభిప్రాయపడ్డారు. అయితే ఈ కావ్యానికి కూడా తగిన గుర్తింపు దక్కలేదనే అభిప్రాయం విమర్శకలోకంలో ఉంది. అందుకు కొన్ని సహేతుకమైన కారణాలు కూడా దొరుకుతాయి. రామానుజరావు పచ్చతోరణం ఖండికల్ని 1940–42 ప్రాంతాలలో రచించి ఉంటారని ఒక అంచనా. అప్పటికి భావకవితారీతిస్వంత గొంతుకలోని కొంత మాధుర్యాన్ని కోల్పోయింది. అభ్యుదయ కవిత్వం ఉద్యమస్థాయిని సంతరించుకుంటున్న దశ అది. ఇకపోతే 1940–42 ప్రాంతాల్లో సృజించిన ఈ కవిత్వం తొలుత 1952లో అంటే ఒక దశాబ్ది తరువాత అందుబాటులోకి వచ్చింది. అప్పటికి భావకవిత్వం చరిత్రలో కలసిపోయింది. ఇదే కవిత్వాన్ని అంతకు ఒక దశాబ్ది క్రితం ప్రచురణ పొందితే యావత్ తెలుగు సీమలోనూ సముచిత ప్రచారం దక్కి ఉండేది. నాడు తెలంగాణలో వెలువడిన కవిత్వాన్ని కోస్తాంధ్రలో పరిచయం చేసిన సాహిత్య ప్రముఖులు దాదాపు లేరు. అందువల్ల కోస్తాంధ్రలోనూ పచ్చతోరణం కావలసినంత గుర్తింపును పొందలేదు. తెలంగాణలో అభ్యుదయ కవిత్వం దాశరథి, కాళోజీ వంటి ప్రజాకవుల ప్రోత్సాహంతో విస్తరణ దశలో ఉంది. భావకవిత్వానికి అది అనుకూలతరుణం కాదు. ఇన్ని కారణాల వల్ల పచ్చతోరణం ఊహించిన స్థాయిలో గుర్తింపును పొందలేదని చెప్పాలి. అయితే గొప్ప సాహిత్య విమర్శకులు, పరిశోధనా రంగపు దిగ్గజాలుసైతం పచ్చతోరణాన్ని సెబాసనడం కొంతలో కొంత సంతృప్తిని కలిగించే సంగతి. ఆ వివరాలలోకి పోతే –

"మీ కవిత్వము మిక్కిలి సరళముగా సుందరముగా ఉన్నది. ఎట్టి గంభీర భావము నైనను మీరు తేలికగా రెండు మాటలలో వ్యక్తము చేయగలరు. పలుకుబడిలో జాతీయమై తెలుగుదనమును ప్రస్ఫుటము చేయుచున్నది" అన్నారు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.

(31.12.1952 – వాల్తేరు నుండి రాసిన లేఖ)

"పచ్చతోరణము నిజముగా ఎప్పటికీ కాంతి చెడని పచ్చదనము మాయని నవ్యత వసివాడని పద్యాల పచ్చతోరణమే" అని ప్రశంసించారు మల్లంపల్లి సోమశేఖరశర్మ.

(22.1.1953 – మదరాసు నుండి రాసిన లేఖ).

"మీ పద్య గద్యరచన మీ హృదయం వలె స్వచ్ఛమై మీ ప్రతిభ వేనోళ్ళ వ్యక్తం చేస్తున్నది" మహాకవి గుర్రం జాషువా ప్రశంస.

(29.12.1952–గుంటూరు నుండి రాసిన లేఖ)

"పచ్చతోరణము బలవత్తరముగా ఆకర్షించుచున్నది" అని వ్యాఖ్యానించారు నేలటూరి వేంకట రమణయ్య.

(25.12.1952 – మదరాసు నుండి రాసిన లేఖ)

"పచ్చతోరణము ఎన్నటికి పచ్చతోరణమే కాక పచ్చల తోరణము" అన్నారు ప్రముఖ రచయిత వేలూరి శివరామశాస్త్రి.

– (చరవాడ నుండి రాసిన లేఖ)

"దేవులపల్లి రామానుజరావు గారు వెనుక తాము రచించిన ఖండ కావ్యములను ఈ దశాబ్ది (అంటే 1950) ప్రారంభములోనే పచ్చతోరణము అను పేర వెలయించిరి. రాయప్రోలు వారి ఛాయలలో నడిచిన వీరి కవితలో ప్రకృతి రామణీయకతలు పదతి కామనీయకము సరళరమ్యముగా చిత్రితమైనవి" అని డాక్టర్ సి.నారాయణరెడ్డి తమ సిద్ధాంత గ్రంథంలో విశ్లేషించారు.

(ఆధునికాంధ్ర కవిత్వం–సంప్రదాయములు–ప్రయోగములు; పుట 650–651)

పచ్చతోరణము తొలి ఖండిక ఆముక్తమాల్యద – సులలితమైన రచన. విజయానందుడు రెండవ ఖండిక. మూడవది ఓరుగల్లు. రామానుజరావుకు తన ప్రాంతంపై ఉన్న ప్రగాఢ అభిమానానికి కవితాత్మక రూపం ఇది. ఓరుగల్లు గతాన్ని గురించి తెలిసిన వారందరినీ ఎంతో ఆకట్టుకునే కవిత ఇది. నాటి ఆంధ్రోద్యమ కవిత్వంలో అంతర్వాహినియైన గత వైభవ స్మరణ ఇందులో నిండుగా ఉంది. తొలి పద్యాన్ని చదివితే చాలు ఈ వాస్తవం అవగతమవుతుంది.

"కాబోలు నియ్యది కాకతీయులొక ప్డు
కరకు నెత్తుట కత్తి కడుగుచోటు
కాబోలు నీ ద్వార కల్యాణ వేదిక
అలికి ముగ్గులు పెట్టి తెలుగుపడుచు
కాబోలు నీ జీర్ణ కమనీయ సౌధాన
సుకుమార శిల్పముల్సొంపు లొలికె
కాబోలు నీవీధి కాపురం బొనరించె
పైడి మేడలలోన భాగ్యలక్ష్మి

ఇచ్చటనె నిల్చి కాబోలు నిందుముఖులు
ఆయుధంబులు పూజించి యరుగుదెంచి
ఆంధ్ర సేనకు కపురంపు టారతులను
ఇచ్చి వారల శౌర్యంబుమెచ్చినారు..."

ఈ పద్యాలు చదువుతుంటే రాయప్రోలు వారి "అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు స్థాపించునాడు" విశ్వనాధ "వేంగీక్షేత్రము" వంటివి గుర్తుకు వస్తాయి.

ఎన్ని జన్మల బంధమో ఖండిక ప్రబలమైన భావుకతకు ప్రతిబింబం. ఈ చిన్న పద్యం చదివితే ఆ సత్యం స్ఫురిస్తుంది.

"చిన్ని బంగారు చేతుల చెంబులెత్తి
పొద్దు పొడుపున జనుదెంచి పూలచెట్ల
కిట్లు నీర్పోసి శ్రమియించె దీవు తల్లి
ఎన్ని జన్మల బంధమో యెవరి కెరుక..."

"ప్రేమ గీతములు" ఖండికలోని అభివ్యక్తి సాంద్రత పచ్చతోరణం కావ్యాన్ని కాల్పనిక కావ్య పంక్తిలో సుస్థిరంగా ప్రతిష్ఠిస్తుంది.

పంట చేనులో ధాన్యాన్ని తినే జీవసమూహాన్ని వెళ్ళగొట్టడం సమంజసం కాదని అత్యంత రమణీయ రీతిలో చెబుతుంది కాపు కన్నె ఖండిక.

బహుశా 1942 క్విట్ఇండియా ఉద్యమ సమయంలో రామానుజరావు "మహాత్ముడు" ఖండికను రచించి ఉంటారు. మహాత్మాగాంధి ఉదాత్త వ్యక్తిత్వాన్ని

కవితాత్మక రీతిలో పరిచయం చేశారు. మహాత్ముడి గొప్పతనం ఈ చిన్న పద్యంలో రూపుకట్టింది.

"వేణుగోపాల గానము విన్న గోపి
కల విధమ్మున మేనులు పులకరింప
అరుగుదెంచిరి ప్రజలు నిన్ననుకరింప
కలదు దేవుఁడు మనయందు కలదు, కలదు..."

రైతు బాధలకు, కష్టాలకు అన్నదాత అయినా అన్నంలేని బీదరికానికి "బీదకాపు" ఖండిక ప్రతిరూపం. ఈ ఖండికలో ఎంతో ఆర్ద్రమైన పద్యాలున్నాయి.

కస్తూరిదేవి, సుజాత ఖండికలు విలక్షణమైనవి. అనార్కలి, అర్థాంగి కూడా ఇటువంటివే.

సంక్రాంతి కవితపై రాయప్రోలు కవితా ప్రభావం ఉంది. రామానుజరావు భావుక హృదయం ఉగాది, తొలకరి అన్న రెండు కవితల్లో ప్రత్యక్షర స్ఫూర్తితో దర్శనమిస్తుంది. ప్రబంధకవితా సుగంధాలు ఈ పద్యాల్లో పరిమళించాయి.

"మల్లికా కన్యక మలయానిలుని గాంచి
మురిపెంపు సిగ్గున మొగము వాల్చె
వాసంతికా లక్ష్మి వదనంబు వీక్షించి
కొదమకోయిల భావపదము పాడె
పచ్చికపై మంచు బరికించి యొక ముగ్ధ
ముత్యాల సరులంచు మోసపోయె
నిగనిగలాడుచు చిగురించు తరువుల
తీగలు బిగియార గౌ గలించె
చిలుక గోర్వంకల బోలు చెలుల జంట
వలపు తలపులు ముమ్మారు మొలకలెత్త
కొత్త వర్షంబు జగమను కొమ్మనెక్కి
మేలు కొలిపెదు నీయుషః కాలమందు" (ఉగాది)

"హృదయ ముప్పొంగగా నురిమినచోనీకు
పూజ యొనర్తుము పొన్నపూల
మిరుమిట్లు గొలుపుగా మెరసిన నియ్యదే

అరటాకు దొన్నెలో యలరుదేనె
చెఱువులు నిండించి స్వీకరింపుము కాన్క
దోరబండిన మేలి దోసపండ్లు
పైరులు చక్కగా పండిన నిత్తుము
పండుటాకులలోన పచ్చివెన్న.

"ధాన్యలక్ష్మి ప్రసన్నయై తనరు కొఱకు
వరము వేడుదు జోడించి కరయుగంబు
వరుణ మా వంకజూడుము కరుణతోడ
శబలితంబైన యీ రమ్యసమయమందు" (తొలకరి)

పచ్చతోరణం కావ్య ప్రత్యేకతల్ని ఇట్లా పేర్కొనవచ్చు.

1. కావ్యంలో వస్తు వైవిధ్యం స్పష్టంగా ఉంది.

2. అభివ్యక్తీకరణలో వినూత్నత ఉంది.

3. రామానుజరావు ఉపయోగించిన పదసంపద లాలిత్యానికి పర్యాయరూపంగా కనబడుతుంది.

4. ఛందస్సుల్ని ఔచితీవంతంగా ఉపయోగించడంలో రామానుజరావు ప్రతిభ ఎంతో గొప్పది.

5. గత స్మరణతో ఆగిపోకుండా సమకాలీన వేదనలకు కూడా కావ్యంలో చోటు ఉంది.

6. పద్య గమనంలో ప్రవాహపు వేగం ఉంది.

7. ఖండకవిత్వానికి సరిపోయిన లక్షణాలన్నీ ప్రతిఖండికలోనూ కనబడతాయి.

8. తెలంగాణలోనూ భావకవిత్వం సృజించబడిందని చెప్పేందుకు పచ్చతోరణం కావ్యం అనేక తరాలకు ఆధారమవుతుంది.

9. పచ్చతోరణం నడిచిన మార్గంలో తెలంగాణలో మరే ఇతర పద్యకావ్యం వెలువడకపోవడం ఆ కావ్యం అనుకరణకు సాధ్యం కానిదని నిరూపించింది.

"కదంబ కల్పనగా మిశ్రరూప రామణీయకతతో" (రాయప్రోలు) రచించబడిన పచ్చతోరణ కావ్యం– ఆధునిక తెలుగు కవితాచరిత్రలో సతతహరితమై నిలుస్తుంది.

ప్రశంస ప్రతిభ

హైదరాబాద్ నగరంలో సాహిత్య సాంస్కృతిక సమావేశాల ప్రాధాన్యత 1920ల నుండే ప్రముఖమైంది. తొలుత శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వీటికి ప్రధానమైన వేదికగా ఉండేది. సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావు వంటి స్థానిక ప్రముఖులతోపాటు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, దువ్వూరి రామిరెడ్డి, చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి కోస్తాంధ్ర ప్రసిద్ధ సాహితీవేత్తలు కూడా భాషా నిలయంలో చిరస్మరణీయమైన ప్రసంగాలు చేశారు. కవి సమ్రాట్టు విశ్వనాథ సత్యనారాయణ ఇక్కడ పలు పర్యాయాలు ప్రసంగించారు. ఇదంతా హైదరాబాద్ సంస్థానం నిజాం ఏలుబడిలో ఉన్ననాటి సంగతి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత కూడా సాహిత్య సమావేశాలు విలక్షణ రీతిలో కొనసాగుతూ వచ్చాయి. ఏదైనా ఒకసాహిత్య సభ పసందైన విందును ఆరగించిన అనుభూతిని కలగించాలంటే అందుకు ఆయా సభల్లో ప్రసంగించే వక్తల వక్తృత్వ ప్రతిభే ఆధారమవుతుంది. ఈ సార్వత్రిక సత్యాన్ని అందరూ అంగీకరిస్తారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతర కాలంలో ఇక్కడ జరిగిన సాహిత్య సమావేశాలను తమ ప్రసంగప్రజ్ఞతో వన్నెచేకూర్చిన వారిలో ఇద్దరు ప్రముఖులున్నారు. వారిలో ఒకరు ప్రసిద్ధ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి, రెండవవారు సారస్వత పరిషత్తు సారథి దేవులపల్లి రామానుజరావు. ఇద్దరివీ విభిన్న ప్రసంగశైలులు. అయినా ఇద్దరి ప్రసంగాల్ని రసజ్ఞ శ్రోతలు అదే ఆసక్తితో వినేవారు. రామానుజరావు ఒకవేళ గ్రంథరచన ఏదీ చేయకపోయినా చేసిన ప్రసంగాల ఆధారంగానైనా సాహిత్య చరిత్రలో నిలిచిపోయేవారు. అంతటి ప్రసంగచాతుర్యం ఆయన స్వంతం. ఏ సభ పరిమితి ఏమిటి? సభ ప్రయోజనాలు లక్ష్యాలు ఎట్లా ఉన్నాయి? శ్రోతలు ఏ ఆలోచనాధోరణికి చెందినవారు? ఇట్లాంటి సున్నితమైన విషయాల్ని సునిశితంగా అంచనా వేసినవారే ఉత్తమ వక్తలుగా రాణిస్తారు. రామానుజరావు ఈ అంశాలన్నింటినీ మదింపు చేసుకొనే తమ ప్రసంగానికి సిద్ధమయ్యేవారు. పలు సందర్భాలలో ఆయన చేసిన సాహిత్యోపన్యాసాల వ్రాత

రూపాలు, రేడియో ప్రసంగాలు రామానుజరావును తెలుగు సీమలోని ఉత్తమ వక్తల్లో ఒకరుగా నిలబెడతాయి. సాధారణ సభావేదికల మీద చేసే ప్రసంగాలకు, రేడియో ప్రసంగాలకు మధ్య సన్నని లక్ష్మణ రేఖ ఉంటుంది. దీన్నికూడా సరిగ్గా గుర్తించి ఆయా మాధ్యమాలకు తగిన రీతుల్లో రామానుజరావు ప్రసంగించారు. ఆయన ప్రసంగ విశిష్టతను గురించి "మరపురాని మనస్వి" అనే వ్యాసంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ఇట్లా రాశారు :

"ఏ విషయం మీదనైనా సాధికారికంగా సందర్భోచితంగా ప్రసంగించడంలో వీరికి ప్రత్యేకత ఉంది. ప్రతి చిన్న సంఘటనకు సంబంధించిన తేదీలను కూడా గుర్తుంచుకొని విషయాన్ని సమగ్రంగా ఉదహరిస్తారు. రామానుజరావుగారి కంఠధ్వనికి కూడా ప్రత్యేకత ఉంది. వారు వక్తృకంఠీరవములు. వారి గళానికి ఠీవి భాషకు దర్జా ఉన్నాయి. ఈనాడు తెలుగు రాజధానిలో విత్వత్సభలకు, సాంస్కృతిక సభలకు అధ్యక్షులు గానో ముఖ్య అతిథులుగానో సారథ్యం వహించేవారిలో డాక్టర్ రామానుజరావుగారు, ఆచార్య సి.నారాయణరెడ్డిగారే అగ్రేసరులు. రామానుజరావుగారి భాషణలో విషయ ప్రాధాన్యం విషయ వివేచనం సమపాళ్ళలో ఉంటాయి. వారి ఉచ్చారణలో ఒక సౌందర్యం ఉంది. **ప్రామాణిక తెలంగాణ భాషకు ప్రథమోదాహరణం వారిదే. తెలంగాణ తెలుగులోని తీయదనం, నుడికారపు సొంపు వారి భాషలో తొణికిసలాడుతుంది.** వారు ఏ గ్రంథాన్ని గురించి అభిప్రాయం ఇచ్చినా దాని నే పధ్యాన్ని తెలుపుతారు. ఆంగ్లంలో అనర్గళంగా భాషించగలరు. ఉర్దూలో ఉరకలు వేసే ప్రసంగం చేయగలరు. తెలుగులో తేటగా ఉపన్యసించగలరు."

(అభినందన సంచిక పుట 31)

ఈ గ్రంథ రచయిత 1980ల చివరలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం స్నాతకోత్తర విద్యార్థి. సాహిత్యానికి అపూర్వమైన ఆదరణ ఉన్న రోజులవి. స్నాతకోత్తర తెలుగు విద్యార్థులు అడపా దడపా శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, సారస్వత పరిషత్తులలో జరిగే ప్రసంగాలకు శ్రోతలుగా వెళ్ళడం ఒక సంప్రదాయంగా ఉండేది. ఆ సందర్భంలో రామానుజరావు ప్రసంగాల్ని వినే అవకాశం ఈ రచయితకు దక్కింది. సరిగ్గా కార్యక్రమం ప్రారంభమయ్యే సమయానికి ఆయన సభాస్థలికి చేరుకునేవారు. ఆయన రాక కోసం నిర్వాహకులు వేచి చూడవలసిన పనిలేదు. అదీ ఏడుపదులు దాటిన పండు వయసులోనూ ఆయన పాటించిన క్రమశిక్షణ.

తనకు తాను పరిమిత సమయాన్ని కేటాయించుకొని రామానుజరావు ప్రసంగించేవారు. క్లుప్తత, ఆప్తత ప్రసంగ గుణాలుగా ధారాశుద్ధితో కొనసాగే ప్రసంగాల్ని శ్రోతలు బాగా ఇష్టపడేవారు. ప్రసంగాలలో గ్రాంథిక భాషా స్పర్శ ఉన్నా అది వినసొంపుగా విషయాన్ని సూటిగా, స్పష్టంగా వేగవంతమైన రీతిలో వ్యక్తీకరించే రామానుజరావు ప్రసంగశైలి ప్రత్యేక తరహాకు చెందింది. సుదూర ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలు కూడా రామానుజరావు ప్రసంగశైలికి ముగ్ధులయ్యారు. ఆయనపై ప్రశంసల జల్లులు కురిపించారు.

"శ్రీ రామానుజరావుగారు వాఙ్మిశిరోమణి. ఏ సభలోనైనను, ఏ విషయమును గూర్చియైనను నిష్పక్షపాతముగను, నిరవద్య హృద్యముగను నిరంతరము సత్యశోభితముగను వారు ప్రసంగింతురు. వారాంగ్లాంధ్రము నందేకాక ఉర్దూ భాషయందును సమానమైన పాండిత్యముకలవారు" అన్నారు సుప్రసిద్ధ వక్త, ఆచార్య దివాకర్ల వేంకటావధాని. (పుట 5 – అక్షరదీపం)

ప్రసిద్ధ కవి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి "తెలంగాణ సౌగంధికం" అనే వ్యాసంలో తమ అనుభవాన్ని ఇట్లా నమోదు చేశారు:

"బహుశః 1953 ప్రాంతం అనుకుంటాను. మా తమ్ముడు దాశరథి హైదరాబాదు వచ్చి సరదాగా ఒక సాహిత్య ప్రసంగం చెయ్యమని సలహా ఇచ్చాడు. ఒక నిరాడంబరమైన వ్యక్తి ఎట్టి సాహిత్య దర్జా వెలిగించని వాడు, అధ్యక్ష పీఠానికి వచ్చాడు. ఆయన్ని చూచి నేనేమీ "ముద్రితుణ్ణి" కాలేదు సదాసీదా మనిషి.

అధ్యక్షుడు లేచి అప్పటి నా రచనలన్నీ చదివిన సంస్కారంతో ఆధునికాంధ్ర కవిత్వపు మర్మజ్ఞతతో నేను నివ్వెరపోయేలా పరిచయం చేశారు. ఆయనే శ్రీ దేవులపల్లి..." (అక్షరదీపం – పుట 25–26)

"బహుముఖ ప్రజ్ఞాశాలి దేవులపల్లి రామానుజరావు" అన్న వ్యాసంలో ప్రసిద్ధ రచయిత గోపాల చక్రవర్తి ఇట్లా రాశారు :

"సాహిత్య పరిషత్తు నిర్వహించే గోష్ఠులలో అనేక కార్యక్రమాల్లో రామానుజరావు గారు వచ్చి కూర్చుంటే అదో నిండుదనం. ఒక్కొక్కపుడు ఆయన సభలో నాలుగు ముక్కలు చెబుతారు అవి ఆయన పాండిత్యానికి చక్కని నిదర్శనాలు."

"ప్రపంచ హాస్య మహాసభలు జరుగుతున్నప్పుడు తెలుగు విభాగం సమావేశాలు ఆంధ్రసారస్వత పరిషత్తులో జరిగాయి. అప్పుడు మాట్లాడుతూ రామానుజరావుగారు

సుప్రసిద్ధ సంస్కృత పండితులు నడిమింటి సర్వమంగళేశ్వర శాస్త్రిగారి చమత్కారాలు కొన్ని చెప్పారు. రామానుజరావుగారి పాండిత్యం బహుముఖమైంది." (అక్షరదీపం-పుట 78)

"కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పూతలపట్టు శ్రీరాములురెడ్డి, రొద్దం లక్ష్మీనరసింహందొర, సురవరం ప్రతాపరెడ్డి, పైడి లక్ష్మయ్య, బెజవాడ గోపాలరెడ్డి మున్నగు ఉదాత్త సంస్కృతీ సంపన్నుల ఉపన్యాసాలలో కొట్టవచ్చినట్టు కనిపించే విలక్షణమయిన మాండలిక స్పర్శ దేవులపల్లి వారి రచనలలోనూ ప్రవచనంలోనూ ప్రసారించి ఒక వింత హొయలును వెలారుస్తుంటుంది. సభాముఖంగా శ్రీ రామానుజరావు గారి ఆశుప్రసంగాలు విన్నవారికి సముఖంలో వారి సంభాషణలలో పాల్గొన్న వారికీ నా ఈ మాట అతిశయోక్తి అనిపించదు" అని తెలుగు విశ్వవిద్యాలయం మొదటి వైస్‌ఛాన్సలర్, ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య తూమాటి దొణప్ప రాశారు. (సాహిత్యోపన్యాసాలు - తొలిపలుకు)

రామానుజరావు సాహిత్య విమర్శ అందరు విమర్శకుల వలెనే పాఠకులను లక్ష్యంగా చేసుకున్నది. ఆయన సాహిత్యోపన్యాసాల లక్ష్యం మాత్రం శ్రోతలే. ఈ తారతమ్యం ఆయన సాహిత్యవిమర్శ - సాహిత్య ప్రసంగాలలో సుస్పష్టంగా ద్యోతకమవుతుంది. రామానుజరావు సాహిత్యోపన్యాసాలు, రేడియో ప్రసంగాలు అక్షరరూపంలో ప్రచురితమై ఉండడం ఆగామి తరాలకు ప్రయోజనకరమైంది. ఆయన సాహిత్య ప్రసంగాలు, రేడియో ప్రసంగాలు ఆయా మార్గాల్లో గొప్ప నమూనాలు.

రామానుజరావు సాహిత్యోపన్యాసాలు వేటికి అవే విలక్షణమైనవి. అన్నింటిలోను లోతైన విశ్లేషణ ఉంటుంది. అయితే వీటన్నింటిలోనూ "తెలంగాణ సాహితీ వికాసము" అత్యంత విశిష్టమైంది. ఈ ప్రసంగ నేపథ్యం ఆసక్తికరం.

1978 ఫిబ్రవరిలో నెల్లూరులో చేసిన చిరస్మరణీయమైన ఉపన్యాస శీర్షిక "తెలంగాణ సాహితీ వికాసము". ఆనాడు నెల్లూరు ప్రాంతంలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి ప్రభావం సాహితీరంగంపై ప్రగాఢంగా ఉండేది. సంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఆధునికతను ఆహ్వానించిన సహృదయులు గోపాలరెడ్డి. ఆయనకు సాహిత్య అకాడమీ ఆరంభం నుండే రామానుజరావుతో గట్టి మైత్రి ఉండేది. నెల్లూరులో ప్రతి సంవత్సరం జరిగే కవిత్రయ జయంతి సభలకు యావత్ తెలుగుసీమలో గుర్తింపు ఉంది. ప్రతి ఏటా సుప్రసిద్ధ విద్వాంసులు ఈ సభల్లో

పాల్గొని ప్రసంగించడం గొప్ప సంప్రదాయంగా కొనసాగింది. ఈ పరంపర ఇంకా ఉంది. కవిత్రయ జయంతి సభల్లో ప్రసంగించడం తమ సాహిత్య జీవితంలో మరపురాని ఘట్టంగా భావించేవారున్నారు. 1978లో జరిగిన కవిత్రయ జయంతి సభల్లో రామానుజరావుకు ఆహ్వానం వచ్చింది. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి కోరికమేరకు ఆయన కవిత్రయ జయంతి సభల్లో ప్రసంగించేందుకు విచ్చేశారు. ఈ సందర్భంలో "తెలంగాణ సాహితీ వికాసము" అన్న అంశంపై చిరకాలం గుర్తుపెట్టుకోదగిన ప్రసంగం చేశారు. రెండు అంశాల ద్వారా ఈ ప్రసంగం చారిత్రాత్మకమైంది. అవి : ఆనాటి రోజుల్లో తెలంగాణ ప్రాంతంలో వికసించిన సాహిత్యం పట్ల అన్యప్రాంతీయుల్లో అవగాహన, ఆసక్తి రెండూ లేకపోవడం. తెలంగాణ భౌగోళిక సీమకు ఆవల ఇక్కడి సాహిత్యాన్ని ప్రశంసిస్తూ మాట్లాడడం. ఒక్కమాటలో చెబితే సర్వసమగ్రతను సంతరించుకున్న సాహిత్యోపన్యాసానికి ప్రతిరూపం "తెలంగాణ సాహితీ వికాసం".

ఇందులో రామానుజరావు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రాంతీయులు తప్పకుండా గుర్తుపెట్టుకోదగినవి : అవి –

1. ఏకశిలా నగరములోని గణపతిదేవుని ఆస్థానంలో చక్కని భారతావిష్కరణ జరిగినది. భాస్కర రామాయణము వ్రాసిన భాస్కరుడు, మల్లికార్జునభట్టు, కుమార రుద్రదేవుడు, అయ్యలార్యుడు తెలంగాణ ప్రాంతమువారే. ఆంధ్ర మహాభాగవతము వ్రాసిన పోతనామాత్యుడు తెలంగాణ ప్రాంతీయుడే.

2. తెలంగాణ ప్రాంతంలో తెలుగు పాండిత్యం లేదని, తెలుగు సంస్కృతికి చోటులేదని ఆంధ్రప్రదేశ్ ఏర్పడక పూర్వం కొన్ని వర్గాలలో వ్యాపించిన అభిప్రాయం సరియైనదికాదు.

3. తెలంగాణ ప్రాంతంలో తెలుగు దీపాలు ఎన్నడూ ఆరిపోలేదన్నది సత్యం, అప్పటి ప్రభుత్వ విధానాల వలన హైదరాబాద్ నగర పరిస్థితి ఎట్లా ఉన్నా పల్లె ప్రాంతాలలో తెలుగు భాషా సాహిత్యము అంతరించలేదు.

4. తెలంగాణ సాహిత్యంలో నవయుగోదయానికి వైతాళికులు నిస్సందేహంగా కొమర్రాజు వెంకటలక్ష్మణరావుగారు. ఆధునిక యుగంలో తెలుగు భాషా వికాసానికి కృషి చేసినవారిలో వీరేశలింగంగారి పక్కన ఉండవలసినవారు.

5. ఆంధ్ర ప్రాంతంలోని ఆంధ్రోద్యమానికి తెలంగాణ ప్రాంతంలోని ఆంధ్రోద్యమానికి వ్యత్యాసమున్నది. ఆంధ్రప్రాంతంలో ఆంధ్రోద్యమం ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కృషి చేసింది. తెలంగాణలో అది తొలుత సాహిత్య ప్రచార ఉద్యమంగా ప్రారంభమై తరువాత బాధ్యతాయుత ప్రభుత్వం కొరకు పోరాటం చేసి రాజకీయ ఉద్యమంగా మారింది.

6. ఫారసీ, ఉర్దూ సాహిత్యాలు తెలుగును ఎక్కువగా ప్రభావితము చేసినట్లు కనిపించదు. ఈ ప్రభావము యేమైనా ఉంటే అది శబ్దజాలం మట్టుకే పరిమితమైంది. ఈ ఫారసీ ఉర్దూ సాహిత్యాలను చదివిన ప్రేరణతో ఉత్సాహంతో తెలుగులో చెప్పుకోదగిన సాహిత్యం ఏదీరాలేదు. అట్లానే తెలుగు సాహిత్యం కూడా ఆ భాషలలోకి వెళ్ళలేదు.

1990ల నడిమి భాగంలో మేధావుల చర్చల్లో కీలకమైనదిగా ఉంటూ, 2001 తరువాత రాజకీయ మహోద్యమంగా "ప్రత్యేక తెలంగాణ" చరిత్రలో నిలిచింది. ఈ దశలో ఇక్కడి సాహిత్యం, సంస్కృతి, తరతరాల వారసత్వాలపై లోతైన పరిశోధనలు కొనసాగాయి. ఆవిష్కరణలు వినూత్నరీతిలో జరిగాయి. పలువురు ఆనాటి సాహితీవేత్తల పేర్లు ప్రస్తుతం సామాన్య ప్రజానీకానికి సైతం పరిచయమయ్యాయి. అయితే రామానుజరావు నెల్లూరులో ప్రసంగం చేసిన నాటి పరిస్థితి వేరు. ఇక్కడ తెలుగు భాషా సాహిత్యాలు లేనేలేవని ఇంకా అన్యప్రాంతీయులు భావిస్తున్న రోజులవి. ఆకాలంలో ఇపుడు బాగా ప్రచారంలోకి వచ్చిన పూర్వ తెలంగాణ సాహితీమూర్తుల గొప్పతనాన్ని రామానుజరావు తమ ప్రసంగంలో గట్టిగా ప్రస్తావించారు.

ధవళా శ్రీనివాసరావు, సిరిప్రగడ భార్గవరావు, నెల్లుట్ల రామకృష్ణకవి, బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి, పొట్లపల్లి రామారావు, కాంచనపల్లి చినవెంకట రామారావు, వెల్దుర్తి మాణిక్యరావు, అడ్లూరి అయోధ్య రామకవి, సోమరాజు ఇందుమతీ దేవి, గార్లపాటి రాఘవరెడ్డి, గవ్వా మురహరిరెడ్డి, ఊటుకూరి రంగారావు వంటి కవులను, నందగిరి ఇందిరాదేవి, యల్లాప్రగడ సీతాకుమారి, నందగిరి వేంకటరావు, ఇల్లిందల సరస్వతీదేవి, బూర్గుల రంగనాధరావు, భాస్కరభట్ల కృష్ణారావు, ధరణికోట శ్రీనివాసులు, నెల్లూరి కేశవస్వామి, వట్టికోట ఆళ్వార్‌స్వామి వంటి కథారచయితల్ని ప్రస్తావించారు. తెలంగాణ గోర్కీగా గుర్తింపును పొందిన వట్టికోట ఆళ్వార్‌స్వామి వ్యక్తిత్వాన్ని గొప్పగా ప్రసంగించారు. దాశరథి రంగాచార్య నవలల్ని గుర్తు చేశారు. కేశవపంతుల

నరసింహశాస్త్రి వంటి గొప్ప విమర్శకులు తెలంగాణకు ఉన్నారని గుర్తు చేశారు. ప్రాచీన సాహిత్య సంప్రదాయాల్లో తెలంగాణకున్న ప్రముఖ స్థానాన్ని సోదాహరణ రీతిలో వివరించి, రాజకీయ పరిణామాలతో సాహిత్య వికాసానికి ఉండే సంబంధాన్ని ప్రతిభావంతంగా ప్రసంగంలో విశదపరచారు.

తెలంగాణ సాహిత్యాభిమానులు అందరూ "తెలంగాణ సాహితీ వికాసము" వ్యాసాన్ని తప్పక అధ్యయనం చేయాలి.

"ఉర్దూపై సంస్కృత భాషా ప్రభావము" అనే ప్రసంగంలో రామానుజరావు సునిశిత పరిశీలనా పాటవం కనబడుతుంది. పలు ఉర్దూ పదాల మూలాలు సంస్కృతంలో ఉన్నాయని ఇందులో ఆయన ప్రతిపాదించారు. సంస్కృతంలోని ఖేలన ఉర్దూలో ఖేల్నా; కరణ – కర్నా; చలతి – చల్నా; అగ్ని – ఆగ్; శ్వశుర – సుసర్; ఫల–ఫల్; ఇట్లా అనేక ఉదాహరణల్ని తన ప్రతిపాదనకు ఉదాహరణలుగా చూపారు. అయితే సంస్కృత భాషా ప్రభావం ఇట్లా ఉన్నప్పటికీ సంస్కృత సాహిత్య ప్రభావం మాత్రం ఉర్దూమీద పెద్దగా లేదని అభిప్రాయపడ్డారు. "ఉర్దూ భాషకు సేవ చేసిన తెలుగువారు" వ్యాసం ఆసక్తికరమైంది. నలభై గ్రంథాల్ని ఉర్దూలో రచించిన దోమకొండ పూర్వ సంస్థానాధిపతి రాజారామేశ్వరరావు వంటి విస్మృత విద్వాంసుల్ని గురించి ఇందులో పరిచయం చేశారు. రాఘవేందర్‌రావు వంటి గొప్ప ఉర్దూ కవుల్ని ప్రస్తావించారు. చాలామందికి తెలియని విస్తారమైన సమాచారం ఈ ప్రసంగంలో దొరుకుతుంది. "తెలుగు సాహిత్యానికి మహమ్మదీయుల సేవ" అన్న ప్రసంగం కూడా ఆసిక్తికరమైందే.

రచయితలను ఉద్దేశించి చేసే ప్రసంగాలలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఇవి సమాచార ప్రధానమైనవి కావు. రచయితలకు వారి లక్ష్యాన్ని నిర్దేశించే తీరుతో ఉన్న ప్రసంగాలు. ఇందులో రామానుజరావుకు సాహిత్య ప్రయోజనంపై ఉన్న నిర్దిష్టమైన అంచనాలు; సాహితీవేత్తలు పాటించవలసిన ఖచ్చితమైన విలువల పట్ల అవగాహనలు అవగతమవుతాయి. నల్లగొండ, కడప రచయితల సభల్లో చేసిన ప్రసంగాలలో పలు మౌలిక కీలక వ్యాఖ్యలు రామానుజరావు చేశారు. ముందుగా నల్లగొండ జిల్లా రచయితల సభల ప్రారంభోపన్యాసంలోని వ్యాఖ్యలు చూస్తే –

1. నల్లగొండ – తెలంగాణాంధ్రోద్యమానికి పట్టుగొమ్మ

2. మనిషి ఆధునికుడు కావడం అంటే గతాన్ని పూర్తిగా సమీక్షించుకొని వర్తమానంలో జరుగుతున్న పరిణామాలను గుర్తిస్తూ సుందర భవిష్యత్తు నిర్మించుకోవడానికి కార్యోన్ముఖుడు కావడమేనని నా ఉద్దేశం.

3. నేటి రచయిత – జరిగిన దానికన్నా, జరగవలసిన దాన్ని గురించి చాటి చెప్పవలసి ఉన్నది.

4. రచయితలు చాలామంది స్వేచ్ఛను గురించి మాట్లాడుతుంటారు. ఈ రోజు చాలామంది రచయితలు తమకు తామే బానిసలు, అవకాశాలకు బానిసలు.

5. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజాన్ని ప్రకోపింపజేయడం కాదు, రచయిత చేయవలసిన పని ఉద్దీప్తం చేయడం, చైతన్యాన్ని రేకెత్తించడం, సామాజికమైన అవగాహనను కలిగించడం, వివేచనా శక్తిని పెంచడం, ఇవి రచనల ద్వారా సమాజానికి కలిగే ప్రయోజనాలు.

6. ఒక రచనసాహిత్యం అవునా కాదా అని నిర్ణయించడానికి సాహిత్య ప్రమాణాలే సమర్ధవంతాలు. కాని కళాత్మకంగా చెప్పటం మాత్రమే సాహిత్యం కాదు, సామాజిక చేతనను ప్రతిబింబించినపుడే అది గొప్ప సాహిత్యం అవుతుంది.

ఇవీ – 1976 మే ప్రసంగం నాటి విశేషాలు.

13.11.1977 నాటి కడప జిల్లా రచయితల సంఘం నాల్గవ మహాసభలో రామానుజరావు వ్యక్తం చేసిన కొన్ని అభిప్రాయాలు :

1. రచయితకు సమాజం పట్ల బాధ్యతలున్న మాట సత్యమే. కానీ ఆ లక్ష్యాలు, ఆదర్శాలు ప్రత్యేక రాజకీయ పక్షాలకు ఆశయాలకు అనుబంధంగా ఉండవలసిన అవసరం లేదు. సామాజిక ప్రగతి, దేశాభ్యుదయం, లోక కళ్యాణం రచయిత ఆదర్శాలుగా ఉండవలెననడంలో అభిప్రాయభేదం లేదు. కాని రాజకీయ వాదుల అడుగులకు మడుగులొత్తి వారి కటాక్షవీక్షణాలకు పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో రచనలు చేయవలెననే అభిప్రాయం నామట్టుకు నాకులేదు.

2. ప్రాథమిక స్వత్వాలు, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కులమత వర్గరహితమైన సాంఘిక వ్యవస్థ ఈనాడు అందరూ కాంక్షించే ప్రయోజనాలు. ఈ ప్రయోజనాల సాధన కొరకై కృషి జరుగుతున్నది. ఈ కృషికి అనుగుణంగా రచయితల చిత్తవృత్తి రూపొందించవలసి ఉంటుంది. నేటి పరిస్థితుల దృష్ట్యా దేశ శ్రేయస్సును

లోకకళ్యాణాన్ని కాక్షించి రచయితలు స్వతంత్రంగా ఆలోచించి, అందుకు అనుగుణంగా తమ రచనా వ్యాసంగాన్ని సాగించవలసి ఉంటుంది.

'సాహిత్యోపన్యాసాలు' సంకలనంలో కొన్ని రేడియో ప్రసంగాలు ఉన్నాయి. అట్లా కాకుండా మొత్తం రేడియో ప్రసంగాలతో కూడిన రామానుజరావు వ్యాససంకలనం కూడా చాలా పూర్వమే ప్రచురణను పొందింది. ఇది విలువైన వ్యాసాలున్న సంకలనం. ఇందులో పలు వైవిధ్యభరితమైన రేడియో ప్రసంగ వ్యాసాలున్నాయి. వాటిని సమీక్షించుకునేముందు తెలంగాణలో రేడియో ప్రసంగ రచనను రేఖామాత్రంగానైనా ప్రస్తావించడం అవసరం.

ప్రజా చైతన్య వాహికలైన పత్రికలు, రాజకీయసంస్థల ఉనికినే నిరసించిన ఏడవ నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఎందుకోగానీ, రేడియో ప్రసారాల్ని ప్రోత్సహించాడు! ఇతర సంస్థానాలకంటే ఎంతో ముందే హైదరాబాద్ సంస్థానంలో రేడియో ప్రసారాలు ప్రారంభం కావడం అందుకు దాఖలా. 1930లలోనే దక్కన్‌రేడియో ప్రసారాలు మొదలయ్యాయి. నిజాం సర్కారుకు బాగా అనుకూలురుగా పేరున్న కురుగంటి సీతారామయ్య వంటి వారు దక్కన్ రేడియోలో పని చేశారు. రేడియో ప్రసారాల ద్వారా తనకు సానుకూల ప్రచారం దక్కాలన్నది బహుశా మీర్ ఉస్మాన్ అలీఖాన్ వ్యూహం. నాడు ప్రసారమాధ్యమాలు ఇంకా వికసనదశకు చేరువకాలేదు. అప్పట్లో రేడియో ప్రాధాన్యత నిర్వచనాలకు కూడా అందనిది. ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత దక్కన్‌రేడియో ఆకాశవాణిలో విలీనమైంది. అయితే ఆరోజుల్లో హైదరాబాద్ ఆకాశవాణిలో తెలంగాణ ప్రాంతీయుల భాగస్వామ్యం బాగా తక్కువ. ఇందుకు కొన్ని కారణాలున్నాయి. "ప్రామాణిక భాష" అనే రేఖ ఒకటి బలంగా ఏర్పడడం, అది ప్రచారాన్ని అందుకోవడం, హైదరాబాద్‌కు తరలివచ్చిన కోస్తాంధ్ర కవులు - రచయితల ఆధిక్యత; స్థానికులు రేడియో రచనలపై పెద్దగా ఆసక్తిని చూపించకపోవడం, ఇవన్నీ కారణాలు. అయితే తెలంగాణ వైతాళిక శ్రేణిలో ముందున్న పండిత ఆదిరాజు వీరభద్రరావు మాత్రం స్థానిక రచయితలకు భిన్నంగా వ్యవహరించారు. రేడియో ప్రసంగాల పట్ల ఆసక్తిని పెంచుకున్నారు. భావప్రసారానికి రేడియో ఉత్తమ మాధ్యమమని భావించారు. ప్రామాణికతకు పర్యాయపదాల వంటి ఆదిరాజు రేడియో ప్రసంగాలు ఎంతో గొప్పవి. ఆయన రేడియో ప్రసంగాల్ని కనుక ఒక సమగ్ర సంపుటిగా ప్రకటిస్తే అది మరో సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం అవుతుందని పరిశోధకుల అభిప్రాయం. సరిగ్గా, ఆదిరాజు వీరభద్రరావు వారసత్వాన్ని రేడియో

ప్రసంగాల విషయంలో రామానుజరావు స్వంతం చేసుకున్నారు. వాఙ్మయ పరిమళాల చిరునామాలు – ఆకాశవాణిలో రామానుజరావు చేసిన ప్రసంగాలు.

రేడియో ప్రసంగాల శ్రోతల సంఖ్య కోట్లలో; రేడియోకు రచనలు చేసేవారు వందల సంఖ్యలో ఉన్న కాలంలో రామానుజరావు విరివిగా రేడియో ప్రసంగాలు చేశారు. పలువురు ప్రముఖులు రేడియో ప్రసంగాలు చేస్తారు కానీ వాటి రాతప్రతుల్ని భద్రపరచుకోవడం అరుదు. అవి ప్రచురణ వరకు చేరుకోవడం మరింత అరుదు. అయితే క్రమశిక్షణకు, నియమబద్ధమైన జీవనసరళికి ప్రతిరూపమైన రామానుజరావు తమ ప్రసంగాల్ని దాచుకున్నారు. 1976లో ఈ ప్రసంగాలు సంకలన రూపంలోనూ వచ్చాయి.

రేడియో ప్రసంగాలలో కొన్నింటిని ఇక్కడ సమీక్షించుకుంటే...

పత్రికలు, వ్యాససంపుటాలకు సాహిత్య విమర్శనాత్మక వ్యాసాలు రచించడం ఒక పద్ధతి. రేడియో ప్రసంగ రచన ఇందుకు కొంత భిన్నం. ప్రచురణ రంగం వేరు, రేడియో ప్రసారవేదిక వేరు. రెండింటికీ ఒకతీరు రచనా సంవిధానం సరిపోదు. వ్యాసంపుటాలలో ప్రచురించే వ్యాసాల్లో గాఢత ఎక్కువ. విషయాన్ని తర్కయుక్తంగా ప్రతిపాదించే క్రమంలో ఎన్నో ఉటంకింపులు చోటుచేసుకుంటాయి. మరీ లోతైన వ్యాసాలకు పాదసూచికలూ అవసరం. భాష గంభీరంగా ఉండాలి. ఇవన్నీ ప్రచురణకు ఉద్దేశించిన వ్యాసాలకు ఆదర్శాలు. అయితే రేడియో ప్రసంగాలకు ఈ ఆదర్శాల్ని అనువర్తింపజేయలేము. ఇందుకొక కారణం ఉంది. ప్రచురణ పొందిన వ్యాసాల్ని అక్షరాస్యులు మాత్రమే చదువుతారు. రేడియో ప్రసంగాలు నిరక్షరాస్యులకు కూడా అందుబాటులో ఉంటాయి. పాఠకులు కొంచెం హెచ్చుతగ్గులతో ఒకే అవగాహనా స్థాయిలో ఉంటారు. రేడియో శ్రోతల అవగాహనలో బాగా తేడా ఉంటుంది. రేడియో ప్రసంగం అటు మహామేధావుల్ని, ఇటు సామాన్య శ్రోతల్ని కూడా ఆకట్టుకోవలసి ఉంటుంది. ఇందుకు ప్రసంగకర్త బాగా శ్రమించవలసిన అవసరం ఏర్పడుతుంది. శ్రోతను నేరుగా ప్రసంగంలోనికి తీసుకొనిపోవడం, ప్రసంగంలో అందరికీ అర్థమయ్యే పదప్రయోగాలు, ప్రసంగాంశాన్ని ఆసక్తికరమైన రీతిలో ఎంపిక చేసుకోవడం – ఇట్లా పలు మెళుకువలు అవసరం. రామానుజరావు రేడియో ప్రసంగాలన్నింటిలోనూ ఈ మెళకువల మేళవింపు ఉంటుంది. ఆసక్తికరమైన అంశాన్ని అంతకంటే ఎంతో ఆసక్తికరంగా వివరించడం ఆయన రేడియో ప్రసంగాల ప్రత్యేకత. **పాఠకుని వ్యాసంలోకి తీసుకొనిపోవడం కంటే శ్రోతను ప్రసంగం దిశగా మళ్ళించడం ఎంతో కష్టమైన పని.**

రామానుజరావు రేడియో ప్రసంగాల ఆరంభ వాక్యాలు శ్రోతను వెంటనే ఆకట్టుకునే రీతిలో ఉంటాయి. రెండు ప్రసంగాలను ఇందుకు ఉదాహరణగా చూపించవచ్చు.

కొమర్రాజు లక్ష్మణరావు గారిని గురించిన ప్రసంగంలోని ఆరంభ వాక్యాలు ఇవి:

"చిన్నతనంలో సిరిసంపదలతో తులదూగే గారాబంగానీ, అన్ని సదుపాయాలతో చదువుకునే అవకాశంగానీ ఆయనకు లభించలేదు. కారణం తండ్రిగారి అకాల మరణం. అందుచేత విద్యాభ్యాసమంతా యించుమించుగ ఆంధ్రదేశానికి దూరంగా ఉన్న మహారాష్ట్ర ప్రాంతంలోని నాగపూర్‌లో అక్క బావల యింట జరిగింది. సహజంగా కర్తవ్య పరాయణుడైన ఆబాలకుడు అలనాటి పద్ధతి ప్రకారం ఇంగ్లీషు ద్వారా ఎం.ఏ. పట్టభద్రుడై యింటికి వచ్చినాడు. అప్పుడు స్వర్గీయులైన తన తండ్రిగారి పలుకుబడి వలన సంస్థానంలో దివాన్‌గిరీ ఉద్యోగం లభించినది. ఇటువంటి జీవిత ప్రారంభము సారస్వత కృషికి అంతగా అనుకూలమైనది కాదు. అయినప్పటికీ తన జీవిత సర్వస్వాన్ని ఆంధ్ర భాషాభివృద్ధికి అంకితం చేసినాడంటే కొంత ఆశ్చర్యం కలిగి తీరుతుంది. ఆ మహనీయుడే స్వర్గీయ కొమర్రాజు వేంకట లక్ష్మణరావు..."

మౌలానా అబుల్‌కలాం ఆజాద్ ప్రసంగంలోని ప్రారంభ వాక్యాలు ఇవి :

"మౌలానా సాహెబ్ పరలోక గతులైనారను వార్త సమస్త భారతదేశమును శోకసముద్రములో ముంచినది. కనులు మూసికొనునంతనే రాజఠీవి ఉట్టిపడు విగ్రహము, పాదుషాలను స్మరింపజేయు ఆ గంభీరమూర్తి మన మనోదర్పణములందు ప్రతిబింబించుచున్నది. ఈ రాజఠీవి, యీ గాంభీర్యము ఆయన బాహ్యస్వరూపమునే కాక ఆంతరంగిక స్వరూపమునకు విలక్షణమైన ప్రత్యేకతయని చెప్పవచ్చును. శక్తివంతమైన ఆయన లేఖనీ విన్యాసమునందు, వచో విలాసమునందు యీ రెండు గుణములు విశిష్టముగా కనిపించుచుండును. దూషణ భూషణములకు రాగద్వేషములకు అతీతముగా కర్తవ్య నిర్వహణ గాంచిన ఉదారచరితుడు మౌలానాసాహెబ్."

గాలిబ్ జీవిత విశేషాలు అనే ప్రసంగం ఆసక్తికరంగా సాగింది. తెలుగువారికి గాలిబ్‌కవిత్వాన్ని పరిచయం చేసిన విద్వాంసుల్లో రామానుజరావు మొదటివ్యక్తి. తన వ్యాసంలో గాలిబ్ జీవితపు వెలుగుతోపాటు ఆయన వ్యక్తిత్వంలోని చిమ్మ చీకట్లనూ

విశ్లేషించారు. "పితృపితామహులు కత్తితో కసరత్తు గావించినా గాలిబ్ కలముతో కసరత్తు చేసినాడు. పితృపితామహులది తాత్కాలికమైన కీర్తి మాత్రమే కాని గాలిబ్ యశస్సు ఆచంద్ర తారార్కమైంది" అంటారు రామానుజరావు. "ఉర్దూ కవితా సామ్రాజ్యానికి గాలిబ్ నిర్మకుట చక్రవర్తి" అన్న వ్యాఖ్యలో ఆయనకు గాలిబ్‌పట్ల ఉన్న నిరుపమానమైన అభిమానం వ్యక్తమైంది.

'క్లుప్తతలో సమగ్రత' అనే రేడియో ప్రసంగ ఆదర్శానికి ప్రతిరూపం వంటిది "మహాత్ముని సమకాలికులు".

"స్వాతంత్ర్యానంతర సాహిత్యము" అనే రేడియో ప్రసంగంలో "ఎన్నికల కాలంలో రచించబడే గేయాల్ని సేకరించి వాటిని ప్రకటించాలనే" ఆసక్తికరమైన సూచన చేశారు. "హిందీలో నయీ కవిత ఉద్యమము వంటిదే తెలుగులో దిగంబర కవిత ఉద్యమము" అన్నారు.

"మా ఊరు ఓరుగల్లు" అన్న ప్రసంగంలో రామానుజరావుకు తన పురిటిగడ్డపై గల అభిమానం ప్రతివాక్యంలోనూ ప్రస్ఫుటమైంది. సంకలనంలోని ఇతర వ్యాసాలకు భిన్నమైన ఉద్విగ్నశైలి ఇందులో ఉంది. "తెలుగు సాహిత్యముతో పరిచయమున్న వారందరును నాడు మా ఊరు ఓరుగల్లు వడ్డించిన వంటకాల రుచి చూసినవారే... ఎక్కడికి వెళ్ళినా అక్కడి ఆచారాలను వంటకాలను వంకబెట్టిన శ్రీనాథుడు మా ఊరును ఎన్నో రీతుల్లో ప్రశంసించినట్లు సాహిత్యసాక్షమున్నది" అని వరంగల్ ప్రశస్తిని గురించి వ్యాఖ్యానించారు. 1964లో చేసిన ఈ రేడియో ప్రసంగంలో "గడచిపోయిన ఆనాటి చరిత్రలోనే కాదు, జరుగుతున్న ఈనాటి చరిత్రలోనూ, రేపు జరుగనున్న చరిత్రలోనూ మా ఊరు వరంగల్లు గణనీయమైనది" అన్న ముగింపు మాటలు ముమ్మాటికీ సత్యాలని సమీప గత చరిత్ర, వర్తమాన కాలం చెబుతున్నాయి.

ఇంకా – రేడియో ప్రసంగ సంకలనాలలో లాల్ బహదూర్‌శాస్త్రి, లాలా లజపతిరాయ్, తెలుగుదనం విశిష్టత, మన దేవాలయాలు – శిల్పకళ, ఏకశిలానగరము, స్థలపురాణము, వరంగల్లు మండల రచయితల మహాసభ అధ్యక్షోపన్యాసము, నల్లగొండ జిల్లా రచయితల మహాసభ అధ్యక్షోపన్యాసము, మహబూబ్‌నగర్ జిల్లా రచయితల మహాసభ అధ్యక్షోపన్యాసము ఉన్నాయి.

ఇవన్నీ వేటికవే ప్రత్యేకమైనవే.

దశదిశల్లో విస్తరించిన 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు'

కవులు – రచయితలలో సర్వసాధారణంగా రెండు విభిన్న స్వభావాలకు చెందిన వారు ఉంటారు. వీరిలో ఒక వర్గం నిరంతరం అధ్యయనాలు, రచనలు కొనసాగించడాన్ని నిత్యకృత్యంగా చేసుకుంటారు. ఇటువంటి కవులు, రచయితలకు విస్తారమైన సాహిత్య సమాజంతో ప్రగాఢమైన అనుబంధం ఉండదు. మరికొంతమంది అటు తమతమ అధ్యయన, రచనాభ్యాసాల్ని నిర్వహిస్తూనే సాహిత్య సమాజంతో మమేకమైపోతారు. (సాహిత్య సమాజం అన్నమాటకు కవులు, రచయితలు, సారస్వత విమర్శకులు, సారస్వత జిజ్ఞాసువులు, వివిధ సాహిత్య సంస్థల నిర్వాహకులు – అంటూ విస్తారమైన అర్థాన్ని చెబితే ఇక్కడ సరిపోతుంది.) ఇటువంటి సాహిత్య సమాజంతో దశాబ్దాలపాటు కలగలిసి ఉన్నారు దేవులపల్లి రామానుజరావు. నిజానికి ఆయన జీవితంలో సింహభాగం సాహిత్యసమాజంతో ముడిపడిందే. ఏడున్నర దశాబ్దాల ఆయన జీవితంలో అరవై ఏళ్ళపాటు సాహిత్య సమాజంతో సంబంధాన్ని కలిగి ఉన్నారు. తన జీవితంలో రామానుజరావు మూడు కీలకమైన 'కాలపు మైలురాళ్ళు' చూశారు. బాల్యంలో చూసిన నిజాం నియంతృత్వ పాలన అందులో మొదటిది. విశాలాంధ్ర ఏర్పడేవరకు (1956) ఉన్నది రెండవది. విశాలాంధ్ర అవతరణ మొదలుకొని మరొక పాతిక సంవత్సరాలకుపైగా ఉన్నది మూడవదశ. ఈ మూడు "కాలపు మైలురాళ్ళ" కొలతలు ఒక్కరీతివి కావు! మనషులు మారారు, సాహిత్యస్వరూప స్వభావాలూ మారాయి. అయితే ఈ కాలాల జ్ఞాపకాలు మాత్రం ఎటువంటి మార్పులు లేకుండా పదిలంగానే ఉన్నాయి. ఇటువంటి పదిల పరచిన జ్ఞాపకాల మూట, "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" (1929–79) రామానుజరావు కుమార్తె విమలగారి అభిప్రాయం ప్రకారం "ఈ రచన ఆయన స్వీయచరిత్ర". "పన్నెండేళ్ళ ప్రాయం నుంచి అర్థ శతాబ్ది కాలంలో ఆయన జ్ఞాపకాలు, అనుభవాలు, అనుభూతుల సమాహారమే ఈ గ్రంథం" అన్నది రామానుజరావుకు సన్నిహితులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, డాక్టర్ సి.నారాయణరెడ్డిగారి అభిప్రాయం. 1979వ సంవత్సరం వరకు దేవులపల్లి వారి జ్ఞాపకాల్ని ఈ రచన మన కందించింది. తొలుత

ఇది 1981లో వెలుగు చూసింది. వరంగల్లులోని సాహితీ బంధుబృందం మొదట దీనిని ప్రచురించింది. అప్పటికి ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగి పాతిక సంవత్సరాలు గడిచింది. తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వం, ఈ ప్రాంతపు ఆధునిక సాహిత్య విలక్షణతల పట్ల ఎవరికీ ఆసక్తులులేని రోజులవి. సాహిత్య సాంస్కృతిక రంగాలలో తెలంగాణేతరుల ఆధిక్యత కొనసాగుతున్న కాలంలో వెలువడిన "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" నాడు పెద్దగా గుర్తింపును పొందకపోవడం ఆశ్చర్యపడవలసిన దేమీకాదు. అయితే, గత దశాబ్దిన్నర కాలంగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ప్రభావంతో తెలంగాణ యువతరం ఆనాటి తమ ప్రాంతపు గొప్ప రచనలవైపు ఆసక్తిని చూపించడం ఆరంభమైంది. ఈ దిశలో పాఠకాదరణ పొందిన రచనల్లో యాభై సంవత్సరాల జ్ఞాపకాలు ఒకటి. ఎంతోమంది చదువాలనుకున్నా ఇది గతంలో అందుబాటులో లేకపోయేది. దీన్ని దృష్టిలో పెట్టుకొనే సారస్వత పరిషత్తు రామానుజరావు జ్ఞాపకాలను తిరిగి ముద్రించింది. ఈనాటి యువతరం నిన్నటి తమ ప్రాంతపు చరిత్రలోని గొప్ప ఘట్టాల్ని తెలుసుకునేందుకు ఉపకరించే రచనల్లో యాభై సంవత్సరాల జ్ఞాపకాలు ఒకటి. సారస్వత పరిషత్తు కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య అభిప్రాయ పడినట్టు "తెలంగాణ చరిత్ర నిర్మాణానికి ఉపకరించే గ్రంథం – యాభై సంవత్సరాల జ్ఞాపకాలు".

గ్రంథ రచనకు ఒక స్పష్టమైన లక్ష్యం ఉంది. దాన్ని గురించి రామానుజరావు ఇట్లా పేర్కొన్నారు.

"యీనాటి (అంటే – గ్రంథ ప్రథమ ముద్రణ నాటి) సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే భిన్నమైన వ్యక్తులలో భిన్నమైన అభిప్రాయాలు ఏర్పడవచ్చును. భావిచరిత్రకు ఏమైనా ఉపయోగ పడవచ్చును. మన తరానికి ప్రబోధమో గుణపాఠమో కలుగవచ్చును. ఆ ఉద్దేశంతోనే యీ జ్ఞాపకాలకు అక్షరరూపం ఈయనైనది."

ఈ రచనలో 1979 వరకు కొనసాగిన జ్ఞాపకాలు ఉన్నప్పటికీ అప్పటికి "ఇటీవలి"విగా ఉన్న 1956–70 సంవత్సరాల కాలవ్యవధి తాలూకు ఘటనలపై విమర్శనాత్మక వ్యాఖ్యానాలు ఉండవు. "1956–70 మధ్యన గల 14 సంవత్సరాల కాలంలో జరిగిన సంఘటనలను గూర్చి యెక్కువగా వ్యాఖ్యానించడం ఇబ్బందితో కూడిన పని. చాలామంది సమకాలికులు సంఘటనలు చూసినవారు కూడా ఉన్నారు. అందుచేత ఇప్పుడు వ్యాఖ్యానించడం సమంజసం కాకపోవచ్చు. ఆ అవకాశాన్ని మరికొంత కాలం తరువాత వినియోగించుకోవడం బాగుంటుందని నాకు తోచింది"

అని ముక్తాయింపును పలికారు రచయిత. బహుశా ఆయన మరికొంతకాలం జీవించి ఉంటే ఈ జ్ఞాపకాలకు కొనసాగింపుగా మరొక ఆసక్తికరమైన రచన వెలువడేదేమో.

తెలంగాణ ప్రాంతంలో ఆత్మకథా ప్రక్రియ కొంత ఆలస్యంగానే ఆరంభమైంది. ఆంధ్ర మహాసభానేతల్లో మితవాద వైఖరిని అవలంబించిన వర్గానికి చెందిన మాదిరాజు రామకోటేశ్వరరావు ఆత్మకథ తెలంగాణ ప్రాంతంలో ఈ దిశలో వెలువడిన తొలి రచన. ఇది సర్వసమగ్ర రచన. మాదిరాజువారి ఆత్మకథ 1960వ దశాబ్దిలోనే వెలువడినా అది పెద్దగా గుర్తింపును పొందకపోవడం బాధాకరం. అటు తరువాత మందుముల నరసింగరావు, దాశరథి కృష్ణమాచార్య, రంగాచార్య, గడియారం రామకృష్ణశర్మతోపాటు పలువురు కమ్యూనిస్టు పోరాటయోధుల ఆత్మకథలు వచ్చాయి. దేవులపల్లి వారి రచన నాటికి మాదిరాజు, మందుముల రచనలు మాత్రమే అవీ పరిమితస్థాయిలోనే ప్రచారంలో ఉన్నాయి. రామానుజరావు జ్ఞాపకాలను ఆత్మకథా రచనగా పరిగణించవచ్చునా? అన్నదొక ప్రశ్న. ఇది పూర్తిగా ఆత్మకథా ప్రక్రియా సూత్రాలకు అనువర్తించే రచన కాకపోవచ్చుననే అభిప్రాయమూ కొన్నిసార్లు కలుగుతుంది.

ఆత్మకథలో క్రమరీతి ఉంటుంది. అయితే జ్ఞాపకాల రచన ఇందుకు భిన్నమైంది. జ్ఞాపకాలు వాయు తరంగాల వంటివి. అవి అనుభవాన్ని అందిస్తాయికానీ, వాటి ఆకారాన్ని నిరూపించలేము. రామానుజరావు జ్ఞాపకాలలోనూ కట్టుదిట్టమైన క్రమరీతి కనిపించదు. ఈ జ్ఞాపకాలను అనుభూతిమయమైన స్మృతులుగా పదిలపర్చుకోవాలి. పరమ ప్రామాణికమైన చారిత్రక శకలాలుగా భద్రపరచుకోవాలి. జ్ఞాపకాల రచనల్లో ఉండే అన్ని విలక్షణ స్వభావాలూ దేవులపల్లి రచనలో గూడుకట్టుకున్నాయి. పరిపరి పరిచయాలు, ఉత్కంఠభరితమైన ఘటనలు, ఉత్కృష్ట వ్యక్తిత్వాలు, ఆయా వ్యక్తిత్వాల ఆంతరిక స్వభావాలు, ప్రవాహ సదృశమైన వచనశైలి ఈ జ్ఞాపకాల రచనను సుందరరీతిలో తీర్చిదిద్దిన దినుసులు. జ్ఞాపకాల రచనల్లో పునరుక్తి సహజం. వచ్చిన వ్యక్తులే తిరిగి తిరిగి ప్రత్యక్షం కావడం, రచయిత విభిన్న జ్ఞాపకాల నేపథ్యాల్లో మనల్ని పలకరించడం, ఇదివరకు పేర్కొన్న వ్యక్తుల్ని మరోమారు అదే తీరుతో పరిచయం చేయడం, బాగా ఇష్టపడిన యాదుల్ని ఉద్విగ్న భరిత శైలితో ప్రకటించడం – ఇటువంటి లక్షణాలన్నీ రామానుజరావు రచనలో దండిగా ఉన్నాయి. వీటిని మొయియర్స్ అనవచ్చు. స్వామీ రామానందతీర్థ జ్ఞాపకాలు ఈ కోవలో చేరేవి. ఆయన

రచించిన "హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటం – నాజ్ఞాపకాలు" చదవడానికి ఆత్మకథ అనిపిస్తుంది. అయితే అది అచ్చమైన అత్మకథ కాదు. పోరాట యోధుడైన స్వామీజీ జ్ఞాపకాల సంకలనం అది. ప్రసిద్ధ రచయిత సామల సదాశివ "యాది" కూడా ఇటువంటిదే. రామానందతీర్థ – సామల సదాశివల జ్ఞాపకాల నడుమ కాలంలో వెలువడినది రామానుజరావు రచన. ఈ రచన తెలుగు భాషా సాహిత్యాభిమానులందరికీ సుదీర్ఘకాలంపాటు పదిలమైన యాదులు"గా గుర్తుండి పోతుంది.

విస్మృత స్మృతి : చరిత్రలో కొంతమందికి తగిన చోటు లభించదు. వారు విస్మృతులుగానే మిగిలిపోతారు. ఎవరైనా వారిని గుర్తు చేసుకుంటే తిరిగి వారి పేరు బయటకు వస్తుంది. ఇటువంటి విస్మృత స్మృతి – జ్ఞాపకాల రచనలో కీలకం. రామానుజరావు; చరిత్ర మరచిన చరితార్థులను ఎంతో మందిని తమ జ్ఞాపకాలలో గుర్తు చేసుకున్నారు. అది ఆయన వ్యక్తిత్వంలోని సౌజన్య గుణానికి సంకేతం. సుదీర్ఘ కాలపు విస్మరణకు లోనైన ఈ పెద్దలను గురించి నవతరం తప్పకుండా తెలుసుకోవాలి. నాటి రోజుల్లో, అత్యంత విపత్కర పరిస్థితుల్లో ఏటికి ఎదురీదిన ధీరులువీరు. హైదరాబాద్ నగరంలో తెలుగు వాఙ్మయాభిమానులకు తెలుగు పుస్తకాలు అందుబాటులోలేని కాలంలో వారి కోసం ఒక పుస్తక దుకాణాన్నే నిర్వహించిన సాంస్కృతిక వీరుడు నాంపల్లి గౌరీశంకరవర్మ. తెలుగు పుస్తకాల దుకాణాన్ని హైదరాబాద్‌లో నిర్వహించడం నేటి రోజుల్లో ఘనతేమీ కాదు, తెలుగు భాష తీవ్రమైన నిరసనలకు, నిర్లక్ష్యానికి లోనైన రోజుల్లో ఈ పని చేయడం గొప్ప సంగతి. శ్యాంరావు అనే విస్మృత సంఘ సంస్కర్తను గురించి కూడా రామానుజరావు ప్రస్తావించారు. నిశ్శబ్ద సంస్కర్తగా గుర్తింపును పొందినవారు వడ్లకొండ నరసింహారావు. ఒకవైపు నిజాం సర్కారులో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే, సామాజిక సేవను తన విధ్యుక్త ధర్మంగా భావించిన గొప్ప వ్యక్తి వడ్లకొండ. ఆయనకు రావలసినంత గుర్తింపు దక్కలేదు. ఆయనతో సమానమైన మరొక గొప్ప వ్యక్తి కొమ్మవరపు సుబ్బారావు. (కొండా వెంకట రంగారెడ్డి వంటి తెలంగాణ ప్రముఖుల రచనల్లో ఆయన ప్రస్తావన ఉంది) ఈ ఉభయుల్ని రామానుజరావు గుర్తు చేసుకున్నారు. హన్మకొండలో అధ్యాపక వృత్తిలో ఉంటూ పూలతోట వంటి చక్కని పిల్లల పత్రికను నిర్వహించిన కంభంపాటి అప్పన్న శాస్త్రి దేవులపల్లి జ్ఞాపకాల్లో ఉన్నారు. మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి చరిత్రకారుల ప్రశంసల్ని పొందిన మేధావి, నిజాం కళాశాల ఆచార్యులు సిరిగూరి

హనుమంతరావును దేవులపల్లి వారు స్మరించుకున్నారు. ఆనాటికే విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి హైదరాబాద్ సంస్థానంలో గొప్ప జాతీయవాదిగా, మేధావిగానూ గౌరవాన్ని పొందిన సయ్యద్ హుసేన్ ప్రస్తావన ఈ జ్ఞాపకాల్లో ఉంది. తనకు ఉన్నత విద్యాదానం చేసిన నిజాం కళాశాల ఆచార్యులను రామానుజరావు పేరుపేరునా గుర్తు చేసుకున్నారు. వారిలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ టర్నర్ ఒకరు. ఆయన షేక్స్పియర్ సాహిత్యలో దిట్ట. ఎస్.కె.అయ్యంగార్ ఆర్థికశాస్త్రాన్ని బోధించేవారట. ఆయన అప్పటికే మైసూరు సంస్థానపు ఆర్థిక సలహాదారు. రామానుజరావుపై బలమైన ప్రభావం చూపిన ఆచార్యుడు తమిళుడైన అరుణాచలశాస్త్రి. ఆయన గణితాచార్యులు. నిజాం కాలేజీలో ఒక పర్యాయం నిర్వహించిన అవధాన సభకు ఆయన అధ్యక్షులు కావడం విశేషం. రామనరసు, రాఘవన్, అల్లాఉద్దీన్, ఫజల్ హక్ వంటి ఆనాటి మహోన్నత వ్యక్తిత్వమున్న ఆచార్యుల మేధస్సు, సహృదయతలు రామానుజరావు జ్ఞాపకాలలో దొరుకుతాయి. సుప్రసిద్ధ ఆంగ్ల విద్వాంసులు తనికెళ్ళ వీరభద్రుడు అంటే ఆయనకు ఎంతో గొప్ప మన్నన. షేక్స్పియర్ సాహిత్యంలో అగ్రశ్రేణి పండితుడాయన. “ఆరోజుల్లో తనికెళ్ళ వీరభద్రుడుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లీషుశాఖలో ఆచార్యులుగా ఉండేవారు. అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలోని ప్రముఖులందరూ వారిని గౌరవించేవారు. తమ ఉద్యోగ ధర్మానికి భంగం కలగకుండా ఇక్కడి ప్రజలతో వారు కలసి మెలిసి ఉండేవారు” అని రామానుజరావు పేర్కొన్నారు. నాటి హైదరాబాదీయుల్లో ప్రముఖులైన నవాబ్ అజంజంగ్‌ను గుర్తు చేసుకున్నారు. (ఆయనను ఆజంసాబ్ అని అందరూ సగౌరవంగా పిలిచేవారని ఆచార్య బి.రామరాజు వంటి విద్వాంసులు రాశారు). ప్రతిభ – నిజాయితీలు కలబోతగా ఉన్న ఎంతోమంది నవయువకులకు విద్యాదానం చేయడంతోపాటు ఉపాధికి చూపించిన ఉదారుడాయన. ఆయనకు ప్రజల పట్ల ప్రజల భాషల పట్ల సానుభూతి ఉండేదని రామానుజరావు రాశారు. ఏనాడూ కులమతాలు పట్టించుకోని విశాల హృదయుడు ఆజంసాబ్. నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ కూడా ఇటువంటి వారేనని రామానుజరావు రాశారు. ఆయన నిజాం కళాశాల విద్యార్థిగా ఉన్న రోజులనాటికే డాక్టర్ రావాడ సత్యనారాయణకు విద్యావేత్తగా గుర్తింపు ఉంది. వందేమాతర ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు ధైర్యం చెప్పిన ధీశాలి రావాడ. (వందేమాతర ఉద్యమ కాలంలో) “కొత్తగా ఇంగ్లండ్ నుంచి వచ్చి విశ్వవిద్యాలయ పదార్థ విజ్ఞానశాస్త్ర శాఖలో లెక్చరర్‌గా చేరిన రావాడ

సత్యనారాయణగారు ధైర్యంగా బహిరంగంగా విద్యార్థులకు సానుభూతి ప్రకటించినారు. విద్యార్థులు నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేరడానికి బయలుదేరినప్పుడు రావాడ సత్యనారాయణగారు స్టేషన్‌కు వెళ్ళి వీడ్కోలు ఇచ్చినారు" అని రామనుజరావు గుర్తు చేసుకున్నారు.

20వ శతాబ్ది తొలి దశకాలలో ప్రముఖనాయకుడు, కాంగ్రెస్ అభిమాని సిరాజుల్ హసన్ తిర్మజి, నవయువ తరానికి స్ఫూర్తినిచ్చిన సాయుధపోరాట యోధుడు రావి నారాయణరెడ్డి, ఆనాటి తెలంగాణలో ప్రజా చైతన్యానికి, విద్యాసంస్థల స్థాపనకు విరామమెరుగక పరిశ్రమించిన ఎన్.కె.రావు వంటి వారి పట్ల రామానుజరావుకు గాఢమైన అభిమానం ఆయన జ్ఞాపకాలలో వ్యక్తమైంది. ప్రసిద్ధ విద్వాంసుడు, అసాధారణ భాషావేత్త, న్యాయ కోవిదుడు గుండేరావు హర్కారే పట్ల గొప్ప మన్నన వ్యక్తమైంది. అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి ప్రో ఛాన్సలర్‌గా సేవల్ని అందించిన ఫజరుల్ రహమాన్, మల్లంపల్లి సోమశేఖరశర్మల పట్ల రామానుజరావుకు ఎంతో అభిమానం. మల్లంపల్లివారు తెలంగాణ చరిత్ర రచనను ఆరంభించారట. దురదృష్టవశాత్తూ అది మధ్యలోనే నిలిచిపోయింది. ఇటీవలి కాలంలో తిరిగి వెలుగులోకి వచ్చిన లక్ష్మీనారాయణ అనే ప్రవాస ఉదార వాణిజ్యవేత్తను గురించి రచయిత గుర్తు చేసుకున్నారు. లక్ష్మీనారాయణ గత శతాబ్ది తొలి భాగంలో నాగపూర్ నగరంలో వ్యాపార రీత్యా స్థిరపడిన తెలంగాణ బిడ్డ. ఆయన స్వస్థలం కరీంనగర్ జిల్లా "లక్ష్మీనారాయణ అనే ఒక వర్తకుడు నాగపూర్‌లో ఉండేవారు. ఆయన ఇరవై లక్షలకు పైగా ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చే ఉద్దేశ్యంతో విశాఖపట్నం వెళ్ళగా ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల దర్శనమే కాలేదట. అందుచేత నాగపూర్ తిరిగి వచ్చి అక్కడనే ఒక టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ స్థాపించి ఆ డబ్బును దానికి యిచ్చినారని విన్నాను" అని దేవులపల్లి రాశారు. ఇంకా ప్రసిద్ధ రచయిత్రి నందగిరి ఇందిరాదేవి, రచయిత – న్యాయకోవిదుడు నందగిరి వెంకటరావు, ఉర్దూ భాషాభిమాని హబీబుర్ రహమాన్, విదుషీమణి జీనత్ సాజిదా, బహుముఖ ప్రజ్ఞాశాలి ఎం.రామప్ప, పాలనాదక్షుడు, ప్రజాసేవకుడు ఎల్.ఎన్.గుప్తా, విశాలాంధ్ర ఉద్యమంలో ముందునడిచిన అహమదత్ ఖాన్ వంటి ఎందరో చరిత్ర మరచిన చరితార్థులు రామానుజరావు జ్ఞాపకాలలో దర్శనమిస్తారు. ఇదివరకటి పరిస్థితులు ఎట్లా ఉన్నప్పటికీ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఈ మహనీయుల చరిత్ర తప్పకుండా

అవసరమవుతుంది. రామానుజరావు జ్ఞాపకాలు మనం మరచిన మన ప్రాంతపు గొప్ప వ్యక్తులను గురించి స్పష్టమైన రేఖాచిత్రాలను అందించాయి. ఈ సంక్షిప్త పరిచయాల ఆధారంగా ఆయా ప్రముఖుల జీవిత విశేషాల్ని గురించి మరింత శోధించాలనే ఆసక్తి పెరుగుతుంది. పట్టుదలతో పరిశ్రమిస్తే పరిశోధిస్తే, వినూత్న చారిత్రక అధ్యాయాలు తయారవుతాయి.

ఆప్తమిత్రుల జ్ఞాపకాలు : సమాజంలోని వ్యక్తులతో మన సంబంధ బాంధవ్యాలు రకరకాలుగా ఉంటాయి. జీవితాన్ని తరచి చూసినవారు ఈ సత్యాన్ని తప్పక అంగీకరిస్తారు. కొంతమంది పరిచయస్తులుగానే మిగిలిపోతారు. వీరు ప్రయాణంలో ఇతర పథికుల వలె పరిచయమవుతారు. వారితో మన అనుబంధాలు పునాదిస్థాయికి చేరవు. ఇవి కేవలం పరిచయాలుగానే ముగుస్తాయి. మరికొందరు సకారణంగా లేదా హేతురహితంగానైనా మనల్ని వ్యతిరేకించేవారుంటారు. మిగతారకం తటస్థుల కోవలో చేరుతారు. వీరితో మన సంబంధాలు పొడిపొడిగానే ఉంటాయి. చివరగా మిగిలేవారు నిజమైన స్నేహితులు. వీరు జీవిత కాలంపాటు మనతో ఆత్మీయతతో వ్యవహరిస్తారు. వారే ఆప్తులు, శ్రేయోభిలాషులు. రామానుజరావుకు వేలాదిమంది పరిచయస్తులతోపాటు కొంతమంది పరమాప్తులైన మిత్రులూ ఉండేవారని ఆయన జ్ఞాపకాలు చెబుతున్నాయి. అటువంటి వారిని గుర్తు చేసుకున్నారాయన. వారికి కృతజ్ఞతలు తెల్పారు. ఇది రామానుజరావు స్నేహ దృక్పథానికి తార్కాణం.

నిజాం సర్కారు పాలనా కాలంలో ఉన్నతోద్యోగి పర్సా వేంకటేశ్వరరావు, సారస్వత పరిషత్తు నిర్వహణలో కీలక పాత్రను పోషించిన పులిజాల వెంకటరంగారావు, గోలకొండ దినపత్రిక యాజమాన్య బాధ్యతలు నిర్వహించిన నూకల నరోత్తమరెడ్డి, వనపర్తి సంస్థానాధీశులు రాజారామేశ్వరరావు, ప్రసిద్ధ సాహితీవేత్త, పరిశోధకులు, పరిషత్తు ప్రముఖులు గడియారం రామకృష్ణశర్మ, నిజాం ప్రభుత్వ సివిల్ అధికారి ఎం.రామప్ప, ఆధునిక తెలంగాణ సాహితీ ప్రముఖుడు ధవళా శ్రీనివాసరావు తదితరులు రామానుజరావు మిత్ర బృందంలో ఉన్నారు. భావాలు, సిద్ధాంతాలు, విధానాల విషయంలో వీరిలో కొంతమంది ఆయనతో విభేదించారు. ఆయన కూడా కొంతమందితో అభిప్రాయ భేదాన్ని ప్రకటించారు. అయినా స్నేహం మాత్రం చెక్కుచెదరలేదు. అదే ఆప్తమైత్రి అంటే. ఒకానొక కీలక సమయంలో గోలకొండ పత్రిక ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని గట్టిగా సమర్థించింది. ఆ సమయంలో

రామానుజరావు గోలకొండ సంపాదకవర్గ సభ్యులు. ఆయన విశాలాంధ్రవాది. అందువల్ల పత్రిక వైఖరితో సూత్రబద్ధంగా విభేదించారు. పత్రికతో తన అనుబంధాన్ని విడిచిపెట్టారు. అయినా నూకల నరోత్తమరెడ్డి, రాజా రామేశ్వరరావులతో ఎప్పటి వలెనే స్నేహం సాగింది.

సీమాంధ్ర సాహితీవేత్తల జ్ఞాపకాలు : తెలంగాణ సాహితీవేత్తలు గత శతాబ్ది తొలి దశాబ్దాలలో సీమాంధ్ర ప్రాంతంతో సాహిత్య సంచారాలు సాగించిన దాఖలాలు లేవు. బెజవాడలో 1950లో జరిగిన చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రి ఘన సన్మానానికి ఇక్కడివారు పలువురు అక్కడికి వెళ్ళడమే తొలి సంచారం. నాటి సభా విశేషాల్ని గురించి ఎందరో వ్యాసాలు రచించారు. పలువురు తమ జ్ఞాపకాలలోనూ నాటి సుమధుర ఘట్టాల్ని నమోదు చేశారు. రామానుజరావు జ్ఞాపకాలలోనూ అప్పటి సభా విశేషాలు దొరుకుతాయి. సీమాంధ్ర సాహితీవేత్తలు – ప్రధానంగా కోస్తా ప్రాంతీయులు తరచుగా హైదరాబాద్, వరంగల్లు వంటి ప్రాంతాల్లో సాహిత్య సంచారాలు చేసినట్టు ఆయన జ్ఞాపకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ ప్రాంతంలో సాహిత్యాభిమానులు, సామాన్య ప్రజానీకం సైతం తెలుగు భాషను ఆరాధించడం, సంస్థానాల రాజాదరణ, సంపన్నులైన కొంతమంది చూపించిన ఉదారతలు కారణాలుగా కోస్తాంధ్ర సాహితీవేత్తలు ఈ ప్రాంతాల్లో పర్యటించారు. తమ స్వస్థలాలలోనూ పొందనంతటి ఘన సన్మానాలు అందుకున్నారు. దూపాటి సోదరుల్లో ఒకరైన వెంకట రమణాచార్యులు అటువంటి వారిలో ఒకరు. ఆయన దేవులపల్లికి బాల్యం నుండే పరిచితులు. "దూపాటి వెంకట రమణాచార్యులవారు వరంగల్‌కు వచ్చినపుడు మా యింట్లో అతిథిగా ఉండేవారు. వరంగల్‌కు అనేక పర్యాయాలు వస్తుండేవారు. చిన్నవానిగా ఉన్న నన్ను పలుకరిస్తూ తెలుగు భాషవైపు మనసు మరల్చేవారు" అని రామానుజరావు రాశారు. ఇటువంటి వారే సంపన్మిడుంబ సింగరాచార్యులవారు. ఆయన గురించి రాస్తూ "సంపన్మిడుంబ సింగరాచార్యులవారు అనే పండితులు జగ్గయ్యపేట వాస్తవ్యులు. వారు కూడా ఎక్కువగా కొన్నాళ్ళు వరంగల్ వస్తూండేవారు. భాగవతం ప్రథమ, ద్వితీయ స్కంధాలను ఏకాదశ ద్వాదశ స్కంధాలను వీరుతెనిగించినారు. పోతన వరంగల్ వాస్తవ్యుడైనందున యీ స్కంధాల ప్రచురణ కొరకు ఆర్థిక సహాయ నిమిత్తం వారు వరంగల్‌కు వస్తుండేవారు అనుకుంటాను" అని పేర్కొన్నారు. తరువాత రోజుల నాటి సంగతి.... ప్రసిద్ధ కథానికా రచయిత

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి హైదరాబాద్ వచ్చినపుడు రామానుజరావును కలిసేవారట. ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం సాహిత్య అకాడమీ ప్రారంభమైంది. అది సారస్వత పరిషత్తు ప్రాంగణంలోనే ఉండేదట. అనేక విషయాలపై ఖచ్చితమైన అభిప్రాయాలున్న శ్రీపాద పరిషత్తు కార్యాలయంలోనే కూర్చునేవారట కానీ, అకాడమీ గదిలోకి అడుగుసైతం పెట్టకపోయేవారట! దేవులపల్లి విద్యార్థిగా ఉన్న రోజుల్లో సాక్షి వ్యాస రచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావు హైదరాబాద్‌లో ప్రసంగించిన విశేషాలు ఈ జ్ఞాపకాలలో దొరుకుతాయి. పానుగంటి వారి వేష భాషా విశేషాల్ని కళ్ళకు కట్టినట్టు రచయిత పరిచయం చేశారు. "పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు ఒక పర్యాయము 1937 ప్రాంతంలో యిక్కడికి వచ్చియుండిరి. నెరిసిన వెంట్రుకలతో కాషాయపురంగు అద్దిన షర్టుతో ధోవతితో ఉన్నవారి మూర్తిని నేను సందర్శించడం జరిగింది. నాయనలారా అని ప్రారంభించి సరిగ్గా సాక్షి ఉపన్యాసాలలోని జంఘులశాస్త్రి వలెవారు ప్రసంగించిరి" అని దేవులపల్లి రాశారు. ప్రసిద్ధ విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి హైదరాబాద్ ప్రసంగ స్మృతులను కూడా రామానుజరావు నమోదు చేశారు. ఇట్లా "1938లో కాబోలు కట్టమంచి రామలింగారెడ్డిగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోపన్యాసం యిచ్చిరి. అప్పుడు విద్యార్థుల సంఖ్య తక్కువ. ప్రస్తుత విశ్వవిద్యాలయ భవనాలు ఇంకా నిర్మాణం కాలేదు. ఆరోజుల్లో టౌన్‌హాలుగా ఉండిన ప్రస్తుత శాసనసభ హాలులో స్నాతకోత్సవం జరిగింది. ప్రేక్షకుడిగా నేను వెళ్ళి వారి ఉపన్యాసం మొట్టమొదటిసారిగా విన్నాను. స్నాతకోపన్యాసంలో వారు తెలుగు సాహిత్యాన్ని తెలుగు కవులను పేర్కొని విశ్వవిద్యాలయ భవనాలు నెలకొన్న అడిక్మెట్‌ను అధికమెట్టగా వర్ణించి అధికమెట్ట అనగా విజ్ఞానానికి ఉన్నత శిఖరం, అనే అర్థం చెప్పి వారి సహజధోరణిలో బహు రమణీయంగా మాట్లాడినారు. మరునాడు రెడ్డి విద్యార్థి వసతిగృహంలో జరిగిన సన్మానసభలో వారు తెలుగులో మాట్లాడినారు. వారి ఉపన్యాసధోరణి తిక్కన భారతశైలిని జ్ఞప్తికి చేసేది..." విశ్వనాథ సత్యనారాయణ 1940వ దశకానికి ముందే హైదరాబాద్, వరంగల్లుల్లో సన్మానాలు పొందారు. ఇక్కడి సాహిత్యాభిమానుల్లో కొంతమందికి ఆయన పట్ల విశేషమైన ఆదరణ ఉండేది. విశ్వనాథకు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు దేవులపల్లికి ఉన్నాయి. పాతిక సంవత్సరాల సాన్నిహిత్యమూ ఉంది. కవిసమ్రాట్టుపై దేవులపల్లి అభిమానం ఆయన జ్ఞాపకాలలో ప్రస్ఫుటమవుతోంది. "ఆధునికాంధ్ర కవులలో సత్యనారాయణగారి వంటి

ప్రతిభావంతులు లేరంటే సత్యానికి తలవంపులు కలుగదు" అన్నది రామానుజరావు స్థిరవ్యాఖ్య! మహాకవి గుర్రం జాషువా, అభినవ తిక్కన తుమ్మల సీతారామమూర్తి చౌదరి ఆయనకు బాగా సన్నిహితులు. "జాషువాగారితోనూ, తుమ్మల సీతారామమూర్తిచౌదరి గారితోనూ నాకు జాబుల ద్వారా నెల్లుట్ల రామకృష్ణామాత్యుని ద్వారానే 1941 నుండి పరిచయం. అయితే ఆ ఉభయులకు నేను చివరి వరకు సన్నిహితుడిగా ఉన్నాను. జాషువాగారికి నాపైన ఆదరాభిమానాలు ఉండేవి. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతి పర్యాయం స్వయంగా వచ్చి నన్ను కలుసుకునేవారు. సీతారామ మూర్తిగారు నాటి నుండి నేటి వరకు నాకు పరమ ఆప్తులు. జాషువాగారు, తుమ్మల సీతారామమూర్తిగారు ఉభయులు అమృత హృదయులు. వారి కవిత్వమువలె వారి సహవాసము కూడా మధురమైనది. రసార్ద్రమైనది" అని రామానుజరావు రాశారు. మరుపూరు కోదండ రామిరెడ్డి, బోయి భీమన్న, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, నటి – రచయిత్రి భానుమతి, కాశీకృష్ణాచార్యులు, పుట్టపర్తి నారాయణాచార్యులు, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు వంటి ఎంతోమంది సీమాంధ్ర సాహిత్య ప్రముఖులతో దేవులపల్లికి సాన్నిహిత్యం ఉన్నట్టు ఆయన జ్ఞాపకాలు చెబుతున్నాయి. వీరిలో కొందరిని గురించి ఆయన వ్యాఖ్యానించిన తీరు ఎంతో హృద్యంగా ఉంది. దీపాల పిచ్చయ్యశాస్త్రిని గురించి ప్రస్తావించిన సందర్భంలో "వారితో సంభాషణ విజ్ఞానపు విందు, ఆకారంలో వామనులు, సాహిత్య వేదికల మీద త్రివిక్రములు" అని వ్యాఖ్యానించారాయన. సంగీత– సాహిత్యరంగాలలో గొప్ప విద్వాంసులైన రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ అంటే దేవులపల్లికి నిరుపమానమైన అభిమానం. "అనంత కృష్ణశర్మగారి మూర్తి సుందరమైనది. చిత్తవృత్తి కోమలమైనది. మాట మధురమైనది. శైలి లలితమైనది. హృదయం రసార్ద్రమైనది. వేషం పరిశుభ్రమైనది. శీలము నిష్కళంకమైనది. కొంతమంది ఎంత ప్రతిభావంతులైనను వారితో ఎక్కువ కాలము గడుపలేము. కాని అనంతకృష్ణ శర్మగారితో ఎంతకాలం గడిపినను మరికొంత కాలం వారి సమక్షమున ఉండవలెనని హృదయం కోరుతుండేది" అని రామానుజరావు రాశారు. అనంతకృష్ణశర్మగారి అన్నగారు గోపాలకృష్ణమాచార్యులవారు. దేవులపల్లి ఆయనను కూడా గుర్తు చేసుకొని "గోపాలకృష్ణమాచార్యుల వారికి సాహితీపరునిగ అంత ప్రఖ్యాతి రాలేదు. కాని సాహిత్యంలో వారు తమ తమ్ముడైన అనంతకృష్ణశర్మగారికి ఎంతమాత్రం తీసిపోరు"

అని రాశారు. కాంతం కథల రచయిత మునిమాణిక్యం నరసింహారావు కోస్తాంధ్ర ప్రాంతంలో ఉపాధ్యాయ వృత్తిలో పదవీ విరమణ పొందిన తరువాత తెలంగాణలోని బచ్చన్నపేటలో అదే వృత్తిలో బాధ్యతలు నిర్వహించిన సంగతి రామానుజరావు జ్ఞాపకాలలో దొరుకుతోంది. ఇంకా బలిజేపల్లి లక్ష్మీకాంతం వంటి మరెందరో సీమాంధ్ర కవి పండితుల ప్రస్తావనలు ఈ రచనలో ఉన్నాయి.

తెలంగాణ ప్రముఖులు : తన బాల్యం, యువక మనస్సులో ఉన్న రోజుల్లో తాను చూసిన ఎంతోమంది తెలంగాణ ప్రముఖులను గురించి రామానుజరావు జ్ఞాపకాలలో వివరించి వారి గొప్పతనాన్ని సానుకూలరీతిలో అంచనా వేశారు. తెలంగాణలో ఆధునిక వాఙ్మయ ప్రవేశానికి దారులు ఏర్పరచిన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు పట్ల ఆయనకు అమిత గౌరవం. కొమర్రాజు వారి ప్రస్తావన వచ్చిన ప్రతి సందర్భంలోనూ దీన్ని గుర్తించవచ్చు. కొమర్రాజుకు తెలంగాణ ప్రాంతంలో నిజమైన వారసుడు ఆదిరాజు వీరభద్రరావు. ఆయన విషయంలోనూ రచయిత ఎంతో మన్ననతో కూడిన వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణ వైతాళికులలో ఆదిరాజు వీరభద్రరావుగారిని ప్రత్యేకంగా చెప్పుకొనవలెను. ఆయన తొలిదశలో కొమర్రాజు లక్ష్మణరావు చేతికింద ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ నిర్మాణంలో పని చేసినారు. అందుచేత బహుముఖవిజ్ఞానం, చరిత్ర పరిశోధనలో ఆయన సిద్ధహస్తుడు. హైదరాబాద్ నగరంలోనూ తెలంగాణలోనూ జరిగిన సాహిత్య కృషికి సంస్కృతీ వికాసానికి ఆదిరాజు వీరభద్రరావు దోహదం గొప్పది. తమ జీవితాన్ని పూర్తిగా ఆంధ్ర భాషావ్యాసంగానికి అంకితము చేసిన మహనీయుడు ఆదిరాజు వీరభద్రరావుగారు" అని పేర్కొన్నారు దేవులపల్లి. రచనా వ్యాసంగంలో తనను ఎంతో ప్రోత్సహించిన సురవరం ప్రతాపరెడ్డిని యాది చేసుకున్నారాయన. "ప్రతాపరెడ్డిగారు చూడటానికి కొట్టవచ్చినట్లున్నప్పటికి హృదయం ప్రేమార్ద్రంగా ఉండేది. ఎప్పుడూ ఏదో పుస్తకం చదువుతూ ఉండేవారు. చాలా వేగంగా చదివేవారు. సొంత గ్రంథాలయం నుండి పుస్తకాలు ఎవరికీ ఇచ్చేవారుకాదు. అయినప్పటికీ యిష్టులైన వారి పట్ల ఈ నియమం వర్తించేది కాదు. పుస్తకాలు యెవ్వరికీ యీయబడవని వ్రాసి నావంటి వారికి యే పుస్తకమైనా యిచ్చేవారు. యువరచయితలను ఆయన ప్రత్యేకంగా అభిమానించేవారు. 1940వ ప్రాంతంలో ఆయనతో ఏర్పడిన సన్నిహితత్వం తుదివరకు ఉండినది. ఒక్కమారు మనసిచ్చినారంటే చిరకాలం ఆ ఆప్యాయత నిలచేది. హైదరాబాద్‌లోని

నా కార్యకలాపాలను అన్నింటిని ఆయన సమర్థించినారు" అని రామానుజరావు రాశారు. కాళోజీని గురించి "భాషలోనూ, భావంలోనూ అన్నింటిలోనూ ఆయన ప్రజాకవి" అని దేవులపల్లి అభివర్ణించారు. "భారతదేశానికి గోపాలకృష్ణ గోఖలే ఎటువంటి వాడో నాటి తెలంగాణకు మాడపాటి హనుమంతరావుగారు అటువంటి వారని చెప్పవచ్చు" అంటూ సరిగ్గా అంచనా వేసి చెప్పారు రచయిత. "తెలంగాణంలోని సమస్త జాతీయోద్యమాలకు సర్వ సాంస్కృతికోద్యమాలకు వెన్నెముక మాడపాటి హనుమంతరావుగారు'' అని రచయిత వ్యాఖ్యానించారు. రాజబహదూర్ వెంకటరామారెడ్డికి – మాడపాటి పట్ల గౌరవభావం ఉండేదని రామానుజరావు జ్ఞాపకాలు చెబుతున్నాయి. మాడపాటి, సురవరం వ్యక్తిత్వాలలోని ధీరత్వాన్ని గుర్తుకు తెచ్చే కీలక ఘటనను రామానుజరావు పేర్కొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని జాతీయస్థాయి హిందీ విశ్వవిద్యాలయంగా మార్చేందుకు 1950ల ఆరంభంలో ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇవి అధికార వర్గీయుల అండదండలతో ఊపులోకి వచ్చాయి. ఈ మార్పును ప్రతిఘటించే లక్ష్యంతో రామానుజరావుతో సహా కొంతమంది ఒక పౌరసంఘంగా ఏర్పడ్డారు. అందులో మాడపాటి, సురవరం కూడా సభ్యులు. వారిని అధికార వర్గాలకు చెందినవారు ఇందులో పనిచేయవద్దని గట్టిగా సూచించారు. అయినా వారు ఊరుకోలేదు. క్రియాశీలకంగా పనిచేశారు. తమ వాదాన్ని బలంగా వెల్లడించారు. పులిజాల హనుమంతరావును గుర్తుచేసుకుంటూ పరిషత్తు అభివృద్ధికి సుమారు ఎనిమిది సంవత్సరాలు నిరంతరం కృషి గావించినాడు" అని శ్లాఘించారు రచయిత. హైదరాబాద్ నగరంలో తన చిరకాల మిత్రుడు సియాసత్ ఉర్దూ దినపత్రిక వ్యవస్థాపకులు అబిద్ అలీఖాన్‌ను గురించి ప్రస్తావించిన సందర్భంలో ఆయనను "హైదరాబాద్ సంస్కృతికి ప్రతినిధి"గా అభివర్ణించారు దేవులపల్లి.

నిజాం సర్కారు పాలనా కాలంలోని కీలక దశల్లో ప్రధానులుగా బాధ్యతలు నిర్వహించిన ఇద్దరు ప్రతిభా వంతుల గురించి చాలామందికి తెలియని విశేషాల్ని రామానుజరావు జ్ఞాపకాలు చెబుతున్నాయి. అందులో ఒకరు అక్బర్ హైదరీ. తెలంగాణ ఆధునిక చరిత్రలో 1938వ సంవత్సరానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అదే సంవత్సరం వందేమాతరం ఉద్యమం జరిగింది. ఆర్య సత్యాగ్రహం కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావానికి ముందే నిషేధానికి లోనైంది. ఆ కాలంలో అక్బర్‌హైదరీ

ప్రధాని. గాంధీజీ వంటి జాతీయస్థాయి నాయకులతో సహృద్భావ సంబంధాలను కొనసాగిస్తూనే తెలంగాణలో చోటుచేసుకున్న ప్రజా ఉద్యమాల్ని అణచివేయడం కొనసాగించిన వ్యక్తి అక్బర్ హైదరీ. ఆయన లౌక్యం ఎటువంటిదో రామానుజరావు జ్ఞాపకాలు తేటతెల్లం చేస్తున్నాయి. పెద్దగా గుర్తింపురాని ప్రతిభావంతుడైన మరో ప్రధాని సర్ మీర్జా ఇస్మాయిల్. ఆయనకు దేశభాషల పట్ల ఎంతటి అభిమానం ఉన్నదో దేవులపల్లి అనుభవాలు చెబుతున్నాయి. వరంగల్లులో తాము నిర్వహించాలనుకున్న గ్రంథాలయానికి వ్యక్తిగత స్థాయిలో ఆరోజుల్లో (1930వ దశకం) మీర్జా ఇస్మాయిల్ 116 రూపాయలు విరాళంగా ఇచ్చారని ఆయన రాశారు. గ్రంథాలయాలను సర్కారువారు అనుమానంతో చూస్తున్న సమయంలో సాక్షాత్తు సంస్థాన ప్రధానమంత్రి ఈ విరాళాన్ని అందించేందుకు ముందుకు రావడం గొప్ప సంగతి! సారస్వత పరిషత్తు అభివృద్ధి కోసం గొప్ప చేయూతనందించిన ఆనాటి రాష్ట్ర మంత్రులు పూల్‌చంద్ గాంధీ, జి.ఎస్.మేల్కొటేల సౌజన్యాన్ని రామానుజరావు కృతజ్ఞతతో ప్రస్తావించారు. "పూల్‌చంద్ గాంధీగారు మరాఠ్వాడా ఉస్మానాబాద్ ప్రాంతీయులు. బి.ఏ., ఎల్.ఎల్.బి. పట్టభద్రులు. సంస్కృత భాషాభిమాని. మాతృభాషల వికాసానికి ప్రత్యేకంగా తోడ్పడినారు. ఆర్థిక మంత్రిగా ఉన్న జి.ఎస్.మేల్కొటేగారు పరిషత్తుకు తోడ్పడినారు" అని దేవులపల్లి పేర్కొన్నారు.

విశాలాంధ్ర ఏర్పాటుకంటే కొంత ముందు నుండే రామానుజరావుకు కోస్తాంధ్ర-రాయలసీమ ప్రాంతాలకు చెందిన ప్రసిద్ధ నాయకులతో దగ్గరి పరిచయాలు ఉండేవి. వారిని ఆయన సన్నిహితంగా చూశారు. వారి వ్యక్తిత్వాల్లోని విలక్షణతను గుర్తించారు. దాన్ని గుర్తు పెట్టుకొని తన జ్ఞాపకాలలో నమోదు చేశారు. నిస్వార్థ ప్రజా సేవకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావును గురించిన ప్రస్తావనలు జ్ఞాపకాలలో ఉన్నాయి. తెలంగాణలో కొమర్రాజు ప్రారంభించిన వాఙ్మయకృషికి హరిసర్వోత్తమరావు తోడ్పడ్డారని ఆయన అంచనా. పండిత రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు తెన్నేటి విశ్వనాధం పట్ల దేవులపల్లికి ఎంతో మన్నన ఉంది. కాంగ్రెస్ చరిత్రను రచించి డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య బహుముఖ ప్రజ్ఞపై ఆయనకు ఎంతో అభిమానం. పట్టాభి ప్రశంస జ్ఞాపకాలలో ఉంది.

సారస్వత పరిషత్తు : రామానుజరావు జీవితంలో సింహభాగం సారస్వత పరిషత్తు వికాసానికి వలె స్థిరపడేవరకూ సాగిన కాలక్రమంలో ఆయనది క్రియాశీలపాత్ర.

పరిషత్తు క్రమవికాసం, పరిషత్తు నిర్వహించిన గొప్ప సభలు, తెలుగు సీమలో భాషా వికాసానికి పరిషత్తు అందించిన దోహదం - ఇవన్నీ రామానుజరావు జ్ఞాపకాలలో సుస్పష్టంగా దొరుకుతాయి. పరిషత్తును పరిచయంచేసే సందర్భాలలో రామానుజరావు వచన శైలిలో ఉద్విగ్నత కనిపించడం ఆయనకూ ఆసంస్థకూ ఉన్న అవినాభావ అనుబంధాన్ని చెబుతోంది. అనేక సందర్భాలలో పరిషత్తు ప్రస్తావనలున్నా (60వ పుట) ఒకచోట సంస్థ తాలూకు విశాల దృశ్యం పరిచయమైంది. ఆయన చేసిన పరిచయాన్ని స్వీయ వాక్యాల ద్వారానే తెల్పడం సముచితం. ఆయన ఇట్లా రాశారు.

"ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక విశిష్టమైన సంస్థ. ఏ ప్రత్యేక సాహిత్య సంప్రదాయానికీ కట్టుబడిన సంస్థ కాదు ఇది. అది ప్రాచీనమైన సాహిత్యానికి అతి నవీనమైన సాహిత్యానికి సుస్వాగతమిచ్చి ప్రోత్సహించే విశాల భావపూరితమైన సంస్థ. కేవలం సమావేశాలు జరిపి పుస్తక ప్రచురణ మొదలైన కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైన సంస్థ కాదిది. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు అవతరించి ఆ ధ్యేయంలోనే నాటి నుండి నేటి వరకు ఎటువంటి ఆటంకాలు వచ్చినా ఎవరిని ఎదిరించవలసి వచ్చినా వెనుకాడక ముందుకు నడుస్తున్న సంస్థ యిది.

అప్పుడు నిజాం ప్రభుత్వంతో సంఘర్షణ పడిన సారస్వత పరిషత్తుకు పోలీసు చర్య తరువాత కూడా కొన్ని సందర్భాలలో అధికారంలో ఉన్నవారితో సంఘర్షణలు తప్పలేదు. అయినప్పటికి తన యాత్రను విజయవంతంగా కొనసాగిస్తూ వాఙ్మయ ఉద్యమాన్ని విజయవంతంగా సారస్వత పరిషత్తు నడిపించినది. ఆర్థికపరమైన ఇబ్బందులను కూడా పరిషత్తు ఎదుర్కొనవలసి వచ్చినది. తమ స్వప్రయోజనాల కొరకు సంస్థను ఉపయోగించుకొనవలెనని ప్రయత్నం చేసిన కొందరి పన్నాగాలను తప్పించుకొని పరిషత్తు బయటపడినది. అందుచేతనే ఎవరికి ఆగ్రహం వచ్చినా ఎవరికి అనుగ్రహం వచ్చినా లక్ష్యం చేయక పురోగమించడానికి అనువుగా పరిషత్తు గడిచిన రెండు దశాబ్దాలలో పరిమిత స్థాయిలోనైనప్పటికీ ఆర్థికస్వయం సమృద్ధిని సాధించుకొన్నది.. ఆంధ్ర భాషా సంస్కృతుల వ్యాప్తి కొరకు కృషి చేసే సంస్థలకు ఉద్యమాలకు పరిషత్తు సర్వవిధాలా సహాయం చేసి బలపరిచింది. వివిధ జిల్లాలలో వివిధ ప్రాంతాలలో కేంద్రాలను శాఖలను స్థాపించుకొన్నది. రాష్ట్రేతర ప్రాంతాలలోనూ మారిషస్ వంటి విదేశంలోనూ తన కార్యక్రమాలను అమలుచేసి తెలుగు దీపాన్ని వెలిగించింది. ఆంధ్ర సారస్వత పరిషత్తులో వివిధ సమస్యలపైన భిన్నాభిప్రాయాలు కలవారు, రాజకీయంగా, సాంఘికంగా ప్రత్యేక దృక్పథం కలిగినవారు అందరు

సహకరించినారు. కావుననే సారస్వత పరిషత్తు ప్రజల సంస్థ. జాతీయసంస్థ. తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణ కొరకు అంకితమైన సాంస్కృతిక సంస్థ. నాటి నుండి యీ పరిషత్తు నిరంతరాయంగా అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తూ భాషారంగంలో కీలకమైన కృషి చేసినది..."

నిజాం కళాశాల స్మృతులు : ఆనాటి హైదరాబాద్ సంస్థానంలో తొట్టతొలి ఆధునిక ఉన్నత విద్యాసంస్థ నిజాం కాలేజి. మదరాసు విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలగా ఇది 1887లో ప్రారంభమైంది. అంతకంతకూ ఎదిగింది. ఈ కళాశాలలో చదివిన మొదటి తరం పట్టభద్రులలో పలువురు ఉన్నత ఆర్థిక వర్గాలకు చెందినవారు. రామానుజరావు 1930వ దశకంలో ఈ కాలేజీలో చదువుకున్నారు. అప్పట్లో వరంగల్లులో ఉన్నత విద్యావకాశాలు లేవు. అందువల్ల ఎం.ఎస్. రాజలింగం, బండారు చంద్రమౌళీశ్వరరావు, దేవులపల్లి వంటి వరంగల్లు విద్యార్థులు ఇక్కడ చదివారు. ఆనాటి నిజాం కాలేజి వైభవాన్ని గురించి తెలుసుకోవాలంటే రామానుజరావు జ్ఞాపకాలను తప్పక చదవాలి. నిజాం కాలేజి ఆనాటి గొప్పతనాన్ని ఇంత వివరంగా పరిచయం చేసిన జ్ఞాపకాల సంపుటి ఇంకొకటి తెలుగులో లేదు. అక్కడి వివిధ విభాగాలలో పనిచేసిన కురుగంటి సీతారామయ్య, అరుణాచలశాస్త్రి, రామనరసు, శిరిగూరి హనుమంతరావు వంటి మేధావుల నిరుపమాన ప్రజ్ఞ రామానుజరావు రచనతో స్పష్టపడింది. నాడు హైదరాబాద్ నగరానికి విచ్చేసిన పలువురు వివిధ ప్రాంతాల మేధావులు, రాజనీతిజ్ఞులు, శాస్త్రవేత్తలు నిజాం కాలేజిలో ప్రసంగించే వారని దేవులపల్లి జ్ఞాపకాలు చెబుతున్నాయి. ఆయా ప్రముఖుల వ్యక్తిత్వ – ఉపన్యాస వైభవాల్ని రామానుజరావు కళ్ళకు కట్టినట్టు పరిచయం చేశారు. సి.వి.రామన్ ప్రపంచ ప్రఖ్యాత భౌతికశాస్త్రవేత్త, నోబెల్ పురస్కారగ్రహీత. ఆయన ఆగమనాన్ని వర్ణిస్తూ "నాకు బాగా జ్ఞాపకమున్నది. అప్పుడే పదార్థ విజ్ఞానశాస్త్రానికి జగత్ ప్రసిద్ధమైన నోబెల్ బహుమతి పొందిన చంద్రశేఖర వెంకటరామన్ (సి.వి.రామన్) ఒకమారు హైదరాబాద్ వచ్చిరి. వారి ఉపన్యాసం ఒకటి నిజాం కళాశాలలో ఏర్పాటు జరిగినది. రామన్‌గారు ప్రభుత్వానికి అతిథులు. ఉపన్యాస సమయానికి అయిదు నిమిషాల ముందుగానే సర్ అక్బర్ హైదరీగారు నిజాం కళాశాలకు వచ్చి పోర్టికోలో నిలిచి కారురాగానే ఎదురేగి స్వాగతమిచ్చి కరచాలనం చేసి లోపలికి తీసుకొనివచ్చి పూలమాలను వేసి స్వయంగా సభకు అధ్యక్షత వహించినారు" అని రాశారు దేవులపల్లి. తిరువాన్కూర్ సంస్థాన దివాన్‌గా బాధ్యతలు నిర్వహించిన సి.పి.రామస్వామి అయ్యర్

కూడా నిజాం కాలేజిలో ప్రసంగించారు. "రామస్వామి అయ్యర్ గారిది కుశాగ్రబుద్ధి, సర్వతోముఖమైన ప్రతిభాసంపద, ఇంగ్లీషు, ఫ్రెంచ్, సంస్కృతము, తమిళ భాషలలో అనర్గళంగా మాట్లాడగలిగిన వచోవిలాసం' అని రాశారు రామానుజరావు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, సరోజినీ నాయుడు, ఆచార్య నరేంద్రదేవ్ దువ్వూరి సుబ్బమ్మ, తేజ్ బహమదూర్ సప్రూ వంటి వారి వ్యక్తిత్వ విశేషాల్ని నిజాం కాలేజి జ్ఞాపకాలతో సమ్మిళితం చేసి వివరించారు రామానుజరావు.

తెలంగాణ సాహితీ జగతి : తెలంగాణలోని మూడు తరాలకు చెందిన సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులతో రామానుజరావుకు సాన్నిహిత్యం ఉండేది. వారిలో కొందరిని పేరుపేరునా గుర్తు చేశారు రచయిత. దేశోద్ధారక గ్రంథమాల వ్యవస్థాపకులు, ప్రజల మనిషి నవలాకర్త వట్టికోట ఆళ్వార్ స్వామి రచనల్లో తెలంగాణ రాజకీయ సాంఘిక జీవితం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ప్రసిద్ధ కథా రచయిత బూర్గుల రంగనాథరావు చక్కని కవి కూడా అని రాశారు. నెల్లుట్ల కేశవస్వామిని కథానికా రచయితలలో ప్రథమ శ్రేణికి చెందిన వారుగా ప్రశంసించారు. వానమామలై వరదాచార్యులవారి కవితా ప్రతిభను, గాన మాధుర్యాన్ని శ్లాఘించారు. వెల్దుర్తి మాణిక్యరావు, ధరణికోట శ్రీనివాసులుల రచనా ప్రతిభను గుర్తుచేశారు. పొట్లపల్లి రామారావు, భాస్కరభట్ల కృష్ణారావు, బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి వంటి ఆనాటి తరం ప్రతిభావంతుల స్మృతి స్రవంతి ఈ జ్ఞాపకాలలో దొరుకుతోంది. విప్లవభావాలతో ఆధునిక ఉర్దూ కవితకు వినూత్న సౌందర్యాన్ని సాధించిన మగ్దూం మొహియుద్దీన్ ప్రతిభా వ్యక్తిత్వాల్ని రామానుజరావు ప్రశంసించారు. ప్రసిద్ధ పరిశోధకులు బిరుదురాజు రామరాజు, ప్రముఖ కవులు సినారె - దాశరథి- ఇట్లా పలువురి ప్రస్తావనలు దేవులపల్లి జ్ఞాపకాలలో ఉన్నాయి. "డాక్టర్ దాశరథి, డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యరంగంలో రామలక్ష్మణుల వంటివారు" అని రామానుజరావు వ్యాఖ్యానించారు.

వయసులో తనకంటె కొంచెం పెద్దవారయిన కొంతమంది తెలంగాణ కవి పండితుల విశిష్టతల్ని రామానుజరావు పేర్కొన్నారు. ఆంధ్ర బిల్హణ బిరుదాంకితులైన కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, సంస్కృత విద్వాంసులు, సుదీర్ఘకాలం పాటు ఆకాశవాణిలో సంస్కృత పాఠాలు బోధించిన కేశవపంతుల నరసింహశాస్త్రి, బహుభాషా పండితులు అయితంరాజు కొండలరావు, సంస్కృతాంధ్ర విద్వాంసులు మాదిరాజు విశ్వనాథరావు ఇట్లా పలువురి ప్రస్తావనలున్నాయి ఈ జ్ఞాపకాలలో.

నవనీత విమర్శ

ఆధునిక విమర్శనారీతులు కొంత ఆలస్యంగానే తెలంగాణలో ప్రారంభమయ్యాయని వ్యాఖ్యానిస్తే అది దోషమేమీ కాదు. ఇందుకు అవసరమైన సూత్రం కూడా సులువైనదే. ఆధునిక సాహిత్య విమర్శకు పునాదులు ఇంగ్లీషు సాహిత్య విమర్శలోనే ఉన్నాయి. తెలంగాణలో ఇంగ్లీషు సాహిత్య ప్రభావం బాగా ఆలస్యంగానే వ్యాపించింది. అదీ తొలిదశలో చెదురుమదురు రీతిలోనే ఉంది. ఆధునిక విమర్శ తెలంగాణలో ఆలస్యంగా ప్రారంభంకావడం ఈ ప్రాంతపు సాహిత్య బలహీనత అనుకోకూడదు. అది ఆనాటి పరిస్థితుల పర్యవసానం, అంతే. తెలంగాణలో ఆధునిక విమర్శా సంస్కృతికి పాదులు వేసినవారు బూర్గుల రామకృష్ణారావు అన్నది కొందరి అభిప్రాయం. ఆయన వాఙ్మయ వ్యాసాలు "సారస్వత వ్యాసముక్తావళి"గా వెలువడ్డాయి. అయితే అందులో అన్ని వ్యాసాలూ సాహిత్య విమర్శకే పరిమితమైనవి కాదు. ఎంకిపాటలపై బూర్గులవారి విశ్లేషణ మాత్రం ఆధునిక విమర్శకు బాగా సన్నిహితమైంది. ఈ వ్యాసం కోస్తాంధ్ర విద్వాంసుల ప్రశంసల్ని కూడా అందుకున్నది. సురవరం ప్రతాపరెడ్డి, దూపాటి వేంకటరమణాచార్యులు, ఆదిరాజు వీరభద్రరావులు సాహిత్య విమర్శా వ్యాసాలు రచించారు. అయితే వారి దృష్టి ప్రధానంగా పరిశోధనాత్మకమైంది. రాయప్రోలు సుబ్బారావు కొన్ని విలువైన సాహిత్య విమర్శలు చేశారు, కానీ ఆయన తెలంగాణ ప్రాంతానికి చెందినవారు కాదు. ఇదీ 1940 నాటికి తెలంగాణ ప్రాంతంలోని సాహిత్య విమర్శా ప్రక్రియ స్థితి. సరిగ్గా ఈ తరుణంలోనే సాహిత్య విమర్శావ్యాస రచనను ప్రారంభించారు దేవులపల్లి రామానుజరావు. ఆ రంగంలో రమారమి పాతిక సంవత్సరాలపాటు కొనసాగిన సాహితీవేత్త ఆయన. విద్యార్థి దశలో ప్రారంభమైన విమర్శావ్యాస పరంపరను సాహిత్య వ్యాసాలు, రేడియో ప్రసంగాలు, వివిధ సభల్లో చేసిన ప్రసంగాల ద్వారా ఆయన కొనసాగిస్తూ వచ్చారు. సంప్రదాయ సాహిత్యానికి లేదా ఆధునిక సాహిత్యానికి మాత్రమే ఆయన విమర్శలు పరిమితం కాలేదు. కొన్ని విమర్శా వ్యాసాల్ని అన్యభాషా సాహిత్యాలపై కూడా రచించారు. **తనదైన స్వీయశైలి, నిరంతర అధ్యయనం, రచనలకు**

మాత్రమే పరిమితమై రచయితల గురించి వ్యాఖ్యానించని సహృదయత - రామానుజరావు విమర్శావ్యాసాలకు వన్నె తెచ్చాయి. రచనలోని గుణాల్ని మాత్రమే చూసే ఆయన విమర్శనా దృష్టిని రాళ్ళపల్లి అనంతకృష్ణవర్మ వంటి సాహిత్యదిగ్గజాలు సైతం ప్రశంసించడం విశేషం.

రామానుజరావు సాహిత్య విమర్శా వ్యాసాలశైలి ప్రత్యేకమైంది. వ్యాసమంజూష (1956) వ్యాస సంకలనానికి మున్నుడిని అందిస్తూ "శ్రీరామానుజరావుగారి శైలి ప్రత్యేకమైనది. వీర రచనల ప్రాశస్త్యమునకు విషయ వివేచనా శక్తితోపాటు మనోజ్ఞశైలి ప్రధానకారణము. శబ్దార్థములకు గల సత్యసన్నిహిత సంబంధమును చక్కగా నెరిగిన వారగుట వలన అర్థవంతములగు అలతియలతి పదములతో సుందర వాక్యనిర్మాణము నందును తాము చెప్పదలచుకున్న భావమును సూటిగ సుస్పష్టముగ మనస్సునకు తాకునట్లు వ్యక్తీకరించుటలోనూ సిద్ధహస్తులు" అని ప్రసిద్ధ సాహితీవేత్త గడియారం రామకృష్ణశర్మ ప్రశంసించారు. సారస్వత నవనీతములో రామానుజరావు విశిష్ట వచనశైలిని నిరూపించే వాక్యాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఇక్కడ ఉదాహరిస్తే :

"కవిత రసికజన చకోరములకు పూర్ణచంద్రోదయము. కళాపుష్ప వాటికాంతరమున బ్రవేశించి యందలి యరవిరిమొగ్గలను అరవిచ్చిన సుందర సుమచయమును కోరికదీర గోసికొని వాని సౌందర్య సౌరభ్యముల మనసార ననుభవించి తన్మయులై యానందమున నోలలాడు అనుభవము రసార్ద్ర హృదయులది" (నవ్య కవితా నీరాజనము; సారస్వతనవనీతములోని వ్యాసం, పుట 102)

"ఆంధ్రావనిలో పద్యరచనకు బహుళ ప్రచారము కల్పించినవారు తిరుపతి వేంకటకవులు. గంగా ప్రవాహమునుబోలు వీరి కవితావాహిని యందు స్నానమాడి సాహితీ దేవాలయమున ఖండకావ్య కుసుమములతో ప్రవేశించిన వారు నవ్యాంధ్ర కవికుమారులు" (పై రచన పుట 115)

"వీరి శైలియు (అంటే ఆధునిక కవులు) క్రొంగొత్త సొబగులచే విలసిల్లును. శ్రీవల్లి సుఖము నొసంగు మృదుల సరళాక్షర సమ్మేళనము వారి శైలికి విలక్షణ గుణము" (పై రచన పుట 125)

"సుబ్బారావుగారు పాయలు పాయలుగా విడిపోయిన తెలుగు కన్నియ ముంగురులకు వేణీయోగ్యాభరణముగా జడకుచ్చులల్లి యిచ్చినారు. ఆమె మణిబంధమందు తృణకంకణమును భక్తితో నమర్చినారు. మరికొన్ని కావ్య కుసుమములను మాలికగా గూర్చి యామె కంఠమున వేసినారు..." (పై పుస్తకం పుట 128)

ఆలంకారికత ప్రస్ఫుటమవుతూ కవితాత్మకరీతిలో ఉండే ఈ శైలి రామానుజ రావుకు విద్యార్థి దశలోనే అలవడింది. అనంతర రచనల్లో అలంకారికత కొంత సన్నబడినా ధారాశుద్ధి మాత్రం అట్లాగే ఉండిపోయింది. ఆనాటి ఆయన శైలిలో కవితాత్మకరీతికి రెండు కారణాలు కనబడతాయి. ఆయన నాగపూర్‌లో విద్యార్థిగా ఉన్న కాలంలో ఆధునిక తెలుగు కవిత్వాన్ని తదేక దీక్షతో అధ్యయనం చేశారు. అందువల్ల భావకవుల చక్కని కవితా వైఖరి ఆయనకు తెలియకుండానే వచనశైలిలో ప్రవేశించింది. ఇక రెండవ కారణం, ఆనాడు ఆయన భావుకత మూర్తీభవించిన యువకవి కూడా. పచ్చతోరణములోని కొన్ని ఖండికలు నాగ్‌పూర్ విద్యార్థిగా ఉన్నపుడు రచించినవే. కేవలం సాహిత్య విమర్శకులుగా ఉండేవారికీ, కవితారచన చేసి సాహిత్య విమర్శలోనూ కృషి చేసేవారికీ శైలిలో తారతమ్యతలు ఉంటాయి. ఇది చాలామందికి తెలిసిన సత్యమే. అదే ఇక్కడ కూడా కనబడుతుంది. ఆలంకారిక కవితాత్మక వచనాన్ని రచించిన రామానుజరావు ఉద్విగ్న హృదయంతో కవితా రచన చేసిన కవి కూడా.

రామానుజరావు అన్ని ప్రక్రియలపై విమర్శా వ్యాసాలు రచించలేదు. నవల, కథానిక, నాటకం వంటి పలు ప్రక్రియలపై ఆయన పలు ఆలోచనాత్మక వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి కవితా సంబంధమైన విమర్శా వ్యాసాల్లో అడపా దడపాచోటు చేసుకున్నవే. ఆయన ప్రధానంగా కవితాప్రక్రియను గురించే విమర్శలు రచించారు. సంప్రదాయ సాహిత్య విమర్శలు రచించినా ఆధునిక కవిత్వంపైనే ఆయన ఆసక్తి అధికమని "సారస్వత నవనీతము"లోని వ్యాసాల తీరు స్పష్టం చేస్తోంది.

దేవులపల్లి వలె ఆధునిక తెలుగు కవిత్వ విమర్శపై దృష్టి నిలిపినవారు 1940వ దశకంలో మరికొందరూ వున్నారు. అయితే, ఆధునిక తెలుగు కవిత్వంలోని వినూత్నతను గురించి ఒక క్రమ పరంపరగా ధారావాహిక వ్యాసాలు రచించిన వారు మాత్రం కనిపించరు. ఆయన ఈ దిశలో రచించిన నాలుగువ్యాసాలు (కవిస్రష్ట, నవయుగోదయము - ఖండకావ్యములు, అభ్యుదయయుగము) రామానుజరావును

తెలుగు విలక్షణ విమర్శకుల పంక్తిలో నిలబెడతాయి. ఇవి తెలంగాణ తొలి తెలుగు దినపత్రిక "తెలంగాణ"లో తొలుత ప్రచురణను పొందాయి. అది 1940వ దశాబ్ది ఆరంభకాలంనాటి పత్రిక. కొద్ది మాసాలు మాత్రమే ప్రచురణను పొందింది. ఆంధ్రాంగ్ల పాత్రికేయులు బుక్కపట్టణం రామానుజాచార్య తెలంగాణ పత్రిక సంపాదకులు. విద్యార్థి దశలో ఉన్న రామానుజరావు సాహిత్య విమర్శావ్యాసాల్ని ప్రచురిస్తూ అంకురదశలో ఆయనకు ప్రోత్సాహాన్ని కల్పించిన పత్రిక "తెలంగాణ".

ఇక్కడ పేర్కొన్న నాలుగువ్యాసాలలోని తొలివ్యాసం "కవిస్రష్ట" విశేషాలు ఇవి:

దేవులపల్లి అభిప్రాయాలు ఇందులో సుస్పష్టంగా ఉన్నాయి. అయితే తొలివ్యాసం కావడం వల్ల కావచ్చు కొన్ని అభిప్రాయాలు ఇంకా శైశవావస్థలోనే కనిపిస్తాయి. అయితే, ఆయన అవగాహనా రీతి మాత్రం వైవిధ్యవంతమైంది. "కవిలోని ఆవేశమే కవితా సృజనకు హేతువు అవుతుంది" అన్న అభిప్రాయాన్ని ప్రస్ఫుటంగా ప్రకటించారు. తరువాత వ్యాసాల్లో ఇందుకు కావలసిన ఉదాహరణలు దొరుకుతాయి. "ప్రతి సందర్భంలోనూ కొత్తదనం కనిపించడం కావ్య రహస్యం" అన్న వ్యాఖ్యలో పెద్దగా నవ్యతలేదు. అయితే "ఆనందం భావంలో సౌందర్యం శైలిలోనూ ఇమిడి ఉంటుంది" అన్నపుడు పాత నిజాన్ని కొత్తగా చెబుతున్న తీరు స్పష్టమవుతుంది. "భావమునకు రసమునకు జన్య జనకసంబంధము గలదు. కవిత యందు భావ ప్రాధాన్యమును, ఉద్రేక ప్రాముఖ్యమును స్పష్టీకరించుట కొరకే నవ్యకవితకు భావకవిత్వమను నామాంతర మొసగినారు ఆధునికులు" అన్న నిర్వచనంలో సూటిదనం ఉంది. మళ్ళీ, శబ్దార్థ సంబంధాల్ని గురించి చెబుతున్నప్పుడు అది సాధారణ విమర్శకుని స్థాయికే చేరుతుంది. "కవిత్వానికి ఆనంద సాధనే ప్రధానము" అన్న అభిప్రాయాన్ని రామానుజరావు స్పష్టంగా ప్రకటించారు. నీతిబోధకు ఆనందస్థాయి ప్రాధాన్యతను ఇవ్వవలసిన అవసరం లేదని ఆయన అభిప్రాయం. మార్పు అన్నది లేకపోతే సాహిత్యపు స్థితిగతులు యదాతథరీతిలోనే ఉంటాయి కనుక మార్పునకు స్వాగతం పలికారు రామానుజరావు. తెలుగు వాఙ్మయమున మార్పునకు త్రోవ జూపినవారు అంటూ నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, సోమన, శ్రీనాథుడు, పెద్దన, పింగళి సూరనల్ని పేర్కొన్నారు. ఈ వరుసను చూసినపుడు అది అలవోకగా చేసిన ఎంపిక కాదనీ, ఈ ఎంపికలో నిశితమైన వివేచన దాగి ఉందనీ అర్థమవుతుంది. ఈ వరుసను చూస్తే చాలు రామానుజరావులో ప్రామాణిక విమర్శకత్వం ఉన్నదని చెప్పవచ్చు. ఈ విశ్లేషణలు

విద్యార్థి దశలో చేసినవనే సంగతిని మరచిపోకూడదు. వ్యాసం మొత్తం మీద ఆధునిక కవిత్వం నుండి ఎంపిక చేసుకున్న కవితా పంక్తులు ఉండడం ఆధునిక తెలుగు కవిత్వంపై రామానుజరావు సాధించిన సాధికారికతను చెబుతున్నాయి. రామానుజరావు ఈ వ్యాసాలు రాస్తున్న కాలానికి కందుకూరి వీరేశలింగం సాగించిన సాహిత్య సృజనకు సంబంధించి విస్తారమైన ప్రశంసలు వెలువడుతున్నాయి. కొంతమంది 'వీరేశలింగయుగం' అని కూడా ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఒక యుగానికి నామకరణం చేశారు. సాహితీజగతిలో పరివర్తన కోసం వీరేశలింగం పరిశ్రమించిన తీరు ఆనాటి యువసాహితీలోకానికి స్ఫూర్తిగా నిలిచింది. తన తరం యువతవలెనే రామానుజరావు కూడా వీరేశలింగంను అభిమానించారు. ఈ అభిమానం వల్లనే "కవిస్రష్ట" వ్యాసంలో, అటు తరువాత "నవయుగోదయము"లోనూ ఆయనపై గొప్ప ప్రశంసావ్యాఖ్యలు పలికించింది. "వీరేశలింగం గద్యతిక్కన, అపరనన్నయ; ఆంధ్ర సాహితీ పునరుద్ధరణ ప్రభావుడు" అన్నది రామానుజరావు వ్యాఖ్య. నవయుగోదయము వ్యాసంలో "శ్రీ వీరేశలింగ యుగమున సాహిత్యలక్ష్మి నూత్నశోభలతో విలసిల్లినది" అన్నారు. "నవ్య కవితా నీరాజనము" పరంపరలోని తొలి వ్యాసం 'కవిస్రష్ట'లో ఒకే ఒక్క వచనపు ఉటంకింపు ఉంది. అది రామానుజరావు బాగా అభిమానించిన రాయప్రోలు సుబ్బారావు వ్యక్తం చేసిన అభిప్రాయం.

రెండవ వ్యాసం "నవయుగోదయము"లో "గురజాడ అప్పారావుగారికి మార్గదర్శకమైనది శ్రీ వీరేశలింగంగారి అమృతలేఖనియే" అని రామానుజరావు అభిప్రాయపడ్డారు. ఆయన ఈ వ్యాసం రచించిన రోజుల్లో కొంతమంది విమర్శకులకు ఆ అభిప్రాయం ఉండేది. అయితే నాడు బలంగా ఉన్న ఈ అభిప్రాయాన్ని ఇన్ని దశాబ్దాల తరువాత అందరూ ఆమోదించకపోవచ్చు. కట్టమంచి రామలింగారెడ్డిని ఆధునిక విమర్శకు కొత్త పద్ధతులు తెచ్చిన సూత్రధారిగా భావించడం నేటికీ తెలిసిన సత్యమే. రామానుజరావు కట్టమంచితోపాటు రాళ్ళపల్లిని కూడా పేర్కొన్నారు. (కవిత్వతత్త్వ విచారము, అనంతకృష్ణశర్మగారి వ్యాసములు సాహితీ విమర్శనమున కొత్త పద్ధతులను ప్రవేశపెట్టినవి. పుట 113- సారస్వత నవనీతము) - వాఙ్మయ వికాసం కోసం కృషి చేసిన కొమర్రాజు వేంకటలక్ష్మణరావు, వేదం వేంకటరాయశాస్త్రి, గిడుగు రామమూర్తి, జయంతి రామయ్య, చిలుకూరి వీరభద్రరావుల పట్ల రామానుజరావు వ్యాఖ్యలు సానుకూల దృష్టితో కూడినవి. వారి విద్వత్ విశేషాల్ని

సహేతుక వ్యాఖ్య ద్వారా వెల్లడించారు. నవ్యాంధ్ర కవిత్వ సృజనకు ప్రేరణగా నిలిచిన ఆంగ్ల కవులు; నవ్యాంధ్ర కవులపై భారతీయ ప్రభావాల వంటి సంక్లిష్ట అంశాల్ని రామానుజరావు ఎంతో సరళరీతిలో ఇట్లా విశ్లేషించారు. (ఆనాటికి ఈ దిశలో విస్తారమైన పరిశీలనలు జరగలేదనే వాస్తవాన్ని గమనించాలి)

"నవ్యాంధ్ర కవితకు ముఖ్యాంగ్ల సాహితీ ప్రోద్బలములు వర్డ్స్ వర్త్, షెల్లీ కోట్స్ రచనలని చెప్పవచ్చును. వర్డ్స్ వర్త్ ప్రకృతి ప్రేమ, ప్రకృత్యుపాసన కీట్సు భావ సౌందర్యము భాషా మాధుర్యము అభినవాంధ్ర కవి కుమారులయందు పుష్కలముగా లభించును. ఈ ముప్పురు కవుల కావ్యరీతులందలి శ్రావ్యమగు సంగీత ధ్వని మన యాధునికాంధ్ర కవుల రచనల యందుగానవచ్చును. పైన బేర్కొనబడిన యాంగ్లకవి కుమారుల యందు నీతికన్న రసపోషణకే యగ్రతాంబూలము. పరాసు (ఫ్రెంచి) విప్లవమునకు ఆంగ్ల వాఙ్మయమునకు గల సంబంధము వంటిదే గాంధీ తత్త్వమునకు మన నవ్యకవి కుమారుల స్వాతంత్ర్య భావములకు గల సంబంధము. ప్లేటో తత్త్వము ఆంగ్ల భావకవి కుమారుల నేవిధముగా నాకర్షించి వారి ప్రతిభకు దోహద మొనరించేదో అదేవిధంగా వైష్ణవ గీతముల భక్తి ప్రేమలు మన కవుల భావనా శక్తిని విజృంభింపజేసినవి" (పుట 118–సారస్వత నవనీతము)

అభినవ కవితలో ప్రభావాలు ఉన్నాయి కానీ అవి అంధ అనుకరణలు కావన్న అభిప్రాయంలోనూ నైశిత్యమే ఉంది. "అతి లలిత శృంగారము, మిగుల సున్నితత్వము" నవ్యకవితలోని గొప్ప గుణాలుగా రామానుజరావు పేర్కొన్నారు. సమకాలీనమైన నవీన భావాలు, సామ్యవాదము, హరిజన సమస్య, ఖద్దరు, వైరాగ్య రాహిత్యము, రాజస గుణ ప్రాధాన్యము నవ్యకవితా లక్షణాలుగా ఆయన గుర్తించారు. వీటిని తరువాత తరం విమర్శకులు పూర్తిగా అంగీకరించకపోవచ్చు. కానీ ఆ విశ్లేషణలో ఉన్న లోతును మాత్రం ప్రశంసించవలసిందే. రామానుజరావు ఈ వ్యాసంలో ప్రధానంగా కవితా ప్రక్రియపైనే దృష్టి సారించారు. నవల, నాటకం వంటి అంశాలను అతి క్లుప్తంగా ప్రస్తావించి విడిచిపెట్టారు. నిజానికి ఈ వ్యాసాన్ని "నవ యుగోదయము" అనడం కంటే "నవకవిత్వయుగోదయము"గా పిలవడమే సబబు.

రామానుజరావు విమర్శకుడిగా పరిణతి చెందినట్టు ఈ వ్యాసాల తారతమ్యతలు చెబుతున్నాయి. తొలి వ్యాసంలోని ప్రాథమిక స్థాయి అంచనాలను మించిన విశ్లేషణ రెండవ వ్యాసంలో ఉంది. మూడవ వ్యాసం "ఖండ కావ్యములు"లో ఆయన పరిణతి మరింత స్పష్టమైంది. ఇందులో ఆయన నవ్యకవితలో ప్రముఖులుగా గుర్తింపును

పొందిన కొందరు ప్రతిభావంతుల గురించి మౌలిక వ్యాఖ్యలు చేశారు. వాటిని ఆయన మాటల్లోనే చెబితే –

రాయప్రోలు "సూక్ష్మాతి సూక్ష్మములగు విషయములను గురించి గంభీరతమములగు భావములను ప్రకటించుటలో కవి భూషణునకు గల చాతుర్యము ప్రశంసనీయము"

దువ్వూరి రామిరెడ్డి "సంస్కృతాంధ్రాంగ్ల ఫారసీక వాఙ్మయములతో చక్కని పరిచయముగల వీరి కలము నవనవానంద భావసుందర లతాంతములతో నవనవలాడుచుండును. క్రొత్తపాతల కూర్మికలయికయే ఈయన కావ్యములకు వన్నె పెట్టుచున్నది..."

వేంకట పార్వతీశ్వర కవులు "తీయని పదములను కూర్చుటలో వీరు ప్రోడలు"

అబ్బూరి రామకృష్ణారావు "రచనలు లావణ్య ప్రధానములు"

దేవులపల్లి కృష్ణశాస్త్రి "స్వైరవిహారధీరులు, తమయానందము కొరకే వ్రాయువారిలో నగ్రగణ్యులు. వీరి పద్యములను నాయని సుబ్బారావుగారి రచనలను పఠించునపుడు దుఃఖించుటయే వీరి స్వభావమనిపించును..."

కొడాలి ఆంజనేయులు "తెనుగు భాష చక్కదనమే వీరి కవిత. వ్రాసినది స్వల్పముగాని గుణము ఉత్కృష్టము"

జాషువా "వీరి ధారాశుద్ధి మిక్కిలి ప్రశంసనీయము. పద్యము లొకటి రెండు పర్యాయములు జదివిన కంఠస్థమై భావము చెవులలో ప్రతిధ్వనించుచుండును..."

తుమ్మల సీతారామమూర్తి చౌదరి "పద్యములు, ముఖ్యముగా సీసములు శ్రీనాథుని రచనా గాంభీర్యమును జ్ఞప్తికి దెచ్చును..."

విశ్వనాథ సత్యనారాయణ కవితా ప్రతిభ పట్ల రామానుజరావును ఆపారమైన గౌరవము. రాయప్రోలు కవితల తీరుపై నిరుపమానమైన అభిమానమూ రామానుజరావుకు ఉన్నాయి. కృష్ణశాస్త్రికవితా ధోరణులపై ఆయనకు అంతగా ఇష్టమున్నట్టు లేదు.

తెలంగాణ ప్రాంతంలో కవితా ప్రచారానికి కృషి చేసిన అంబడిపూడి వెంకటరత్నం ఆయన శిష్యులు ధవళా శ్రీనివాసరావు, పులిజాల హనుమంతరావు, సిరిప్రగడ భార్గవరావు, మద్దోజు సత్యనారాయణల్ని గురించి కూడా దేవులపల్లి ఈ వ్యాసంలో ప్రస్తావించారు. ఆయన ఈ వ్యాసం రాసేనాటికి తెలంగాణలో నవ్యకవితా

రీతులు ప్రముఖంగా ప్రచారంలోలేవు. అందువల్ల తెలంగాణ కవితావాతావరణం ఈ వ్యాసంలో కనిపించదు.

ఇప్పటిదాకా విశ్లేషించిన మూడు వ్యాసాలు ముప్పావు ముప్పీసం సానుకూల దృష్టితో రాసినవి.

నవ్యకవితా నీరాజనంలోని నాల్గవ వ్యాసం "అభ్యుదయ యుగము" అందుకు కొంత భిన్నరీతిలో ప్రతికూల వీక్షణంతో ఉంది. ఆనాటి కొంతమంది విమర్శకుల వలెనే రామానుజరావు కూడా అభ్యుదయవాదాన్ని ఇతర ధోరణుల్ని ఒకేచోట నిలిపి విశ్లేషించారనిపిస్తుంది. డాడాయిజం, సర్రియలిజం, ఇంప్రెషనిజం వంటి విస్వల్పకాలికమైనవని, మెరుపు వలె మెరిసి చరిత్రలో కలసిపోయినవి. అభ్యుదయవాదం అటువంటిది కాదు. దానికి సమకాలీనత ప్రాసంగికతలున్నాయి. అయితే రామానుజరావు "ఒక యిజం సమగ్రరూపం ఏర్పడకముందే మరో యిజం అయోమయం – అరాచకం ఏర్పడ్డాయి" అన్నారు. "పల్లెపడుచు నిర్మలమనస్కయగు యెంకి యింట నుండి బయలుదేరి కిన్నెరసాని యింట కళోపాసనము ముగించుకొని గోధూళివేళ నవ్యసాహిత్య వీధులందు మలయమారుతము సేవించుచున్న కవితా లతాంగి ఒక్క మారుగా యీ అరాచకత్వపు కారు చీకటులను యెదుర్కొనవలసి వచ్చినది. ఒక వంక నుండి శ్రీశ్రీగారు మరియొక వంక నుండి పఠాభిగారు అట్టహాసము గావించుచు ఆమెకు చికాకు కలిగించిరి" (పుట 149) అన్న వ్యాఖ్య రామానుజరావు నాడు శ్రీశ్రీ కవిత్వాన్ని పఠాభి కవిత్వాన్ని ఒకే తీరుతో చూశారని చెబుతోంది. అయితే ఇది విమర్శకలోకం అంగీకరించని విషయమే. పఠాభి కవిత్వం అట్టహాసమని ఆయన నిర్ద్వంద్వంగా అభిప్రాయపడ్డారు. అధి వాస్తవిక కవిత్వం పట్ల ఆనాటి పలువురు విమర్శకులవలెనే ఆయనకు కూడా సదభిప్రాయం లేదు. సౌరిస్, గోరా శాస్త్రిలను కూడా అధి వాస్తవిక కవుల జాబితాలో చేర్చారు రామానుజరావు. ఇదొక కొత్త ఆవిష్కరణ. అభ్యుదయ కవిత్వంలో "ఆనంద బాష్పాలకన్నా అశ్రుకణములే అధికం, ఉత్సాహం కన్నా నిరుత్సాహమే ఎక్కువ" అన్న అభిప్రాయంతో విమర్శకులు ఏకీభవించడం కష్టమే. తెలంగాణకు సంబంధించిన ముగ్గురు అభ్యుదయ కవుల కవితా విశ్లేషణ మాత్రం కొత్తదనంతో కూడుకున్నది. వారు పొట్లపల్లి రామారావు, దాశరథి, కాళోజీ

పొట్లపల్లి రామారావు పట్ల రామానుజరావుకు ఎంతో అభిమానం, గౌరవం. ఆయన వ్యక్తిత్వాన్ని, కవిత్వాన్ని దేవులపల్లి ఎంతో ఇష్టపడినట్టు ఆయన ఆత్మకథ చెబుతుంది... "అభ్యుదయ యుగము"లోనూ ప్రశంసనీయ వ్యాఖ్యలున్నాయి. "పొట్లపల్లి ప్రజాసముదాయపు ఆధిక్యతను కీర్తించారు" అన్నారు. అభ్యుదయ సాహిత్యపు ప్రధాన గుణాలలో ప్రజాధిక్యతను గుర్తించడం ఒకటి. 'దాశరథి కవితలు అభ్యుదయ కవిత్వానికి మేలి నిదర్శనాలు' అని ఆగిపోకుండా 'మార్క్సిస్టు సిద్ధాంతమునకు చక్కని భాష్యాలు వీరి గేయములు" అంటూ వైవిధ్యభరిత వ్యాఖ్య చేశారు. కాళోజీ కవిత్వాన్ని విశ్లేషించే క్రమంలో "కూరలోని ఉప్పు వలె కాళోజీ కవితలో రాజకీయము లొప్పుచుండును" అన్నారు. రామానుజరావు భావకవిత్వాన్ని ఇష్టపడినంతగా అభ్యుదయ కవిత్వాన్ని ఇష్టపడలేదనీ, అధి వాస్తవికత వంటి స్వల్పకాలిక కవితా ధోరణుల పట్ల ఆయనకు ఎంత మాత్రం ఇష్టం లేదనీ "నవ్యకవితా నీరాజనము" స్పష్టం చేస్తున్నది. ఆయన ఆధునికుడు, సంప్రదాయవాది కూడా. సంప్రదాయాన్ని నిర్ద్వంద్వంగా ఖండించని ఆధునిక దృక్పథ మున్న విమర్శకుడు. సంప్రదాయం హమేషా ఉంటుందని భావించే ఆధునిక సాహిత్య అధ్యయనశీలి. అందుకు అభ్యుదయ యుగము వ్యాసములోని ఈ వాక్యాలు సాక్ష్యాలు. అవ్యాసపు ముక్తాయింపులో రామానుజరావు ఇట్లా రాశారు:

"వాఙ్మయమున సంప్రదాయమును తృణీకరింపరాదు. సంప్రదాయము పవిత్రమైనది, మన సంప్రదాయమును పోషించుకొనుచు ఎన్నో మార్పులైననూ తేవచ్చును. ఎంత ముందుకైననూ పోవచ్చును అదియే నిజమైన ప్రగతి..." (పుట 159)

రామానుజరావు విమర్శల్లోని పలు విశిష్టతల్ని గుర్తించేందుకు 'సారస్వత నవనీతము'లోని మరికొన్ని వ్యాసాలు కూడా ఆధారాలు అవుతాయి. 1956లో చిలకమర్తి రచనల్ని గురించి ఆయన రేడియో ప్రసంగం చేశారు. ఒక సాహితీవేత్త యావత్ సుగుణాలను సింహావలోకనం చేసే రీతిలో ఈ ప్రసంగం ఉంది. "అల్పాక్షరాలలో అనల్పార్థ రచన" అన్న ఆదర్శానికి ఇది ప్రతిరూపం అనిపిస్తుంది.

ఎటువంటి మొహమాటాలకు తావునీయని నిష్కర్ష రామానుజరావు వాఖ్యల్లో స్పష్టపడుతుంది. చిలకమర్తిని గురించిన రేడియో ప్రసంగం ఒక చక్కని సాహిత్యవ్యాసం. అందులో ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు వైవిధ్యతతో కూడుకున్నవి. వాటిలో కొన్ని :

1. తెలుగు ప్రబంధ కవులలో ముక్కు తిమ్మన యెట్టివారో నవ్యాంధ్ర వచన రచయితలలో చిలకమర్తి అట్టివారు.
2. చిలకమర్తి వచనశైలి వీరేశలింగం పంతులు వచనశైలి కంటే బాగున్నది.
3. కందుకూరి హాస్యం కంటే చిలకమర్తి హాస్యం సున్నితమైంది.
4. పానుగంటి రచనల్లో సభ్యత హద్దులు దాటిన నిదర్శనాలు ఉన్నాయి. చిలకమర్తి రచనల్లో ఇది లేదు.
5. కథా కథనమే ప్రధాన ఉద్దేశముగా ఉన్నవి చిలకమర్తి కథలు.
6. భావిచరిత్రకారులకు చిలకమర్తి ఆత్మకథ ఎంతో విలువైన రచనగా పనికి వస్తుంది.

పుస్తక సమీక్షల్లోనూ సూక్ష్మమైన సాహిత్య విమర్శావైఖరి ఉంటుంది. అయితే సాహిత్య విమర్శా వ్యాసంలో లభించినంత విస్తృతి గ్రంథ సమీక్షలో లభించదు. సమీక్షకుడు గ్రంథానికే పరిమితమై వ్యాఖ్యలు చేయాలి. సాహిత్య విమర్శా వ్యాసం – గ్రంథ సమీక్ష ఎంత చేరువో అంత దూరమైనవి కూడా. రామానుజరావు ఈ తారతమ్యాలు తెలిసినవారు. అందుకే సాహిత్య విమర్శావ్యాసం – పుస్తక సమీక్ష ఈ రెంటిలో భేదాన్ని చూపించగలిగారు. ఆయన పుస్తక సమీక్షా వ్యాసాలు బాగా తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి. అందులో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్వీయచరిత్రకు సంబంధించిన సమీక్ష లెక్కించదగినది. సమగ్ర సమీక్షకు ఇదొక మంచినమూనా.

రామానుజరావుకు మునిమాణిక్యం నరసింహారావు పట్ల గౌరవం. ఆయన ఆత్మకథలోనూ మునిమాణిక్యం ప్రస్తావన ఉంది. "మునిమాణిక్యంవారి కాంతం" ఇది 1950 నాటి రేడియో ప్రసంగం. మొత్తం వ్యాసంలోనూ ఎక్కడా తీసివేయదగిన ఒక్కటంటే ఒక్క వాక్యం దొరకదు! ఇది శాస్త్రీయతను సంతరించుకున్న సాహిత్యవ్యాసం. సమీక్షాత్మక రీతిలో కనిపించినా సూక్ష్మ విశ్లేషణలతో కూడినది. కాంతం వ్యక్తిత్వంతోపాటు గిరీశం హాస్యాన్ని గురించి రామానుజరావు చేసిన వ్యాఖ్యలు గుర్తు పెట్టుకోవలసినవి.

"పట్టణాలలోనే గిరీశం కనబడతాడు. గ్రామ ప్రాంతాలలోని జనసామాన్యంలో గిరీశం కనబడదు. గిరీశం హాస్యం కొంతవరకు ఆంగ్ల భాషా పదాలపైన ఆధారపడి ఉంటుంది. పల్లెపట్టులలోని గ్రామీణులకు ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల వారికి

గిరీశం హాస్యం అర్థంకావడం కష్టం" (సారస్వత నవనీతము పే-68). వ్యాస ప్రారంభంలోని "భారత రామాయణాలలోని పాత్రలను విడిచిపెట్టితే ఆంధ్ర సారస్వతంలో సజీవమైన పాత్రలు చాలా తక్కువని ఒప్పుకోక తప్పదు" అనే అభిప్రాయం సంచలనాత్మకమే! "కాంతం జీవితమే ఒక లలిత మధుర శృంగార కావ్యం" "దాంపత్యంలో ఉండే విలువలకు కాంతం జీవితం ఒక మంచి నిదర్శనం". "ఆదర్శ గృహిణియైన మునిమణిక్యంవారి కాంతం తెలుగు నాయికలలో మాణిక్యం వంటిది" ఇటువంటి వాఖ్యలు చక్కని సూత్రీకరణలు.

విశ్వనాథ సత్యనారాయణ "వేయి పడగలు" నవలను గురించి విలువైన వ్యాసాల్ని రచించిన తొలి ఆధునిక విమర్శక పంక్తిలో దేవులపల్లి రామానుజరావు ఒకరు. విశ్వనాథ సాహిత్య వివేచనలో దిగ్గజం వంటి ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య ఈ మరుగునపడిన వాస్తవాన్ని ప్రస్తుత గ్రంథరచయితకు తెలియజేశారు. సుప్రసన్న అభిప్రాయపడినట్టు రామానుజరావు రచించిన వ్యాసానికి తగినంత గుర్తింపు రాలేదు. అందుకు కారణం ఏమిటో అర్థంకాదు. విశ్వనాథవారి వేయిపడగలు నవల వెలువడిన తొలి రోజుల్లోనే ఆ నవలకు రామానుజరావు అభిమాని అయ్యారని వ్యాసం తీరు విశదం చేస్తోంది. ఈ వ్యాసం ఆయన విద్యార్థి దశలో ఉన్నపుడు రచించింది. తెలంగాణ దినపత్రికలో ప్రచురణను పొందింది. విశ్వనాథ దృక్పథాన్ని సానుకూల రీతిలో బలపరచిన తీరు వ్యాసంలో బలంగా ఉంది. "విశ్వనాథ సత్యనారాయణగారి నవలలు విలక్షణమగు వ్యక్తిత్వము గలవి. వానిని పరభాషా నవలలతో పోల్చినప్పుడు తల వంచవలసిన యవసరము లేకపోవుటయేగాక గర్వించుటకు న్యాయమగు కారణములు గలవు". "చచ్చిపోవుచున్న యొకజాతి చివరి మెరుపులను జూచి వీరు తమ హృదయావేదన, భావోద్వేగము, స్వీయ నవలల యందు వెల్లడించి సంఘమునకు సక్రమమగు దారి చూపినారు. వేయిపడగలు, చెలియలికట్ట యిందుకు నిదర్శనములు" (సారస్వత నవనీతము పుట-60). ఒక మహా రచయిత సంఘమునందలి యన్యాయములను అధర్మములను ఖండించి యెదురు తిరిగిన క్షంతవ్యుడే. కానీ ఒక వ్యక్తి ప్రతిభావిశేషమును గుర్తింపని సమకాలికులు మాత్రము క్షమార్హులు కాజాలరు. సత్యనారాయణగారి గ్రంథములను జదివి పెదవి విరుచు వారీ విషయములను గమనించుట యావశ్యకము" (పుట 63) అన్న అభిప్రాయం దేవులపల్లికి విశ్వనాథ దృక్పథంతో ఉన్న ఏకీభావనను చెబుతోంది. వేయిపడగలు నవలలో "జాతీయవాయువులు ఎల్లెడలా వీచుచున్నవి" (పుట 67) అన్నదొక చక్కని

ఆలంకారిక వ్యాఖ్య! ఇంకా వయస్సు, సాహిత్యానుభవం పూర్తిగా వికసించని దశలోనే రామానుజరావు విశ్వనాథ వేయిపడగలులోని "నవతారీతి"పై చేసిన వ్యాఖ్య ఎంత పరిణతిలో కూడినదోననిపిస్తుంది. ఆ వ్యాఖ్య ఇది :

"ఉక్తి వైచిత్ర్యము కవితా గుణములలో నొక్కటి. మహాకవులగు విశ్వనాథ వారి రచనల యందీ గుణము సమృద్ధము. వారి వాక్య విన్యాసము నందొక చక్కదనము, భావములయందొక నూత్నత్వము, సౌందర్యము, ఉక్తివైచిత్రి, ఔన్నత్యము, గాంభీర్యము గాననగును. వేయి పడగలు భావ ప్రేరకమగు నవల, ఉత్తేజకరమగు రచన." (పుట 68)

"వ్యాస మంజూష"లో "ఆధునిక కవిత్వములో శబ్దరామణీయకము" అనే వ్యాసం ఉంది. ఈ సంకలనం 1956 అక్టోబర్ నాటిది. వ్యాసం ఏ పత్రికలో తొలుత వెలువడిందనే అంశంపై వ్యాసమంజూషలో స్పష్టతలేదు. అయితే ఆధునిక కవిత్వపు లోతుపాతులపై రామానుజరావు సమ్యక్ అవగాహనకు, ఆయన సూక్ష్మ విశ్లేషణా పాటవానికి ఈ వ్యాసం దర్పణం వంటిది. శబ్దరామణీయకత – కావ్యంలో దాని ఆవశక్యకతను ఆయన ఇట్లా పేర్కొన్నారు.

"శబ్ద రామణీయకత అనగా చక్కని పదాల యొక్క సొంపైన కూర్పు. కావ్య మాధుర్యమునకు ఇది చాలా అవసరము. మృదువైన భావాలను ప్రకటించుటకు రమణీయమైన శబ్దాలు కావలెను. శబ్ద రామణీయకతను నిర్ణయించునది శ్రవణ సుఖము" (వ్యాసమంజూష – పుట 36) ఆధునిక కవిత్వంలోని శబ్ద రామణీయక దృష్టిని దేవులపల్లి ప్రశంసించారు. క్రమేపీ తెలుగు కవితలో శబ్దరామణీయకత పట్ల తగ్గుతున్న శ్రద్ధపై అసంతృప్తిని ప్రకటించారు. రామానుజరావు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని గురించి రచించిన వ్యాసాలు ఆ దశలోని సాహిత్యం పట్ల ఆయన ఆసక్తినీ, అధ్యయన గాఢతను చెబుతున్నాయి. ఈ సత్యాన్ని గుర్తించిన ప్రముఖ విమర్శకులు ఆచార్య చేకూరి రామారావు ''ఈ తరం ఆయన్నుంచి నేర్చుకోవలసినదెంతో ఉంది'' ఆధునికాంధ్ర సాహిత్యాన్ని గురించి రామానుజరావుగారికి తెలిసినంత ఈనాటి సాహిత్య వృత్తిలో ఉన్న యువతరానికి తెలియదు" (సాహిత్య వ్యాసరించోళి, పుట 249, 250 రామానుజరావుగారి సాహిత్యవ్యక్తిత్వం – వ్యాసం) అని రాశారు.

సంప్రదాయ తెలుగు కవిత్వాన్ని గురించి రామానుజరావు రచించిన నాలుగు వ్యాసాలతో ఈ అధ్యాయాన్ని ముగించడం సముచితం. అవి శృంగాకవి పోతన,

క్షేత్రయ్య శృంగారము, సూరన కళాపూర్ణోదయము, ముద్దు పళనిరాధికాసాంత్వనము ఇవి సారస్వత నీవనతముతోపాటు వ్యాసమంజూషలోనూ ప్రచురణను పొందాయి. ఇందులో "శృంగారకవి పోతన"లో నూత్న దృష్టికోణం కనబడుతుంది. ఈ వ్యాసంలో "ఆంధ్ర శృంగారకవులలో పోతనది అగ్రతాంబూలము", "సుకుమార శృంగార చిత్రణలో ఆయనతో సమానుడులేడు", "పోతనతో శ్రీనాథుడు శృంగార రసవర్ణనలో సమానుడు కాడు". "శ్రీనాథ శృంగారం ఆకారవర్ణనకే పరిమితం" అని చెబుతూ "పోతనను శృంగారకవి అనడంలో తప్పేమిటి?" అని ప్రశ్నిస్తారు. "తెలుగుభక్తి కవులలో పోతన మున్నెన్నదగినవాడు" అనీ అన్నారు. శృంగారకవి పోతన వ్యాసంలో బలమైన తర్కం ఉంది.

క్షేత్రయ్య శృంగారము అనే వ్యాసంలో దేవులపల్లి ఆయన పట్ల ప్రత్యేకమైన గౌరవాదరాలు ఏవీలేవు. "క్షేత్రయ్య పదాలలో ప్రతి పంక్తి యందును ప్రతి పంక్తి యందును ప్రతి పదమునందును శృంగారమే ప్రత్యక్షమగుచున్నది" అని పేర్కొన్న ఈ వ్యాసం సమీక్ష స్థాయికి చెందింది.

"సూరన కళా పూర్ణోదయము" వ్యాసం బలమైన రచన. ఒక కవి కవన ప్రతిభను తరచుగా వ్యాఖ్యానిస్తూనే ఆ కవి సృజించిన కావ్యంలోని కథను పాత్రలను ఔచితీవంతంగా పరిచయం చేయడం ఈ వ్యాసంలోని ప్రత్యేకత. "ముద్దుపళని రాధిక" క్షేత్రయ్య శృంగారము" వ్యాసం కంటే మెరుగైనది. అయితే ఇది "సూరన కళాపూర్ణోదయము" స్థాయి వ్యాసంకాదు. "ముద్దుపళని శైలి బహు లలితమైనది. సుందరమైన శబ్దములను యేరి కూర్చుటలో ఆమె అత్యంత చతురురాలు" అని రామానుజరావు రాశారు. ఈ నాలుగు వ్యాసాలలో వ్యక్తం చేసిన అభిప్రాయాలలో కొన్ని వైరుధ్యాలున్నట్టు చేకూరి రామారావు గుర్తించారు. (సాహిత్య వ్యాసరించోళి పుట 258) తరచి చూసినపుడు చేరా పరిశీలన సంపూర్ణంగా సబబేననిపిస్తుంది. అయితే ఈ వైరుధ్యాలు రావడం వెనుక కారణాల్ని కూడా చేరా సరిగ్గానే చెప్పారు. "ఈ వ్యాసాలు వివిధ సందర్భాలలో రచించటం వల్ల ఇట్లాంటి వైరుధ్యాలు దొర్లి ఉంటాయి. ఈ వ్యాసాలను దేనికి దానికి ఒక యూనిట్‌గా చదివితే మనకీ ఇబ్బంది కలుగదు. అదీగాక రామానుజరావుగారు ఈ వ్యాసాలను తరతమ పరీక్షాదక్షులైన విమర్శకుల కోసం రాయలేదు. సామాన్యులైన చదువరులకు సాహిత్యాన్ని పరిచయం చెయ్యటం కోసం తయారుచేసిన వీవ్యాసాలు అని గుర్తు చేసుకుంటే ఈ వైరుధ్యాలను మరచిపోవచ్చు" అన్న చేరా అభిప్రాయం పూర్తిగా అంగీకరించదగినదే.

సాహిత్య వ్యాసరచయితగా రామానుజరావులో ఒక సహృదయుడు కనబడతాడు. ఆధునిక తెలుగుసాహిత్య విమర్శ తాలూకు అభివ్యక్తీకరణ సంక్లిష్ట స్థితిలోనే ఉన్న కాలంలో విమర్శకుడిగా సాహితీ ప్రపంచంలోకి అడుగు పెట్టిన రామానుజరావు తన సమకాలినులకు భిన్నమైన శైలిని అలవరచుకున్నారు. కొంతమంది అభిప్రాయం ప్రకారం ఆయన సాహిత్య వ్యాసాలు పత్రికా రచనకు బాగా దగ్గరగా ఉంటాయి. అయితే ఈ అభిప్రాయాన్ని పూర్తిగా అంగీకరించలేము. సాధారణ పత్రికారచనలో కనిపించని ఆలంకారిక శైలి రామానుజరావు వ్యాసాల్లో దొరుకుతుంది. రామానుజరావు శైలిని "ఉదార సరళ గ్రాంథికం"గా అభివర్ణించారు చేరా "కందుకూరి, చిలకమర్తి వంటివారు రాసిన వచనాన్ని సరళ గ్రాంధికం అన్నారు. రామానుజరావుగారి వచనం సరళ గ్రాంథికం నుంచి మరి కొంచెం వ్యావహారికం వైపు జరిగింది కానీ వ్యావహారిక భాషా స్ఫూర్తిని ఇంకా సంపాయించలేదు. అందువల్ల దీనికి సరియైన పేరు పెట్టాలంటే "ఉదార సరళగ్రాంథికం" అనాలి అన్నది చేరా అభిప్రాయం. ఇది అంగీకార యోగ్యం!

సాహిత్య విమర్శకుడిగా రామానుజరావుకు రావలసినంత గుర్తింపు వచ్చిందా? అని ప్రశ్నించుకుంటే, "లేదు, రాలేదు" అన్న జవాబే వినిపిస్తుంది. ఇందుకు కొన్ని కారణాలూ దొరుకుతాయి. 1940–50లలో రామానుజరావు సాహిత్య విమర్శలు విరివిగా రచించారు. అటు తరువాత ఈ దిశలో ఆయన రచనలు తగ్గుతూ వచ్చాయి. సంస్థాగత నిర్వాహకుడిగా ఆయన నిరంతరం ఏదో ఒక లక్ష్యంతో ఉండడం వల్ల కుదురుగా సాహిత్యవ్యాస రచన చేసే అవకాశం లభించి ఉండకపోవచ్చు. తనదైన విధ్యుక్త బాధ్యతను విస్మరించకుండా ఆయన చరిత్ర రచనలూ చేశారు. ఇది 1950ల తరువాత సంగతి. దీనితో ఆయన సాహిత్య విమర్శలు విస్మృతికి లోనయ్యాయి.

తెలంగాణలో తెలుగు సాహిత్య విమర్శకు నూత్న పథాన్ని ఆవిష్కరించిన కొంతమంది ప్రతిభావంతులలో విలక్షణులుగా రామానుజరావుకు సాహిత్య చరిత్రలో స్థానం దొరుకుతుంది.

గుణాలను గుర్తించే నేర్పు, భావుకతతో కావ్యాన్ని ఆస్వాదించే గుణం, సందిగ్ధతలకు తావు ఇవ్వని వ్యక్తీకరణ సామర్థ్యం, లోతైన అధ్యయనం విమర్శకుడికి అవసరమైన గుణాలని రామానుజరావు సాహిత్య విమర్శ చెబుతోంది.

రామానుజరావు నవనీత విమర్శకులు.

చేయి తిరిగిన చరిత్రకారుడు

సాహిత్యానికి చరిత్రకూ మధ్య సాన్నిహిత్యం ఉంటుందనే సత్యం చాలామందికి తెలిసిందే. సాహిత్యాన్ని అభిమానించే వారికి చరిత్ర పట్ల మక్కువ ఉండడం సహజంగానే కనిపిస్తుంది. అయితే సాహిత్యాన్ని గురించి రచనలు చేసినవారు చరిత్ర తాలూకు రచనలు చేయడం; చరిత్రలో రచనలు చేసినవారు సాహిత్యరచనలు చేయడం అరుదు. తెలుగు వాఙ్మయంలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, ఆదిరాజు వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి, మల్లంపల్లి సోమశేఖరశర్మ వంటి కొద్దిమంది విద్వాంసులు మాత్రం అందుకు మినహాయింపుగా కనబడతారు. వారి వరుసలో చేరదగిన రచయిత దేవులపల్లి రామానుజరావు. ఆయన కూడా వారి వలెనే సాహిత్య రచనలతో పాటు చరిత్రపై పుస్తకాలు కూడా రాశారు. ఆయన రచనలు సంక్షిప్తమైనవి, నిష్పాక్షికమైనవి, ప్రామాణికమైనవి. చరిత్ర గమనానికి అవి వ్యాఖ్యానాలు. ప్రధానంగా ఆధునిక తెలంగాణ చరిత్రకారులలో రామానుజరావుకు సముచితమైన స్థానం ఉంటుంది. "తెలంగాణలో జాతీయోద్యమాలు" ఇందుకు మంచి ఉదాహరణ. ప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ఆచార్య కాత్యాయనీ విద్మహే అభిప్రాయ పడినట్టు "తెలంగాణలో జాతీయ సాంస్కృతికోద్యమాల గురించి విలువైన సమాచారాన్ని తమ విస్తృత జీవనానుభవం నుండి రామానుజరావు తెలుగువారికి అందించారు. (ప్రాంతీయ చైతన్యం; తెలంగాణ సాహిత్యం : పుట 303). "తెలంగాణలో జాతీయోద్యమాలు" పలుమార్లు ముద్రణలు పొందింది. ప్రాంతీయ అస్తిత్వ ఆకాంక్షల పర్యవసానంగా వేగాన్ని పెంచుకున్న తెలంగాణ సాహిత్య-చారిత్రక-సాంస్కృతిక పరిశోధనలలో ఈ చిన్న పుస్తకం పెద్దగా తోడ్పడుతున్నది. ప్రసిద్ధ సాహితీవేత్త గడియారం రామకృష్ణశర్మ పేర్కొన్నట్టు "కాయమున చిన్నదైననూ విషయగౌరవమున ఉన్నతమైన రచన్నది". రామానుజరావు మరొక చారిత్రక రచన "తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం".

"తెలంగాణలో జాతీయోద్యమాలు" మొత్తం ఐదు ప్రధానాంశాలున్నాయి. హైదరాబాద్ ప్రజల స్వాతంత్ర్యోద్యమము, 19వ శతాబ్దములో హైదరాబాద్‌లో పత్రికా స్వాతంత్ర్యోద్యమము, తెలంగాణములో ఆంధ్ర సారస్వత వికాసము, ఆంధ్రసాహిత్యము- తెలంగాణము; విశాలాంధ్రోద్యమము-ఇందులో హైదరాబాద్

ప్రజల స్వాతంత్ర్యోద్యమము" అత్యంత కీలకమైనభాగం. రామకృష్ణశర్మగారే రాసినట్టు "మొదటి ఘట్టము విశేష పరిశ్రమ చేసి ఎక్కడెక్కడనో పడియున్న చారిత్రక పత్రముల కవిలెకట్టలను గాలించి సేకరించిన ఆధారాలతో వ్రాసినట్టిది..."

హైదరాబాద్ ఆనాడు ఒక పెద్ద సంస్థానం. 1857లో జరిగిన మొదటి స్వాతంత్ర్య సమరంలో అనేక సంస్థానాల పాత్రను గురించి చరిత్ర చెబుతోంది. ఆయా సంస్థానాధీశులు సమరంలో పాల్గొనడం వల్ల చరిత్రలో ఈ చిత్రణ జరిగింది. హైదరాబాద్ సంస్థానాధీశులు మాత్రం ఆరోజుల్లో బ్రిటిష్ వారికి వీరవిధేయతను ప్రకటించారు. అయితే ఇక్కడి ప్రజానీకం వారితో ఏకీభవించలేదు. కొన్నిచోట్ల తిరుగుబాట్లు జరిగాయి. తాంతియాతోపే, నానాసాహెబ్‌ల శిష్యులు గూఢచారులుగా హైదరాబాద్ ప్రాంతంలో పర్యటించి ఉద్యమాన్నిన బలోపేతం చేశారు. నాటి చారిత్రక వాస్తవికల్ని గురించి రామానుజరావు ఇట్లా వ్యాఖ్యానించారు.

"1857 నుండి 1859 వరకు అనగా రెండు సంవత్సరాలు పూర్తిగా హైదరాబాద్ నాయకులు తాంత్యాతోపేతో సన్నిహిత సంబంధాలు కలిగియుండిరి. ఈ కాలమున విదేశీపాలనను తుదముట్టించుటకు జరిగిన మహా ప్రయత్నాలలో అసంఖ్యాకులు పాల్గొనియుండిరి. ఎన్నియో నూర్లమంది చెరసాలలో నిర్బంధింపబడిరి. లక్షల రూపాయల విలువ గల ఆస్తి జప్తు చేయబడియుండెను. ఈ విధముగా 1857 నాటి స్వాతంత్ర్య సంగ్రామమున హైదరాబాద్ సంస్థాన ప్రజలు తమ వంతును పూర్తిగా పంచుకొని యుండిరి. ఇతర రాష్ట్రాల వారికి ఈ విషయమున ఈ ప్రాంత ప్రజలు ఏ మాత్రమును తీసిపోలేదు". ఇక–నాటి పాలనారంగ ప్రముఖులు సాలార్‌జంగ్. ఆయనను పరిపాలనా దక్షుడిగా, సంస్కర్తగానూ చరిత్రకారులు చెబుతారు. కానీ ఆయన బ్రిటిష్ వీరవిధేయతను చాలామంది పేర్కొనడం కనబడదు. రామానుజరావు ఎటువంటి మొహమాటానికి తావులేకుండా "సాలార్జంగ్ ఇంగ్లీషు వారికి అండగా నిలిచి స్వాతంత్ర్యోద్యమాలను అణచడానికి తోడ్పడి మన దేశ చరిత్రలో తన కీర్తిని శాశ్వతముగా కళంకము చేసికొనినాడు. సాలార్జంగ్ ఒకవైపున బ్రిటిష్ వారిని బలపరచుచుండగా ప్రజలు వారికి వ్యతిరేకముగా పనిచేసిన సత్యము గమనింపదగియున్నది.." అని రాశారు. 1857 కంటే ముందు కూడా జరిగిన పలు పోరాట ఘటనల్ని ఈ అధ్యాయంలో పొందుపర్చారు. వాటిలో కొన్ని :

1. 1803వ సంవత్సరంలో ఆంగ్లేయులు – మహారాష్ట్రుల మధ్య జరిగిన యుద్ధంలో ఆసఫ్‌జాహీలు ఆంగ్లేయులవైపు మొగ్గుచూపారు. నాడు బీరార్ రాష్ట్రానికి మహీపతిరాయ్ అనే ఆయన గవర్నర్. యుద్ధంలో మహారాష్ట్రులకు వ్యతిరేకంగా

పనిచేయాలని నిజాం రాజ్యం ఆయనను ఆదేశించింది. మహిపతిరాయ్ ఈ ఆజ్ఞల్ని ధిక్కరించాడు. నాటి ప్రధాని మీర్ ఆలం ఆయనను పదివి నుండి తొలగించాడు. మహీపతిరాయ్ షోలాపూర్ వెళ్ళి అక్కడ తన తిరుగుబాటు ప్రయత్నాలకు పదును పెట్టాడు. 1806లో నిజాం సైన్యాన్ని ఓడించిన మహీపతిరాయ్ మరికొద్దిరోజుల వ్యవధిలో బ్రిటిష్ సైన్యం చేతిలో ఓడిపోయాడు. దీనమైన స్థితిలో మహీపతి రాయ్ మరణించాడు. "హైదరాబాద్ రాష్ట్రములో ఇంగ్లీషు పరిపాలనను ప్రతిఘటించిన మొట్టమొదటి సంఘటన" అంటూ దీన్ని పేర్కొన్నారు రామానుజరావు. చరిత్రలో మరుగునపడిన వీరుడు మహీపతిరాయ్.

2. 1808తో బొల్లారంలోని బ్రిటిష్ సైన్యాలను ఇంగ్లీషు వారికి వ్యతిరేకంగా తమవైపు తిప్పుకునేందుకు నూరుల్ ఉమ్రా; రావు రంభానింబాల్కర్ అనే ఇద్దరు జాగీర్దార్లు ప్రయత్నించారు. వారిని నిజాం ప్రభుత్వం తమ తమ జాగీరులు దాటకూడదని ఆజ్ఞాపించింది.

3. 1817వ సంవత్సరంలో మూడవ మహారాష్ట్ర యుద్ధం జరిగితే నిజాం సైన్యం బ్రిటిష్‌వారికి మద్దతు తెలుపుతూ యుద్ధంలో పాల్గొన్నది. అయితే కొంతమంది రోహిల్లాలు మహారాష్ట్రులకు వ్యతిరేకంగా పోరాడేందుకు నిరాకరించారు. అపుడు వారు ఉద్యోగాల నుండి తొలగించబడ్డారు. అట్లా తొలగింపబడిన వారిలో సర్దార్‌ఖాన్ కోటేజాయీ అనే సైనికుడు ముఖ్యుడు. ఆయన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పీష్వాలతో కలిసి యుద్ధరంగంలో పోరాటం చేస్తూ వీరమరణాన్ని పొందాడు. "ఆయన మరణానికి హైదరాబాదు నగరములోని ముషీరాబాద్ – చంచల్‌గూడ ప్రాంతంలోని ప్రతి రోహిల్లా కుటుంబము శోకించినట్లు ఆధారములు కలవు" అని రామానుజరావు రాశారు.

4. 1857లో సిపాయిల తిరుగుబాటు సందర్భంలో హైదరాబాద్‌లోని రెసిడెన్సీ భవన ముట్టడిలో పాల్గొన్న రోహిల్లా వీరుడు తుర్రెబాజ్‌ఖాన్, మరొక ఉద్యమకర్త మౌల్వీ అల్లా ఉద్దీన్‌ల గురించి రామానుజరావు ప్రస్తావించారు.

5. కౌలాస్ జాగీర్దారు రంగారావు 1857 తిరుగుబాటులో పాల్గొన్నాడు. బ్రిటిష్‌వారు ఆయనపై "ప్రత్యేకముగా అల్వాలీలో విచారణ జరిపి మరణశిక్ష విధించారు" అని రామానుజరావు రాశారు.

6. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ప్రాంతంలో గోండులు – ఇంగ్లీషు వారికి మధ్యయుద్ధం జరిగింది. రాంజీ గోండు ఈ పోరాటంలో అమరుడయ్యాడు. "రాంజీ

గోండు నిర్బంధితుడై నిర్మల్‌కు తీసుకొని రాబడి అక్కడ ఒక చెట్టుకు ఉరితీయబడి చంపబడెను. ఈనాటికి ఆ చెట్టు నిర్మల్‌లో ఉన్నది. దానిని రాంజీ గోండు చెట్టు అని చెప్పెదరు...”

1803–1858 సంవత్సరాల మధ్య తెలంగాణ ప్రాంతంలో బ్రిటిష్ వలసపాలనను వ్యతిరేకిస్తూ కొన్ని గట్టి పోరాటాలే జరిగాయని రామానుజరావు స్పష్టమైన సమాచారంతో పేర్కొన్నారు. ఆయన రచించిన సంగతులలో కొన్ని అంశాలు స్పష్టమవుతున్నాయి. అవి ఆయన వాక్యాలలోనే చెబితే :

1. అన్ని జిల్లాలలో స్వాతంత్ర్యోద్యమము వ్యాప్తి జెంది అభివృద్ధి చెందెను. బ్రిటిష్ ప్రభుత్వమునకు వ్యతిరేకముగా తిరుగుబాటులు చెలరేగినవి.

2. నూర్లమంది చంపబడిరి.

3. వేలకొద్ది జనులు నిర్బంధములో నుంచబడిరి.

4. దజన్లవీరులు అండమాన్ దీవులకు పంపబడిరి.

5. లక్షల రూపాయల ఆస్తి జప్తు చేసుకొనబడెను.

“19వ శతాబ్దములో హైదరాబాద్‌లో పత్రికా స్వాతంత్ర్యము అన్నది చాలా చిన్న అధ్యాయం, (పుట 27–32). అయినా ఇది ఎంతో విలువైనది. పలు గ్రంథాలలో దొరకని సమాచారం ఈ ఐదు పుటల్లో పదిలపరచారు రచయిత. ఈ ఐదుపుటల అధ్యాయంలోని ఉల్లేఖనీయమైన అంశాలు ఇవి :

1. 1891లో ఆస్మాన్‌జా ముఖ్యమంత్రిగా ఉన్నపుడు హోమ్ సెక్రటరీ ఫతేనవాజ్ జంగ్ సంతకంతో పోలీస్ కమిషనర్‌కు ఒక నోటీసు పంపించారు. ఈ క్రమంలో ఆ నోటీసు ద్వారా పత్రికలు స్థాపించేవారు “ఎకరార్‌నామా”ను సమర్పించాలని స్పష్టం చేశారు. దాన్ని సమర్పించినప్పటికీ, తాము అనుకున్న సమయంలో పత్రిక ప్రచురణ నిలిపివేసే హక్కు తమకు ఉంటుందని సర్కారువారి తాఖీదు స్పష్టం చేసింది. అంటే 19వ శతాబ్ది చివరినాటికే అంటే హైదరాబాద్ సంస్థానంలో పత్రికలు ఇంకా అభివృద్ధి చెందని స్థితిలోనే నిజాం సర్కారు వాటిపై ఆంక్షలు విధించినట్టు స్పష్టమవుతున్నది.

2. నిజాం సంస్థానంలో పత్రికా స్వాతంత్ర్యానికి ఏడు షరతులతో కూడిన ఏకరార్‌నామా పెద్ద అవరోధం వలె పరిణమించింది.

3. ఎకరార్‌నామా పట్ల కొన్ని పత్రికల్లో సహజంగానే ప్రతికూల ప్రతిస్పందన వెలువడింది. 1891వ సంవత్సరం జూన్ 11వ తేదీనాడు దక్కన్ టైమ్స్ తన నిరసనను ప్రకటించింది.

4. "షౌకతుల్ ఇస్లాం" పేరుతో హైదరాబాద్ నుండి ఒక పత్రిక ప్రచురణ అవుతూ ఉండేది. హాజీకమ్రాన్ అనే నిర్భయసాహసి సంపాదకుడుగా ఉండేవాడు. ఎకరార్‌నామాను షౌకతుల్ ఇస్లాం గట్టిగా ఖండించింది. ఈ సందర్భంగా 1891 జూన్ 14నాటి సంపాదకీయంలో పత్రిక తన అభిప్రాయాల్ని నిర్ద్వంద్వంగా వెల్లడించింది. ఈ సంపాదకీయానికి "హంతకకాండ" అనే శీర్షిక పెట్టారు. "పత్రికా సంపాదకులు, స్వాతంత్ర్య ప్రియులందరూ ఈ సంపాదకీయమును పఠించవలసియున్నది" అని రామానుజరావు వ్యాఖ్యానించారు. ప్రభుత్వ అణచివేత ధోరణుల వల్ల "షౌకతుల్ ఇస్లాం" పత్రిక ప్రచురణ నిలిచిపోయింది.

అనంతర భాగంలోని "తెలంగాణములో ఆంధ్రోద్యమము" అనే అంశం సామాన్యమైనదే. ఇదే అంశాలు అనేక పుస్తకాలలో ప్రస్తుతం లభ్యమవుతున్నాయి. అయితే రామానుజరావు ఈ రచన చేసే నాటికి ఆ అంశాలు పెద్దగా వ్యాప్తిలోలేవు.

ఇక, "ఆంధ్ర సాహిత్యము-తెలంగాణము" అన్న మరొక చిన్న భాగంలో రామానుజరావు చేసిన విశ్లేషణలు ఉల్లేఖనీయమైనవి. 1940-48 సంవత్సరాల నడుమ కీలకకాలంలో తెలంగాణ నుండి రెండు అత్యుత్తమ రచనలు వెలువడ్డాయని రామానుజరావు అభిప్రాయం. అవి గోలకొండ కవుల సంచిక, ఆంధ్రుల సాంఘిక చరిత్ర. వీటిలో ఒకటి సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వంలో ప్రచురణ పొందితే మరొకటి ఆయన స్వీయరచన. రామానుజరావుకు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు పట్ల ఉన్న అభిమానం పలు సందర్భాలలో వ్యక్తమైంది. ఆయన కొమర్రాజు వారిని అభిమానించేందుకు స్పష్టమైన ప్రాతిపదికలున్నాయి. గ్రంథాలయోద్యమాన్ని నిర్వహించడం, విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ప్రచురణలు జరపడం, చరిత్రలో పరిశోధనా వికాసాన్ని సాధించడం కొమర్రాజు ఘనతలని రామానుజరావు విశ్లేషించారు. 1900-1950 సంవత్సరాల మధ్య తెలంగాణ వాఙ్మయాన్ని పరిశీలిస్తే అందులో నాలుగు కీలకమైన మైలురాళ్ళు కనబడతాయని ఆయన భావించినట్టు అర్థమవుతుంది. అవి **1. చరిత్ర పరిశోధన 2. విజ్ఞాన వాఙ్మయ నిర్మాణము 3. కథానిక రచన 4. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంఘర్షణ ఫలితమైన కవితారచన.**

వీటిలో మొదటి, రెండవ, నాల్గవ అంశాలు సాధారణమైనవే, అయితే మూడవ అంశమైన కథానికా రచన మాత్రం రామానుజరావు ప్రత్యేకంగా గుర్తించింది. ఈ దిశలో ఆయన విలక్షణ దృష్టి కోణం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఆయన "తెలంగాణలో జాతీయోద్యమాలు" రచన చేసే నాటికి తెలంగాణలో ఆధునిక కథానిక అస్తిత్వంలో ఉన్నదనే విషయాన్ని కూడా విమర్శకులు గుర్తించలేదు. రామానుజరావు తెలంగాణ బిడ్డ, ఇక్కడి ఆధునిక ప్రక్రియా పరిణామాల్ని అత్యంత సన్నిహితంగా వీక్షించిన సాహితీవేత్త. అందుకే చాలామంది గుర్తించని కథానికా వికాసాన్ని ఆయన గుర్తించగలిగారు. ఆ రోజుల్లో రామానుజరావు పేర్కొన్న కథానికా రచన అన్నది తెలంగాణలో విరివిగా జరిగినట్టు పలువురు ఆధునిక పరిశోధకుల ఆవిష్కరణలు నిరూపిస్తున్నాయి.

"తెలంగాణలో జాతీయోద్యమాలు"లో చివరిభాగం విశాలాంధ్రోద్యమము. రామానుజరావు తొలి నుండి తెలంగాణ పట్ల అపారమైన అభిమానాన్ని చూపించిన వారే కానీ, ఏనాడూ ప్రత్యేక తెలంగాణవాది కారు. ఈ చారిత్రక వాస్తవికతను మరుగుపరచవలసిన అవసరం కూడా లేదు. విశాలాంధ్రవాదిగా తన బలమైన గళాన్నే వినిపించారాయన. విశాలాంధ్రకు సంబంధించిన అంశాలు పేర్కొనవలసిన ప్రతి సందర్భలోనూ సానుకూల ప్రాతిపదికలే కనిపించడం చూడవచ్చు. విశాలాంధ్ర ఉద్యమానికి అంకురార్పణ చేసిన అయ్యదేవర కాళేశ్వరరావుకు రామానుజరావు బాగా సన్నిహితులయ్యారు. హైదరాబాద్, వరంగల్లులతోపాటు పలు ప్రాంతాల్లో విశాలాంధ్ర భావన బలోపేతం అయ్యేందుకు సభలు నిర్వహించారు.

"విశాలాంధ్రోద్యమము" అన్న భాగం చారిత్రక స్పష్టత ప్రతిబింబించింది. విశాలాంధ్రోద్యమం ఆరంభమైన తీరును, ఉద్యమం విస్తరించిన పద్ధతిని, పరస్పర విరుద్ధమైన ఆనాటి నాయకుల ధోరణుల్ని రామానుజరావు స్పష్టంగా పరిచయం చేశారు. మాడపాటి హనుమంతరావు, పల్లెర్ల హనుమంతరావు, భోజ్‌రాజ్, బాజ్జం నర్సింలు, కొమ్మవరపు సుబ్బారావు, ఆదిరాజు వీరభద్రరావు, శ్యాంరావు, మీర్ అహ్మద్ ఆలీఖాన్, సర్దారుల్లాఖాన్, శంకరలింగం, రంజిత్‌సింగ్, భద్రదేవ్ – వీరందరూ ఆనాటి విశాలాంధ్రవాదులు. తొలుత హైదరాబాద్ రాష్ట్ర విభజననే వ్యతిరేకించినవారు మందుముల నరసింగరావు, నవాబ్ మెహదీ యార్‌జంగ్, వినాయకరావు విద్యాలంకార్, గోపాలరావు ఎగ్బోటే, పండిట్ నరేంద్రజీ కల్నల్ వాజ్రీలు, ఆంధ్రజనత, తెలుగుదేశం, డెయిలీన్యూస్, సియాసత్, ఫయామ్, విశాలాంధ్ర, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, విజయవాణి తదితర పత్రికలు విశాలాంధ్ర వాదానికి మద్దతు పలికినట్టు రామానుజరావు రచన చెబుతోంది. తెలంగాణ – ఆంధ్ర ప్రాంతాలు విలీనం అయ్యేందుకు నాటి ఆంధ్ర ప్రాంతనాయకులు ఎక్కువ ఆసక్తిని చూపినట్టు

చరిత్రకారులు చెబుతారు. ఇది అక్షరసత్యమని రామానుజరావు రచన చెబుతోంది. "ఆంధ్ర నాయకులు తెలంగాణమునకు బ్లాంక్ చెక్ ఇచ్చుటకు సిద్ధముగానున్నట్లు ప్రకటన గావించిరి" (తెలంగాణలో జాతీయోద్యమాలు పుట 103) అని ఆయన రాశారు.

నానాటికీ విలువ పెరిగే చక్కని చారిత్రక రచనగా "తెలంగాణలో జాతీయోద్యమాలు"ను అభివర్ణించవచ్చు.

"తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము" రామానుజరావు చారిత్రక-సాంస్కృతిక రచన. తొలుత ఈ పుస్తకం 1962లో వెలుగుచూసింది. అటు తరువాత వరుసగా 1972 నాటికి ఐదు ముద్రణలు పొందింది. మొత్తం అప్పటికే పదివేలకుపైగా ప్రతులు చెల్లుబాటు అయ్యాయి. 1970లలో బాగా గుర్తింపును సాధించిన కాల్పనికేతర (నాన్‌ఫిక్షన్) రచనలలో ఇదీ ఒకటి. రామానుజరావుకు బాగా పేరును తెచ్చిన పుస్తకాలలో "తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము" కూడా ఉంటుంది. ఇది సంశ్లేషణాత్మక రచన. తెలంగాణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో చోటు చేసుకున్న చారిత్రక పరిణామాలు; వాటికి అనుబంధంగా సాంస్కృతిక-సాహిత్య వికాస క్రమాన్ని ఈ రచన చక్కగా పరిచయం చేసింది. రామానుజరావు కేవలం పాత సంప్రదాయాలను మాత్రమే గౌరవించిన సాంస్కృతిక వ్యాఖ్యాతకాదు. ఆయన వినూత్నతకు నిరంతరం స్వాగతం పలికారు. పాత అన్న పునాదిపై కొత్త అనే అందమైన భవంతిని నిర్మించాలని కోరుకున్నారు. "సాంస్కృతిక పునరుజ్జీవనం" అనే అంశం మీద పలువురు సాంస్కృతిక చరిత్రకారులకు అభిప్రాయ భేదాలు ఉండవచ్చు, ఈ క్రమంలో సందిగ్ధతలు - అస్పష్టతలు కూడా ఏర్పడవచ్చు. రామానుజరావుకు మాత్రం "సాంస్కృతిక పునరుజ్జీవనం"పై పరిపూర్ణమైన స్పష్టత వుంది. "ఒక జాతి విస్తృత సంస్కృతిని వెలుగులోనికి తెచ్చుటయేకాక కొన్నినాళ్ళుగా ఆమోదించి యభినందించిన వైదేశిక సంస్కృతీ మిళనముచే దానిని మరింత పరిపుష్టము జేసి సర్వాంగసుందరముగా జేయుటయే మన దేశపు సాంస్కృతిక పునరుజ్జీవనము" అని రామానుజరావు నిర్వచించారు. "తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము"లో ఆయన వ్యక్తం చేసిన కొన్ని అభిప్రాయాలు ఇవి :

1. "రాజకీయరంగమున 1935వ ప్రాంతమున కమ్యూనిస్టుపార్టీ తలయెత్తినది. ఈ పక్షానికి ప్రత్యేక రాజకీయాదర్శాలు గలవు. తమ రాజకీయ సిద్ధాంతాలకు ఆదర్శాలకు అనుగుణముగా సాంస్కృతిక కార్యకలాపాలలో ఈ పక్షము వారు శ్రద్ధ

వహించిరి. రచయితల సంఘాలు, వేసవి పాఠశాలలు, దినపత్రికలు, వారపత్రికలు, బుర్రకథలు, నాటకాలు, పుస్తకాల ప్రకటన మొదలైన సాంస్కృతిక కార్యకలాపాలలో వీరి రాజకీయాదర్శాలు ప్రతిబింబితమగుచున్నవి" (పుట 21).

2. "ఆశుకవిత్వావధానములే, నాటక ప్రదర్శనాలే ఆకాలమున రాజకీయముగా వేరుపడి పరస్పరము రాకపోకలు లేక ఒకరిని గూర్చి ఒకరికి సరిగా తెలియకయుండిన ఆంధ్ర తెలంగాణ ప్రజల మధ్య ఏకైక బంధముగా నుండెనని చెప్పినచో సత్యమునకు తలంపులు కలుగజాలవు" (పుట 25).

3. పిఠాపురము మహారాజావారి పోషకత్వమున స్థాపింపబడి నిర్వహింపబడిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు చేసిన సాంస్కృతిక సేవ మిక్కిలి గొప్పది.... ఆనాడాంధ్ర దేశమున ఈ సంస్థ యొక గొప్ప సాంస్కృతిక కేంద్రముగా నుండెను. కాని కాలప్రభావమున వచ్చిన మార్పులను స్వీకరించలేకపోయినందున భాషావిషయమై రచన విషయమైన కొత్తదనమును వ్యతిరేకించినందువలన ఈ సంస్థ యువకులకు, నూతన మార్గాన్వేషకులకు కాలము, మార్పులను గుర్తించిన సహృదయులైన విద్వాంసులకు దూరమైనది... (పుట 30).

4. "ఆంధ్ర నాటక రచనకు పుట్టినిల్లు బళ్ళారి నగరము. నాటక రచనకు నాటక ప్రదర్శనలకు ఈ బళ్ళారియే మార్గదర్శి." (పుట 32)

5. "1650 నుండి 1875 వరకు తెలుగు భాషలో ఉజ్వలమైన సాహిత్యము తక్కువనియే చెప్పవలెను. శతకాలను కీర్తనలను విడిచిపెట్టిన ఈ కాలమున ప్రతిభావంతమగు సాహిత్యము మిక్కిలి కొద్ది" (పుట 41).

6. "చిన్నకథ పాఠకుల నన్నింటికంటె ఎక్కువగా ఆకర్షించినది" (పుట 45)

7. "హాస్యము, మనస్తత్వ పరిశీలన, పాత్ర పోషణ, పానుగంటి నాటకాలలో ముప్పిరగొనియున్నవి" (పుట 47).

పై ఉటంకింపులు రామానుజరావు దృక్పథాన్ని సాహిత్యంలోని వివిధ ప్రక్రియల దిశ–దశల్ని అంచనా వేయడంలో ఆయన ప్రజ్ఞను పరిచయం చేస్తున్నాయి. సంగీతము, చిత్రకళ, నాటకం వంటి అనేక లలిత కళా శాఖల్ని ఆయన "తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం"లో వివరించారు. అపారమైన సమాచారం, అందమైన వాక్యవిన్యాసాలతో ఈ పుస్తకం సామాన్య పాఠకుల్ని కూడా చక్కగా చదివిస్తుంది.

ఖచ్చితత్వంతో కూడిన సమాచార ప్రకటన, సమ్యక్ దృష్టిని కలిగిన లోతైన విశ్లేషణలు సమకాలీన చరిత్ర రచనల్లో రామానుజరావు గ్రంథాల విశిష్టతల్ని చెప్పకనే చెబుతాయి.

తెలంగాణ సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

1.	కదనంలోనూ, కథనంలోనూ మేమే...	రూ. 150/-
2.	డా॥ దేవులపల్లి రామానుజరావు	రూ. 100/-
3.	డా॥ దేవులపల్లి రామానుజరావు గ్రంథావళి	రూ. 300/-
4.	తెలంగాణ వైతాళికులు డా॥ దేవులపల్లి రామానుజరావు శతజయంతి ప్రత్యేక సంచిక	రూ. 200/-
5.	శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి	రూ. 200/-
6.	తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం	రూ. 100/-
7.	తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర	రూ. 150/-
8.	తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు(వ్యాస సంకలనం)	రూ. 200/-
9.	బంజారాల వివాహ ఆచార పద్ధతులు	రూ. 60/-
10.	యాభై సంవత్సరాల జ్ఞాపకాలు డా.దే.రామానుజరావు	రూ. 100/-
11.	మా వూరు మాట్లాడింది	రూ. 40/-
12.	పరిణతవాణి (ఏడవ సంపుటి)	రూ. 125/-
13.	తెలంగాణ చరిత్ర	రూ. 220/-
14.	సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు	రూ. 240/-
15.	తెలుగు జానపద సాహిత్యము - స్త్రీల గేయములలో సంప్రదాయము	రూ. 250/-
16.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ. 100/-
17.	తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ. 70/-
18.	తెనుగు సాహితి	రూ. 36/-
19.	స్త్రీల రామాయణపు పాటలు	రూ. 36/-
20.	సమీక్షణం	రూ. 36/-
21.	పరిణతవాణి - 1,2,3,4,5,6 సంపుటాలు (రూ.36,45,60,65,60,150)	రూ. 370/-
22.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ. 70/-
23.	ఇరివెంటి వ్యాసాలు	రూ. 30/-
24.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ. 15/-
25.	రాయప్రోలు రచనలు - తత్వవివేచన	రూ. 60/-
26.	తెలుగు సాహిత్యోద్ధారకులు	రూ. 40/-
27.	మల్లికా గుచ్ఛము	రూ. 8/-
28.	మన జాతినిర్మాతలు	రూ. 4/-
29.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ. 24/-
30.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ. 50/-
31.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ. 250/-
32.	తెలంగాణలో జాతీయోద్యమాలు	రూ. 10/-
33.	సంస్కృత పాఠవల్లరి	రూ. 4/-
34.	నా సాహిత్యోపన్యాసములు	రూ. 5/-
35.	గౌతమబుద్ధుడు - జవహర్‌లాల్ నెహ్రూ	రూ. 3-60
36.	విమర్శకవతంసులు	రూ. 45/-
37.	మన దేశం - తెలుగుసీమ	రూ. 7/-
38.	మన నదులు - కృష్ణా గోదావరులు	రూ. 3/-
39.	మధురభక్తి - ముగ్ధభక్తి	రూ. 80/-
40.	ప్రాచీన కవిత	రూ. 10/-
41.	ప్రసంగ వ్యాసాలు	రూ. 5/-
42	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ. 2/-
43.	నా రేడియో ప్రసంగాలు	రూ. 5/-
44.	సాహిత్యానువాదం : సమాలోచనం	రూ. 60/-
45.	శివరాత్రి మాహాత్మ్యము	రూ. 75/-
46.	ఆంధ్ర వాఙ్మయ చరిత్ర	రూ. 85/-
47.	సాహిత్య సోపానములు	రూ. 75/-
48.	మన హాస్యము	రూ. 100/-
49.	తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం	రూ. 100/-
50.	వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు)	రూ. 130/-
51.	తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం	రూ. 150/-